www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఇంట్లో తల్లి మృతదేహం చెంత 9 రోజులు!


మృతురాలు లలిత (ఫైల్)

- ఆమె హఠాన్మరణంతో షాక్‌లోకి ఇద్దరు కుమార్తెలు
- మణికట్టు, గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం
- మూడు రోజులు స్పృహ కోల్పోయిన అమ్మాయిలు
- ఆ తర్వాత డిప్రెషన్‌తో మృతదేహం చెంతే..
- ఇన్నాళ్లు డోర్లు క్లోజ్.. దుర్వాసన పెరగడంతోనే బయటకు
- స్థానిక నేతను కలిసి అంత్యక్రియలకు సాయం కోరిన వైనం.. ఘటనపై అనుమానాలు

3

శనివారం | 1-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 304 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: తదియ ఉ. 11.39 తదుపరి చవితి; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 2.33 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: ఉ.10.11-11.40; దుర్ముహూర్తం: ఉ.6.50-8.20; అమృతఘడియలు: రా.7.06-8.35; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.06 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ధరలు దిగొస్తాయ్!

కేంద్ర ఆర్థిక సర్వే ఆశాభావం

కూరగాయల ధరలు తగ్గడంతోపాటు ఖరీఫ్ పంట చేతికి రానుండటంతో మార్చి చివరి నాటికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టనుందని ఆర్థిక సర్వే 2024-25 అంచనా వేసింది. గ్రామీణ మార్కెట్ గిరాకీ, పెరిగిన పంట దిగుబడి.. స్వల్పకాలిక వృద్ధికి దోహదపడనున్నాయని పేర్కొంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించాలంటే వచ్చే రెండు దశాబ్దాలపాటు 8% వార్షిక వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని ఆర్థికసర్వే అభిప్రాయపడింది. దీనికోసం తయారీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని, కృత్రిమ మేధ, రోబోటిక్స్, బయో టెక్నాలజీ రంగాల్లో విస్తృత పెట్టుబడులు అవసరమని సూచించింది. 2030 నాటికి వ్యవసాయేతర రంగాల్లో 78.5 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించాల్సి ఉందని పేర్కొంది. 2024-25లో జీడీపీ వృద్ధి రేటు 6.3-6.8% మధ్య నమోదయ్యే చాన్స్ ఉందని సర్వే అంచనా వేసింది.



- మార్చి నాటికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.3-6.8% వృద్ధి
- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు 8% వృద్ధి అవసరం
- పెట్టుబడులను జీడీపీలో 35 శాతానికి పెంచాలి
- ఏఐ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ రంగాల్లో మరిన్ని పెట్టుబడులు
- 2030 నాటికి ఏటా 78.5 లక్షల కొత్త కొలువుల్ని సృష్టించాలి
- దేశంలో వ్యాపార నిర్వహణను ఇంకా సులభతరం చేయాలి
- ఆర్థిక సర్వేను పార్లమెంట్‌కు సమర్పించిన మంత్రి సీతారామన్
- నేడే కేంద్ర బడ్జెట్.. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న నిర్మల

పేదలు, మధ్యతరగతిపై లక్ష్మీదేవి ఆశీస్సులుండాలి

- బడ్జెట్ ముందు మోదీ వ్యాఖ్య
- ఆవిష్కరణలు, అభివృద్ధే మా ఆర్థిక విధానానికి ఆధారం
- తొలిసారి విదేశీ జోక్యం లేదు.. కాంగ్రెస్‌పై విసుర్లు

2



పన్ను వసూళ్లలో తెలంగాణ నం. 1

11

- రాష్ట్ర ఎంఎస్ఎంఈ విధానం భేష్
- సాగునీరు అందే భూములు 86 శాతం.. దేశంలోనే నాలుగో స్థానం
- మహిళల్లో యాజమాన్య స్ఫూర్తిని పెంచే 'వీ-హబ్': ఆర్థిక సర్వే

పాపం ముర్ము.. పూర్ లేడీ!

- రాష్ట్రపతిపై సోనియా వ్యాఖ్యలు.. ముర్ము ప్రసంగం బోరింగ్ అన్న రాహుల్
- ప్రధాని, బీజేపీ నేతల ఆగ్రహం.. 10 కోట్ల మంది గిరిజనులకు అవమానం
- కాంగ్రెస్ రాచకుటుంబం మరింత దిగజారింది
- అభివృద్ధిపై మాట్లాడితే విసుగు.. అర్బన్ నక్సల్స్ మాటలైతే ఆసక్తి: మోదీ
- కాంగ్రెస్ అగ్ర నేతల వ్యాఖ్యలకు రాష్ట్రపతి భవన్ ఖండన

నేను కొడితే.. మామూలుగా ఉండదు

- ఇన్ని రోజులు మౌనంగా, గంభీరంగా చూస్తున్నా
- అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం
- నేను ముందే చెప్పినా ప్రజలు వినలేదు
- అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు
- కైలాసంలో పాము మింగినట్లుగా రాష్ట్రం పరిస్థితి
- ప్రజల్లో కాంగ్రెసోళ్లు దొరికితే కొడదామనేంత కోపం
- ప్రత్యక్ష పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలి
- ఈ నెలాఖరున భారీ సభ పెడదాం.. తరలి రండి
- రాబోయే రోజుల్లో విజయం బీఆర్ఎస్‌దే: కేసీఆర్
- ఫాంహౌస్‌లో జహీరాబాద్ కార్యకర్తలతో భేటీ


ఎర్రవల్లి ఫాంహౌస్‌లో జహీరాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

గజ్వేల్/ మర్కుక్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ నిప్పులు చెరిగారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. ఏడాది పాలనలో రాష్ట్రంలో ప్రజలెవరూ సంతోషంగా లేరని, కాంగ్రెస్ గత పాలనలో మాదిరిగా మళ్లీ కరెంటు కోతలు, మంచినీటి సమస్యలు మొదలయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో ప్రజలకు కాంగ్రెస్ వాళ్లు దొరికితే కొట్టేటట్టు ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తీరును తాను ఇన్ని రోజులు మౌనంగా, గంభీరంగా చూస్తున్నానని తెలిపారు. తాను కొడితే మామూలుగా ఉండదని, గట్టిగా కొట్టడం తనకున్న అలవాటని అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరోనా కష్టకాలంలో సైతం తాము రైతులకు రైతు బంధు ఇచ్చామని, కానీ.. ప్రస్తుతం రైతుబంధుకు రాం.. రాం.. దళితబంధుకు జైభీం అన్నట్లుగా పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ మార్చిందని అన్నారు. సంగమేశ్వరం, బసవేశ్వర, పాలమూరు, కాళేశ్వరం పనులు నిలిచిపోయాయని, పథకాలు, అభివృద్ధి.. అన్నింటినీ గంగలో కలిపారని దుయ్యబట్టారు. కైలాసంలో పాము మింగినట్లుగా తెలంగాణ పరిస్థితి మారిందని, కాగ్ సైతం రాష్ట్ర ఆదాయం గతంతో పోలిస్తే రూ.13 వేల కోట్లు తగ్గిందని చెప్పిందన్నారు. కాంగ్రెస్ వాళ్ల పాలన తీరుపై పోలింగ్ పెడితే బీఆర్ఎస్‌కే ఎక్కువ ఓటింగ్ వచ్చిందని కేసీఆర్ గుర్తు చేశారు. తాను ముందే చెప్పానని, ప్రజలు వినలేదని, తులం బంగారం అనగానే అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారని అన్నారు. ఇప్పుడిప్పుడే మబ్బులు తొలగిపోతున్నాయని, ప్రజలకు ఇదొక గుణపాఠం

> ఇప్పుడిప్పుడే జనానికి మబ్బులు తొలగిపోతున్నాయ్ - కేసీఆర్

మిగతా 3వ పేజీలో...


ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు భట్టి, దామోదర, కోమటిరెడ్డి, అధికారులు

కట్టె లేకుండా నిలబడు చాలు!

- దమ్ముంటే అసెంబ్లీకి రా.. లెక్కలు తేల్చుకుందాం
- మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- చెల్లని రూపాయి.. ప్రజలతో బంధాలు తెగాయ్
- సోషల్ మీడియాలో రాఖీ సావంత్‌కూ లైక్‌లొస్తాయ్

కేంద్రం అంటేనే మిథ్య!

- రాష్ట్రాలు కలిస్తేనే దానికి ఉనికి
- గద్దరన్నకు అవార్డు ఇవ్వకపోగా కించపరుస్తారా?
- ఆయన్ను విస్మరించడం తెలంగాణకు అవమానం
- బీజేపీ ఆఫీసు వీధికి గద్దర్ పేరు పెడతాం జాగ్రత్త
- గద్దర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

తాను కొడితే మామూలుగా ఉండదన్న మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘాటుగా బదులిచ్చారు. 'బలంగా కొట్టడమేమోగానీ.. కట్టె లేకుండా నిలబడు చూద్దాం' అంటూ ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌లో ఉండి మాట్లాడటం కాదని, దమ్ముంటే అసెంబ్లీకి రావాలని, ఎవరేంటో లెక్కలు తేల్చుకుందామని సవాల్ విసిరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తొలుత విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే కేసీఆర్ కుటుంబ సభ్యులు పందికొక్కుల్లా దోచుకుతిన్నారని, పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. "అన్ని వర్గాలకు పంగనామాలు పెట్టిన చరిత్ర చంద్రశేఖర్‌రావుది. జహంగీర్ పీర్ దర్గాకు రూ.100 కోట్లు ఇస్తానని, రాజన్న సిరిసిల్ల ఆలయానికి రూ.100 కోట్లు ఇస్తానని మోసం చేశాడు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు ఇతర ప్రాజెక్టులు పూర్తిచేస్తామని

మిగతా 13వ పేజీలో...

ఉస్మా'నయా' ఆస్పత్రిలో హెలీప్యాడ్

- ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా స్కైవాక్
- 2700 కోట్లతో కొత్త భవనం
- శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్
- మూడేళ్లలోగా నిర్మాణం పూర్తి
- 41 ఆపరేషన్ థియేటర్లు, 2 వేల బెడ్లు, 500 పడకలతో ఐసీయూ
- 30 ప్రత్యేక వైద్య విభాగాలు
- 750 సీట్లతో ఆడిటోరియం
- మంత్రి దామోదర రాజనర్సింహ

13

రైతు భరోసా కోత.. 2.2 లక్షల ఎకరాలకే

సాగుయోగ్యం కాని భూమి స్వల్పమే

- 1.49 కోట్ల ఎకరాలకు చెల్లించాలి.. సర్వేలో తేలిన లెక్కలు
- నేటి నుంచి రైతుల ఖాతాల్లో జమ.. ఎకరం ఉన్నోళ్లకు ముందు



హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు భరోసా సుమారుగా 1.49 కోట్ల ఎకరాలకు ఇవ్వాల్సి వస్తుందని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. రాష్ట్రంలో మొత్తం 1.55 కోట్ల ఎకరాలుండగా అందులో సాగుకు యోగ్యం కాని భూమి సుమారు 10 శాతం వరకు ఉండొచ్చని ప్రభుత్వం భావించింది. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో సాగు యోగ్యం కాని భూములపై సర్వే చేయిస్తోంది. ప్రాథమిక అంచనా ప్రకారం సాగుయోగ్యం కాని భూముల లెక్క చాలా తక్కువగా ఉందని తెలుస్తోంది. 2,20,527 ఎకరాలు మాత్రమే సాగు యోగ్యం కానిది ఉన్నట్లు ఇప్పటివరకు అంచనాల్లో తేలింది. హైదరాబాద్ వినహా మిగిలిన 32 జిల్లాల్లోని 10,976 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేయగా తేలిన లెక్క ఇది. మొత్తం భూముల్లో సాగు యోగ్యం కాని భూమి కేవలం 1.44 శాతం మాత్రమే. దీంతో ప్రభుత్వం తొలుత అంచనా వేసినట్టు కాకుండా 1,49,90,344 ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాల్సి ఉంటుందని తేల్చారు. ఎకరాకు రూ.6 వేల ప్రకారం ఈ పంటకు సుమారుగా రూ.8,994 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో ఒక పంటకు రూ.5 వేలు ఇచ్చేటప్పుడు

మిగతా 13వ పేజీలో...



కోడ్ సాకుతో భరోసా ఆపే కుట్ర

11

- గద్దర్‌ను అవమానించింది కాంగ్రెస్సే
- ఆయనపై ఉపా సహా 21 కేసులు పెట్టింది
- తెలంగాణలో నక్సల్స్ బాధిత కుటుంబాల బాధ కంటే రేవంత్‌కు రాజకీయాలే ముఖ్యం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

సిద్దిపేట మహిళకు గులియన్ బారీ సిండ్రోమ్

3

- కిమ్స్‌లో వెంటిలేటర్‌పై చికిత్స.. విషమం
- మహారాష్ట్రలో కొన్నాళ్లుగా భారీగా కేసులు
- నాడీవ్యవస్థపై రోగ నిరోధక వ్యవస్థ దాడి చేయడంతో కాళ్లు, చేతులు బలహీనం
- సరైన సమయంలో ఓపీ చికిత్సతో నయం
- 100లో ఒకరిద్దరికే విషమం: వైద్యులు

తగిన సమయం అంటే ఎంత?

14

- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వటానికే పది నెలలా?
- అసెంబ్లీ పదవీకాలం ముగిసే సమయానికి నిర్ణయం వెలువరిస్తారా?
- మహారాష్ట్ర స్పీకర్‌లా వ్యవహరిస్తారా?
- ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత కేసులో స్పీకర్‌పై సుప్రీం ఘాటు వ్యాఖ్యలు
- తదుపరి విచారణ వారానికి వాయిదా
- మరో ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై కేటీఆర్ పిటిషన్ మీద 3న విచారణ



ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే శాసన సభ పదవీకాలం ముగిసేటప్పుడు నిర్ణయం చెబుతారా? పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవటానికి ఎంత సమయం పడుతుంతో అసెంబ్లీ కార్యదర్శిని కనుక్కొని చెప్పండి. ఈ విషయం మాట్లాడడానికి మీరు హైదరాబాద్ వెళ్లి రావాల్సిన అవసరం లేదు కదా? ఒక్క ఫోన్ చేస్తే సరిపోతుంది.

- జస్టిస్ గవాయ్

అందరిలో అనకపోతే అట్రాసిటీ చట్టం వర్తించదు

2

- కావాలనే.. అందరి ఎదుటా అవమానించే ఉద్దేశంతో దూషిస్తేనే వర్తిస్తుంది
- సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరణ.. తమిళనాడు వ్యక్తిపై కేసు కొట్టివేత

ప్రయాగ్‌రాజ్‌లో నలుగురు మహిళల అదృశ్యం!

- జగిత్యాల నుంచి 12మంది కుంభమేళాకు
- గల్లంతైన నలుగురూ అక్కాచెల్లెళ్లే
- 24 గంటలు గడిచినా దొరకని ఆచూకీ

14

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు.. కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి

అమరుల స్థూపం, అంబేడ్కర్ విగ్రహంలో

అవినీతి జరిగిందా?

13

- వంద శాతానికి మించి అంచనాలు పెంపు
- నిర్మాణాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశం
- అంబేద్కర్ విగ్రహానికి 164 కోట్లు వ్యయం
- అమరుల స్థూపం పైన 180 కోట్లు పైనే

కేజ్రీవాల్‌పై క్రిమినల్ కేసు?

2

- అన్ని అవకాశాలు పరిశీలిస్తున్న ఈసీ
- మూడేళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం

మోదీ సర్కారు మూడింతల వేగం

- జమిలి, వక్ఫ్, మహిళా బిల్లులే నిదర్శనం
- పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ, జనవరి 31: నరేంద్ర మోదీ నాయకత్వంలో మూడోసారి అధికారానికి వచ్చిన తర్వాత ఎన్డీఏ సర్కారు గత ప్రభుత్వాలకన్నా మూడు రెట్ల వేగంతో పని చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రభుత్వ పాలనలో విధాన వైకల్యం పూర్తిగా మాయమైందని కొనియాడారు. జమిలి ఎన్నికలు, వక్ఫ్ బోర్డు బిల్లులను ఇందుకు ఉదాహరణగా ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్ల దిశగానూ అడుగులు వేశామని చెప్పారు. శుక్రవారం ముర్ము బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. మోదీ సర్కారు విద్య, యువతకు ఉపాధి అంశాలపై ప్రధానంగా దృష్టిసారించిందన్నారు. దేశానికి మధ్య తరగతి అందిస్తున్న సేవలను గుర్తిస్తోందన్నారు. పంటలకు మద్దతు ధరలు కల్పించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తోందని చెప్పారు. ఇటీవలే రైతులకు పీఎం కిసాన్ పథకం కింద 41వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని ప్రకటించారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద మూడు కోట్ల ఇళ్లు ఇస్తున్నట్లు గుర్తు చేశారు.

పోలవరం ప్రాజెక్టుకు రూ. 12 వేల కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం అదనంగా రూ.12 వేల కోట్లు మంజూరు చేసిందని రాష్ట్రపతి అన్నారు. ఆమె తన ప్రసంగంలో ప్రత్యేకంగా పోలవరం ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ముందు ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు, కుంభమేళాలో మరణించిన భక్తులకు నివాళులు అర్పించారు.


సిరుల మాతల్లి కరుణించాలి!

- పేదలు, మధ్యతరగతి ప్రజలపై లక్ష్మీదేవి ఆశీస్సులు కురిపించాలి
- బడ్జెట్ ముంగిట ప్రధాని వ్యాఖ్య



న్యూఢిల్లీ, జనవరి 31: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం శనివారం ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్‌లో పేదలు, మధ్యతరగతి ప్రజలకు, మహిళలకు వరాలు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాని ఈ దిశగా కొన్ని సంకేతాలిచ్చారు. శుక్రవారం ఉదయం బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "బడ్జెట్ సమావేశాల ముంగిట లక్ష్మీదేవి అమ్మవారిని ప్రార్థిస్తున్నా.. సిరుల మాతల్లి దేశంలోని పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలను కరుణించాలి. వారిపైఆశీస్సులు కురిపించాలి. 2025 బడ్జెట్ భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త చోదక శక్తిని అందించాలి"అని ప్రధాని ఆకాంక్షించారు. "మా మూడో దశ పాలనలో ఇది తొలి పూర్తిస్థాయి బడ్జెట్. నేను అత్యంత నమ్మకంగా చెబుతున్నా.. 2047 నాటికి దేశం వికసిత భారత్ లక్ష్యాన్ని సంపూర్ణంగా చేరుకుంటుంది. అప్పటికి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తవుతాయి"అని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను బడ్జెట్ నెరవేరుస్తుందని, వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. "ఇన్నోవేషన్, ఇంక్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో అనేక చరిత్రాత్మక బిల్లులను తీసుకురానున్నాం. వీటిపై సమగ్ర చర్చల అనంతరం చట్టాలుగామారి.. దేశాన్ని మరింత బలోపేతం చేస్తాయి" అని చెప్పారు. పార్లమెంటు సమావేశాలకు ముందు గత పదేళ్లలో తొలిసారి ఇప్పుడే విదేశీ జోక్యం లేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము చేసిన ప్రసంగంలో వికసిత్ భారత్ ప్రతిబింబించిందంటూ 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ కొనియాడారు.

లోకం తీరు



నేడే కేంద్ర బడ్జెట్

- పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) బడ్జెట్‌ను శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆమెకు వరుసగా ఇది 8వసారి. ధరల చురకలు, అత్తెసరు వేతనాలతో సతమతమవుతున్న మధ్య తరగతి జనం.. ఈసారైనా నిర్మలమ్మ పన్ను భారాన్ని తగ్గించక పోదా అని గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. పన్ను మినహాయింపు పరిమితిని భారీగా పెంచడంతో పాటు పన్ను రేట్లను తగ్గించాలని వారు కోరుకుంటున్నారు. కాగా, ఆర్థిక స్థిరీకరణ లక్ష్యాలకు కట్టుబడి ఉంటూనే మందగించిన వృద్ధిని మళ్లీ పరుగులు పెట్టించేందుకు బడ్జెట్‌లో చర్యలు చేపట్టవచ్చన్న అంచనాలున్నాయి. మార్కెట్లో వస్తు, సేవల వినియోగాన్ని పెంచడంపై ప్రధానంగా దృష్టిసారించే అవకాశం ఉంది.

90ల తర్వాత దళితుల కోసం పోరాడలేకపోయాం: రాహుల్



న్యూఢిల్లీ, జనవరి 31: ఇందిరా గాంధీ హయాంతో పోలిస్తే.. కాంగ్రెస్ పార్టీ 1990ల తర్వాత దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీల హక్కుల కోసం సమర్థంగా పోరాడలేకపోయిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దళిత ఇన్ఫ్లుయెన్సర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. గాంధీయేతర కుటుంబ వ్యక్తులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా చేసిన కాలానికి సంబంధించి ఆయన ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'పీవీ నరసింహారావు ప్రతీది నాశనం చేశారు' అని ప్రేక్షకుల్లో ఒకరు అనగా.. దానికి రాహుల్ నవ్వుతూ.. 'నేను ఎవరి పేరు చెప్పను, వాస్తవాన్ని కాంగ్రెస్ అంగీకరించాల్సి ఉంటుంది' అని సమాధానం ఇచ్చారు. పార్టీలో అణగారిన వర్గాల పాత్ర పెరగాలంటే.. అంతర్గత సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గత 10-15 ఏళ్లలో తమ పార్టీ చేయాల్సిన పనిని చేయలేదని ఒక కాంగ్రెస్ సైనికుడిగా చెప్పగలనని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పై దళితులు, వెనుకబడిన వర్గాలకు గతంలో ఉన్న విశ్వాసాన్ని తర్వాత కూడా కొనసాగించి ఉంటే.. ఆరెస్సెస్, బీజేపీలకు అధికారం వచ్చేదికాదని చెప్పారు.

నలుగురిలో అననప్పుడు అట్రాసిటీ చట్టం వర్తించదు

- కావాలనే.. అందరి ఎదుటా అవమానించే ఉద్దేశంతో దూషిస్తేనే ఆ చట్టం వర్తిస్తుంది
- సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జనవరి 31: అవమానించే ఉద్దేశంతో అందరి ఎదుటా కులం పేరుతో దూషించనప్పుడు ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు పెట్టడం కుదరదంటూ.. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తిపై దాఖలైన కేసును సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఆ చట్టంలోని సెక్షన్ 3(1)(ఆర్), సెక్షన్ 3(1)(ఎస్) ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వ్యక్తులను అవమానించడమే లక్ష్యంగా అందరి ముందూ కావాలని దూషిస్తేనే దాన్ని బహిరంగంగా జరిగిన ఘటనగా భావించాలని.. నాలుగు గోడల మధ్య ఒక కార్యాలయంలో జరిగిన ఘటనను ఈ సెక్షన్ల కింద నేరంగా పరిగణించలేమని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి చేసిన అప్పీలుపై ఈ నిర్ణయాన్ని వెలువరించింది. భూమి పట్టాలో పేరు చేర్పుపై తన తండ్రి ఇచ్చిన దరఖాస్తు పరిస్థితి గురించి తెలుసుకునేందుకు ఆ వ్యక్తి 2021 సెప్టెంబరులో స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. వివరాలు అడిగే క్రమంలో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. ఆ సమయంలో అతడు తన కులం గురించి ప్రస్తావించి.. "నీలాంటివాళ్లని ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమిస్తే మీరు ఇలాగే చేస్తారు" అన్నాడని.. కులం పేరుతో దూషించి, అసభ్యకరమైన పదజాలంతో అవమానించడని పేర్కొంటూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దీనిపై తిరుచిరాపల్లి కోర్టులో కేసు నడిచింది. తనపై నమోదైన కేసు కొట్టివేయాలని కోరుతూ నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా అక్కడ నిరాశ ఎదురయింది. దాంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ కేసును విచారించిన ధర్మాసనం.. "ఎఫ్ఐఆర్ ప్రకారం కూడా ఆ ఘటన బాధితుడి కార్యాలయంలోనే, నాలుగు గోడల మధ్యనే జరిగింది. ఈ ఘటన జరిగిన తర్వాతే.. ఆయన సహోద్యోగులు అక్కడికి వచ్చారు. కాబట్టి ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌లోని సెక్షన్ 3(1)(ఆర్), సెక్షన్ 3(1)(ఎస్) ఈ కేసులో వర్తించవు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను కొట్టివేసింది.

ఆలయాల్లో వీఐపీ దర్శనాలు వద్దు

- సుప్రీం కోర్టులో పిల్.. తిరస్కరణ

న్యూఢిల్లీ, జనవరి 31: దేవాలయాల్లో వీఐపీ దర్శనాలను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రత్యేక దర్శనాలు ఉండకూడదని తామూ అభిప్రాయపడుతున్నామని, కానీ ఇది రాజ్యాంగం కింద విచారించదగ్గ కేసు కాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం తెలిపింది. సమాజం, ఆలయ నిర్వహణ కమిటీలే దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే సంబంధిత అధికార్లకు వినతిపత్రం సమర్పించవచ్చని తెలిపింది. 12 జ్యోతిర్లింగ క్షేత్రాలు, ఇతర దేవాలయాల్లో వీఐపీ దర్శనాలు నిర్వహిస్తుండడం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ బృందావన్‌లోని శ్రీరాధా మదన్‌మోహన్ ఆలయ సేవాయత్ విజయ్ కిషోర్ గోస్వామి ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని నిరోధించాలని కేంద్ర హోం శాఖకు పలుమార్లు కోరినా ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే సూచనలు పంపించిందని, ఇతర రాష్ట్రాలను విస్మరించిందని తెలిపారు. పరిశీలించిన ధర్మాసనం.. ఈ అంశంపై కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని తెలిపింది.

ఏపీ, గోవా, త్రిపుర మినహా ఇతర రాష్ట్రాలకు జరిమానా: సుప్రీం కోర్టు

- అక్రమ తుపాకుల నివారణపై ప్రణాళికలు లేనందుకు చర్య

అక్రమ తుపాకుల తయారీ, అమ్మకాలను నిరోధించడానికి కార్యాచరణను తయారు చేయాలన్న ఆదేశాలను అమలు చేయనందుకు సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు జరిమానా విధించింది. 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రూ.10వేల వంతున జరిమానా వేసింది. కేవలం ఆంధ్రప్రదేశ్, త్రిపుర, గోవా రాష్ట్రాలు మాత్రమే కార్యాచరణ ప్రణాళికలు తయారు చేశాయి. ప్రణాళికలు రూపొందించాలంటూ గత ఏడాది నవంబరు ఏడో తేదీన ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడంపై జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఎస్.సి.శర్మ ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మరో నూతన విమాన సర్వీస్

- శంషాబాద్ టు థాయిలాండ్‌లోని పుకెట్

శంషాబాద్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పర్యాటక కేంద్రమైన పుకెట్‌కు నూతన విమాన సర్వీసును ప్రారంభించినట్లు జీఎంఆర్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సీఈవో ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ.. శంషాబాద్ విమానాశ్రయం నుంచి థాయిలాండ్‌లోని పుకెట్‌కు తొలి విమాన సర్వీసు శుక్రవారం(జనవరి 31న) బయలుదేరిందని చెప్పారు. ఈ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం వారంలో మూడుసార్లు బుధ, శుక్ర, ఆదివారాల్లో నడవనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్, జీఎంఆర్ ప్రతినిధులు, ఎయిర్‌లైన్స్ అధికారులు పాల్గొన్నారు.

జన్మతః పౌరసత్వం.. బానిసల పిల్లల కోసమే

ప్రపంచమంతా అమెరికాలో తిష్ట వేసేందుకు కాదు: ట్రంప్

వాషింగ్టన్, జనవరి 31: జన్మతః పౌరసత్వం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ హక్కు కేవలం బానిసల పిల్లల కోసం కల్పించినదని, అంతే తప్ప.. ప్రపంచం మొత్తం వచ్చి అమెరికాలో తిష్ట వేసేందుకు కాదని అన్నారు. అధికారంలోకి వచ్చీరాగానే జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ ట్రంప్ ఆదేశాలు జారీ చేయడం, ఇది వివాదాస్పదం కావడంతో న్యాయస్థానం ఆ ఉత్తర్వులను నిలిపివేయడం తెలిసిందే. కాగా, ఈ అంశంపై ట్రంప్ తాజాగా స్పందిస్తూ, "గతాన్ని ఓసారి పరిశీలిస్తే జన్మతః పౌరసత్వ హక్కును బానిసల పిల్లల కోసం కల్పించిందనే విషయం స్పష్టమవుతుంది. అంతే తప్ప.. ప్రపంచం మొత్తం వచ్చి అమెరికాను ఆక్రమించుకునేందుకు కాదు. అర్హత లేనివారు కూడా ఇక్కడికి వస్తున్నారు. తద్వారా అర్హత లేని పిల్లలకు పౌరసత్వం దక్కుతోంది" అని వ్యాఖ్యానించారు.

పాపం ముర్ము.. పూర్ లేడీ!

రాష్ట్రపతిపై సోనియా వ్యాఖ్యలు.. బడ్జెట్ సమావేశాల వేళ రాజకీయ దుమారం!

- రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్ అన్న రాహుల్
- ప్రధాని, బీజేపీ నేతల ఆగ్రహం



న్యూఢిల్లీ, జనవరి 31: పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తొలిరోజే రాజకీయ దుమారం చోటుచేసుకుంది. శుక్రవారం ఉభయసభలనుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. రాష్ట్రపతి ప్రసంగంపై ఆమె తన కుమారుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కుమార్తె, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రాతో కలిసి మీడియా ఎదుట స్పందించారు. ప్రసంగం సుదీర్ఘంగా ఉందన్నారు. 'పూర్ లేడీ(రాష్ట్రపతి ముర్ము).. బాగా అలసిపోయారు.. పాపం.. ప్రసంగం చదవలేకపోయారు' అని జాలిగొల్పేలా మాట్లాడారు. ఈ వీడియో క్లిప్ క్షణాల్లో వైరల్ అయింది. 'ప్రసంగం బోరింగ్‌గా ఉందా? నో కామెంట్స్! చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్పారు' అని రాహుల్ తన తల్లితో అనడం అందులో వినిపించింది. వీరి వ్యాఖ్యలపై ప్రధాని మోదీ, బీజేపీ సీనియర్ నేతలు విరుచుకుపడ్డారు. ఇవి ముర్ము పరువుకు భంగం కలిగించేవిగా, అవమానకరంగా ఉన్నాయని.. కాంగ్రెస్ అగ్ర నేతల భూస్వామ్య, పెత్తందారీ పోకడకు ఇవి నిదర్శనమని ధ్వజమెత్తారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిపై తనకున్న చులకన భావాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వివాదంపై రాష్ట్రపతిభవన్ కూడా స్పందించింది. సోనియా, రాహుల్ వ్యాఖ్యలను ఖండించింది.

దురహంకారం బట్టబయలు: ప్రధాని

ప్రధాని మోదీ ఢిల్లీలో జరిగిన ఓ ర్యాలీలో తాజా అంశంపై స్పందించారు. సోనియాను తీవ్రంగా విమర్శించారు. ఆమె వ్యాఖ్యలు పేదలు, గిరిజనులను అవమానించేవిగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రథమ కుటుంబం దురహంకారం ఇవాళ పూర్తిగా బట్టబయలైందని, దేశానికి తామే యజమానులమని ఈ కాంగ్రెస్ నేతలు భావిస్తుంటారని దుయ్యబట్టారు. 'రాష్ట్రపతి తన మాతృభాష ఒడియాలాగా హిందీలో మాట్లాడలేకపోయినా.. పార్లమెంటులో స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. కాంగ్రెస్ నేతలు ఆ ప్రసంగంపై వ్యాఖ్యలు చేసి ఆమెను చిన్నబుచ్చారు. ఆ పార్టీ రాచకుటుంబం మరింత లోతుకు దిగజారింది. ఇది దేశంలోని 10 కోట్ల మంది గిరిజన సోదర సోదరీమణులకు అవమానం. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతి పేదవాడికీ అవమానం' అని వ్యాఖ్యానించారు. భారత ఆర్థికాభివృద్ధి, రైతు సంక్షేమం, మెట్రో ప్రాజెక్టులు, క్రీడాకారుల గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారని.. కాంగ్రెస్ రాచకుటుంబానికి అది కూడా విసుగుపుట్టించిందని.. అర్బన్ నక్సల్స్ మాటలైతే వారికి బాగా ఆసక్తికరంగా ఉంటాయని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎప్పుడూ అణగారిన వర్గాల అభ్యున్నతి పట్టదని ఆయన చెప్పారు.

భూస్వామ్య మనస్తత్వం: నడ్డా

సోనియా వ్యాఖ్యలు చాలా అగౌరవంగా ఉన్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా విమర్శించారు. బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిపై కాంగ్రెస్‌కున్న అగౌరవాన్ని ఇది చాటిందన్నారు. ఇలాంటివి జరగడం ఇదే మొదటిసారి కాదని చెప్పారు. దేశం కోసం, సమాజం కోసం విస్తృతంగా ద్రౌపది ముర్ము కృషిచేశారని.. గిరిజన మహిళ అయిన మన రాష్ట్రపతి బలహీనురాలు కాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పష్టంచేశారు. ఆమెను బలహీనురాలిగా చూపేందుకు చేసే ప్రయత్నాలను బీజేపీ సహించదన్నారు. కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోనియా, రాహుల్ వ్యాఖ్యలు రాష్ట్రపతికి తీరని అవమానమని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా కాంగ్రెస్ అంగీకరించలేకపోతోందని బీజేపీ ఎంపీ సుకాంత మజుందార్ ధ్వజమెత్తారు. ముర్ము ఆదివాసీ కుటుంబానికి చెందినవారని, విమర్శించడ సరికాదన్నారు.

ఆ వ్యాఖ్యలు సముచితం కాదు

రాష్ట్రపతి భవన్


సోనియా, రాహుల్ వ్యాఖ్యలపై రాష్ట్రపతి భవన్ కూడా స్పందించింది. రాష్ట్రపతి పట్ల కాంగ్రెస్ నేతల మాటలు సముచితం కాదని.. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవి గౌరవాన్ని దెబ్బతీశారని, ఇవి ఆమోదయోగ్యం కావని ఓ ప్రకటనలో పేర్కొంది. హిందీవంటి భారతీయ భాషల యాసల గురించి తెలియనట్లు కనిపిస్తోందని, అందుకే తప్పుడు అభిప్రాయం ఏర్పడినట్లు భావిస్తున్నామని తెలిపింది. 'ఏది ఏమైనా అలాంటి వ్యాఖ్యలు దురదృష్టకరం.. పూర్తిగా నివారించాల్సినవి. ప్రసంగం ముగిసేటప్పటికి రాష్ట్రపతి బాగా అలసిపోయారని.. మాట్లాడలేకపోయారని సదరు కాంగ్రెస్ నేతలు అన్నారు. వీటిలో ఏ మాత్రం నిజం లేదని రాష్ట్రపతి భవన్ స్పష్టం చేయదలచింది. ప్రసంగించేటప్పుడు ఏ దశలోనూ రాష్ట్రపతి అలసిపోలేదు. పైగా అణగారిన వర్గాలు, మహిళలు, రైతుల గురించి మాట్లాడడం అలుపు కలిగించదని రాష్ట్రపతి విశ్వసిస్తున్నారు' అని పేర్కొంది.

అమ్మకు దురుద్దేశం లేదు: ప్రియాంక

తన తల్లికి రాష్ట్రపతి పట్ల అగౌరవం లేదని, ఆమె వ్యాఖ్యల వెనుక దురుద్దేశం లేదని ప్రియాంక అన్నారు. మోదీ, బీజేపీ నేతలు, కేంద్రమంత్రులతో పాటు రాష్ట్రపతి భవన్ కూడా తీవ్రంగా స్పందించడంతో ఆమె మీడియా వక్రీకరించిందని ఆరోపించారు. ఆమె విలేకరులతో మాట్లాడారు. 'నా తల్లి 78 ఏళ్ల వృద్ధురాలు. రాష్ట్రపతి ఇంత సుదీర్ఘ ప్రసంగం చదివి అలిసిపోయినట్లు కనిపించారంటూ జాలిపడ్డారు. రాష్ట్రపతి అంటే ఆమెకు అత్యున్నత గౌరవముంది. ఈ అంశాన్ని మీడియా వక్రీకరించడం దురదృష్టకరం' అని అన్నారు. కాగా, సోనియా లక్ష్యంగా బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖండించారు. ఆర్థిక సర్వే మోదీ ప్రభుత్వానికి సత్యాన్ని చూపించిందని.. అయితే దేశ ఆర్థిక దుస్థితిని కప్పిపుచ్చడానికి బీజేపీ నాయకులు, ఓ వర్గం మీడియా.. సోనియా వాడిన పదాలను వక్రీకరిస్తున్నారని 'ఎక్స్'లో ఆరోపించారు.

ప్రయాగ్‌రాజ్‌కే 'అయోధ్య'ను తెచ్చిన తెలుగోడు!

- రామమందిర ప్రతిరూపం నిర్మించిన కళాదర్శకుడు రమణ వంక
- 81 అడుగుల ఎత్తుతో 16,800 చ.అ విస్తీర్ణంలో మందిరం
- నిర్మాణంలో వెదురు కర్రలు, ఫోమ్, ఫైబర్.. 25 రోజుల్లోనే పూర్తి



ప్రయాగ్‌రాజ్ సమీపంలో విద్యుత్తు వెలుగుల మధ్య రామమందిర ప్రతిరూపం, రామ మందిర ప్రతిరూపం ఫొటోతో రమణ వంక

హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పుణ్యస్నానాల కోసం మహాకుంభమేళా వెళుతున్నారా? అక్కడి నుంచి అయోధ్యకు వెళ్లాలని మనసులో ఉన్నా.. అధికారులు నియంత్రిస్తున్నారని అసంతృప్తికి గురవుతున్నారా? నిరుత్సాహపడొద్దు.. మహా కుంభమేళాకే అయోధ్య తరలివచ్చింది. అచ్చంగా అయోధ్యలోని మందిరాన్ని దర్శించుకున్న అనుభూతి కలిగేలా నిర్మించారు. ఈ అయోధ్య మందిర ప్రతిరూపాన్ని నిర్మించింది ప్రముఖ తెలుగు కళాదర్శకుడు రమణ వంక. ఓ ప్రైవేటు సంస్థ.. త్రివేణి సంగమానికి కిలోమీటరున్నర దూరంలో చుంగ్లీ అనే చోట భక్తుల కోసం ప్రత్యేక ఈవెంట్లు నిర్వహిస్తోంది. అందులో భాగంగా.. రమణ వంక అచ్చంగా అయోధ్యను తలపించేలా 16,800 చదరపు అడుగుల విస్తీర్ణం, 140 అడుగుల పొడవు, 120 అడుగుల వెడల్పుతో మందిరాన్ని కట్టారు. నిర్మాణంలో వెదురు కర్రలు, వస్త్రాలు, ఫోమ్ మెటీరియల్, ఫైబర్‌ను ఉపయోగించారు. గర్భాలయంలో కూడా అయోధ్యలో మాదిరిగానే బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ నిత్యం 20వేలమంది భక్తులు దర్శించుకుంటున్నారు. భక్తుల కోసం ప్రయాగ్‌రాజ్‌లో అయోధ్య రామమందిర ప్రతిరూపాన్ని నిర్మించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు రమణ వంక 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. నిర్మాణంలో 200 మంది కార్పెంటర్లు, సివిల్ వర్కర్లు పాలుపంచుకున్నారని.. 25 రోజుల్లో నిర్మాణం పూర్తిచేశామని వివరించారు. డిసెంబరు 29న ప్రత్యేక పూజలతో ఆలయాన్ని తెరిచామని చెప్పారు.

ఖర్చులు పెరిగిపోతున్నాయ్

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన సగటు నెలవారీ వినియోగ వ్యయం.. 18 రాష్ట్రాలలో హెచ్‌సీఈఎస్ అధ్యయనం

న్యూఢిల్లీ, జనవరి 31: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సగటు నెలవారీ వినియోగం క్రమేణా పెరుగుతోంది. అదే సమయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వినియోగ అసమానత తగ్గుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశంలో 18 ప్రధాన రాష్ట్రాల్లోని పరిస్థితులను అంతకుముందు ఏడాదితో పోలుస్తూ గృహ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) తాజాగా నివేదిక విడుదల చేసింది. 2022-23తో పోలిస్తే 2023-24లో వినియోగ అసమానత గ్రామీణ ప్రాంతాల్లో 0.27 నుంచి 0.24కు పట్టణ ప్రాంతాల్లో 0.31 నుంచి 0.28కు తగ్గింది. 2022-23లో కంటే 2023-24లో 18 రాష్ట్రాలలోనూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సగటు నెలవారీ తలసరి వినియోగ వ్యయం (ఎంపీసీఈ) పెరిగింది. గరిష్ఠంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒడిశాలో 14%, పట్టణ ప్రాంతాల్లో పంజాబ్‌లో 13% పెరిగింది. ఇక అత్యల్పంగా గ్రామీణ ప్రాంతాల్లో మహారాష్ట్రలో 3%, పట్టణ ప్రాంతాల్లో కర్ణాటకలో 5% పెరుగుదల ఉంది. 18 రాష్ట్రాల్లో నెలవారీ సగటులో చాలా వ్యత్యాసం కనిపించింది. ఇక 11 రాష్ట్రాలలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వినియోగ అసమానత తగ్గింది. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ వినియోగ వ్యయంలో అత్యధికంగా ఆహారం కోసం 47% ఖర్చు పెడుతున్నారు. ఆ తర్వాత పాల ఉత్పత్తులు, వైద్యం, దుస్తులకు ఖర్చు చేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తృణధాన్యాల వినియోగం పెరుగుతోంది.

కిన్నెర అఖాడా నుంచి మమత కులకర్ణి బహిష్కరణ

- మహామండలేశ్వర్‌గా ఆమెకు ఇచ్చిన హోదా తొలగింపు

న్యూఢిల్లీ, జనవరి 31: బాలీవుడ్ నటి మమతా కులకర్ణి కిన్నెర అఖాడా నుంచి శుక్రవారం బహిష్కరణకు గురయ్యారు. మహామండలేశ్వర్‌గా ఆమెకు ఇచ్చిన హోదాను రద్దు చేశారు. ఆమెను ఆ హోదాలో నియమించిన ఆచార్య మహామండలేశ్వర్ లక్ష్మీ నారాయణ్ త్రిపాఠీని సైతం అఖాడా నుంచి తొలగించారు. గతవారం మమతా కులకర్ణిని మహామండలేశ్వర్‌గా నియమించడంపై కిన్నెర అఖాడాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చిత్ర పరిశ్రమలో ఆమె గత కెరీర్‌ను ఎత్తిచూపుతూ పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం అంతర్గత విభేదాలకు దారితీయడంతో నాయకత్వం రంగంలోకి దిగింది. ఆమెను బహిష్కరిస్తూ అఖాడా వ్యవస్థాపకుడు రిషి అజయ్ దాస్ నిర్ణయం తీసుకున్నారు. అఖాడాకు త్వరలోనే కొత్త ఆచార్య మహామండలేశ్వర్‌ను ప్రకటిస్తామని తెలిపారు.

కేజ్రీవాల్‌పై క్రిమినల్ ఎఫ్ఐఆర్?

- అన్ని అవకాశాలు పరిశీలిస్తోన్న ఈసీ
- మూడేళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం

న్యూఢిల్లీ, జనవరి31: యమునా నదిలో బీజేపీ విషం కలిపిందన్న ఆరోపణలపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని ఎన్నికల సంఘం ఆయనపై తగిన చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. శుక్రవారం ఆయన ఢిల్లీ, పంజాబ్ సీఎంలతో కలిసి ఈసీ కార్యాలయానికి వెళ్లారు. ఉదయం 11 గంటల్లోగా విషం కలిపిన ఆరోపణలపై సాక్ష్యాధారాలు సమర్పించకపోతే చర్యలు తీసుకుంటామని ఈసీ ఆదేశించడంతో కేజ్రీవాల్ ఎన్నికల అధికారులను కలిశారు. అయితే ఆయన వివరణపై ఈసీ సంతృప్తి చెందలేదని తెలిసింది. కేజ్రీవాల్‌పై క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. భారతీయ న్యాయసంహితలోని సెక్షన్లు 196(రెండు వర్గాల మధ్య శతృ త్వం పెరిగేలా ప్రకటనలు చేసినందుకు), 197(జాతీయ సమైక్యతను దెబ్బతీసే యత్నం చేసినందుకు), 353(ప్రజలను మోసగించినందుకు), ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 123(4)(తప్పుడు ప్రకటనలు చేసినందు కు) క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశముందని సమాచారం. బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం మూడేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది.

ఆప్‌నకు ఏడుగురు ఎమ్మెల్యేలు గుడ్‌బై

మరో 4 రోజుల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఆప్‌లో కలకలం రేగింది. పార్టీకి ఏకంగా ఏడుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. పార్టీతో పాటు, కేజ్రీవాల్‌పై విశ్వాసం కోల్పోయామని తమ రాజీనామా లేఖల్లో రాశారు. రాజీనామా చేసిన ఎమ్మెల్యేల్లో మదన్‌లాల్, నరేశ్ యాదవ్, పవన్ శర్మ, రోహిత్, భావన, రాజేశ్ రిషి, బిజ్వాసన్ ఉన్నారు. వాస్తవానికి ఈ ఎమ్మెల్యేలందరికీ టికెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించింది. ఢిల్లీలో 5న 70 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయి.

సిక్ ఫర్ జస్టిస్ సంస్థపై మరో ఐదేళ్లు నిషేధం

న్యూఢిల్లీ, జనవరి 31: భారతదేశ విచ్ఛిన్నం కోసం ముస్లింలు, క్రైస్తవులు, తమిళులను ఖలిస్థానీ ఉగ్రవాద సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' (ఎస్ఎఫ్‌జే) రెచ్చగొడుతోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఎస్ఎఫ్‌జేపై ఇప్పటికే ఉన్న నిషేధాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగిస్తూ కేంద్రం ఓ గెజిట్‌ను విడుదల చేసింది. దీంట్లో ఆ సంస్థ కార్యకలాపాలను వివరించింది. 'మణిపూర్‌లో క్రైస్తవులను ప్రత్యేక దేశం కోసం, తమిళనాడు ప్రజల్ని ద్రవిడిస్థాన్ కోసం, ముస్లింలను ఉర్దిస్థాన్ కోసం ఎస్ఎఫ్‌జే రెచ్చగొడుతోంది. ఈ కుట్రలో తమతో కలిసి రావాలంటూ దళితులకూ పిలుపునిస్తోంది. మద్దతు ధరలపై పంజాబ్, హరియాణా రైతులనూ ఈ సంస్థే రెచ్చగొడుతోంది' అని పేర్కొంది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌లకు ఎస్ఎఫ్‌జే నుంచి ముప్పు పొంచి ఉందని తెలిపింది. కాగా, మణిపూర్‌లో కుకీ తదితర గిరిజన జాతుల హక్కుల కోసం పోరాడుతున్న 'నార్త్ అమెరికన్ మణిపూర్ ట్రైబల్ అసోసియేషన్' వర్గాలు ఈ గెజిట్‌ను తీవ్రంగా ఖండించాయి.

ఏడాదిలో 300 రివ్యూలు చేసిన సీఎం రేవంత్

పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్.. సెక్రెటేరియట్‌కు వచ్చి 3 రివ్యూలైనా చేశాడా?

- ప్రజల్ని మోసం చేయడంలో ఆయన దిట్ట
- అందుకే కేసీఆర్ మోసగాళ్లకు మోసగాడు
- ప్రజలను ఎలా మోసం చేయాలో ప్రాక్టీస్ చేస్తున్నాడు
- నువ్వు కాంగ్రెస్‌ను కొట్టుడు కాదు.. మేమే నీకు దట్టి కొడతాం
- కేసీఆర్.. ఐదు లక్షల మందితో సభ పెడితే.. 5 లక్షల ఒక వేయి మందితో నేనూ సభ పెడతా
- బంగారం కోసం మహిళలు అమ్ముడు పోయారంటారా?
- కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి: జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): " సీఎం రేవంత్‌రెడ్డి.. ఏడాది కాలంలో రాష్ట్ర అభివృద్ధిపై సచివాలయంలో 300 రివ్యూలు చేశారు. పదేళ్ల సీఎంగా ఉన్న కేసీఆర్.. సచివాలయానికి వచ్చి మూడు రివ్యూలైనా చేశాడా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. ప్రజల్ని మోసం చేయడంలో దిట్ట అయిన కేసీఆర్‌కు.. మోసగాళ్లకు మోసగాడంటూ కాంగ్రెస్ పార్టీ నామకరణం చేస్తోందన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని కేసీఆర్ కొట్టుడు కాదని, తామే ఆయనకు దట్టి కొడతామన్నారు. తాను కొడితే మామూలుగా ఉండదంటూ కేసీఆర్ మాట్లాడుతున్నడని, కానీ.. ఆయనకు మాటల్లో ఉన్న బలం చేతల్లో ఉండదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కోపం వచ్చి ఉఫ్ అంటే.. కేసీఆర్ గాలికి కొట్టుకు పోతాడన్నారు. "ప్రజాసమస్యలపై చర్చ కోసం అసెంబ్లీని పెట్టమని సీఎంను ప్రతిపక్ష నేత అడుగుతడు. కానీ ఇక్క రివర్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డే.. కేసీఆర్‌ను సభకు రావాలని అడుగుతున్నడు. అయినా ఆయన రావట్లేదు." అని విమర్శించారు. తులం బంగారానికి ఆశపడి అమ్ముడు పోయారంటూ మహిళలను అవమానించిన కేసీఆర్.. వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఒక్కటి కూడా కరెక్టుగా మాట్లాడరని, అన్నీ బక్వాస్ మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. జనాన్ని ఎలా మోసం చేయాలని ఫామ్ హౌస్‌లో రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాడన్నారు. ఎన్నికలకు ముందే రాష్ట్ర ఖజానాను కేసీఆర్ సంకనాకించాడని, రియల్ వ్యాపారాన్నీ నాశనం చేశాడన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేనాటికి వివిధ పనులకు సంబంధించి రూ. లక్ష కోట్ల బిల్లులను కేసీఆర్ పెండింగ్‌లో పెట్టి వెళ్లాడన్నారు. ఆయన చేసిన రూ. 7 లక్షల కోట్ల అప్పులకు.. ఏడాదికి రూ. 50 వేల కోట్ల చొప్పున సీఎం రేవంత్‌రెడ్డి.. వాయిదాలు కట్టాల్సి వస్తోందన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన కేసీఆర్.. ప్రజల బతుకును బజారు పాలు చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ 5 లక్షల మందితో సభ పెడితే.. తాము 5 లక్షల ఒక వేయి మందితో పెడతామన్నారు. రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ చెబితే తానే ఆ సభ పెడతానన్నారు. ఐదు లక్షల మందితో సభ పెట్టి కేసీఆర్.మొనగాడు అనిపించుకోవాలని, ఆయన కంటే ఎక్కువ మందితో సభ పెట్టి మొనగాళ్లకు మొనగాళ్లమని తాము అనిపించుకుంటామని సవాలు విసిరారు.


ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో హరీశ్‌రావు

నేను కొడితే.. మామూలుగా ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

లెక్క అయిందని వ్యాఖ్యానించారు. "ఫాంహౌస్ అంటూ బద్నాం చేశారు. ఫాంహౌస్‌లో ఏముంటాయి? వరి ఉంటది.. మక్క ఉంటది.. అల్లం ఉంటది" అని అన్నారు. రాబోయే రోజుల్లో విజయం తమదేనన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది గులాబీ జెండా అని, తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలిపిందీ గులాబీ జెండాయేనని ఉద్ఘాటించారు. గులాబీ జెండాతోనే తెలంగాణకు రక్ష అని అన్నారు. తానుండగా తెలంగాణకు అన్యాయం జరగనివ్వనని, ప్రజాక్షేత్రంలో పోరాటాలకు సిద్ధమని ప్రకటించారు. "బీఆర్ఎస్ విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలి. ప్రత్యక్ష పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలి. ఫిబ్రవరిలో భారీ సభ పెడదాం.. ప్రజలంతా తరలి రావాలి. కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఓట్ల కోసం వాడుకుంటుంది. తెలంగాణలో ఉన్న ప్రతి బిడ్డ మనోడే" అని కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫామ్‌హౌస్ నుంచి సమావేశ మందిరానికి హరీశ్‌రావును వెంటబెట్టుకొని కేసీఆర్ స్వయంగా కారును నడుపుకొంటూ వచ్చారు.

సిద్దిపేట మహిళకు గులియన్ బారీ సిండ్రోమ్

కిమ్స్‌లో వెంటిలేటర్‌పై చికిత్స.. పరిస్థితి విషమం.. మహారాష్ట్రలో కొన్నాళ్లుగా పెద్ద ఎత్తున కేసులు

హైదరాబాద్ సిటీ, సిద్దిపేట టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పుణె, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో కలకలం రేపిన గులియన్ బారీ సిండ్రోమ్(జీబీఎస్) కేసు ఒకటి.. తెలంగాణలోనూ వెలుగుచూసింది. సిద్దిపేట జిల్లాకు చెందిన ఒక మహిళ(25) దాని బారిన పడింది! ఆమెను పరీక్షించి, వారంరోజులపాటు చికిత్స చేసిన స్థానిక వైద్యుల సూచన మేరకు.. కుటుంబసభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో.. వైద్యులు వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉంచి చికిత్స చేస్తున్నారు. అయితే బాధితురాలుగానీ, ఆమె కుటుంబసభ్యులుగానీ ఎవరూ ఎప్పుడూ పుణెకు వెళ్లలేదని వైద్యులు తెలిపారు. వారం రోజుల క్రితం ఆమె తీవ్ర జ్వరం, వైరల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడింది.. క్రమంగా కాళ్లు, చేతుల్లో సత్తువ కోల్పోయి నడవలేని, కదల్లేని పరిస్థితికి చేరుకుందని వెల్లడించారు. కాగా.. ఇదేమీ అంత అసాధారణ సమస్య కాదని.. వర్షాకాలం సీజన్‌లో ఈ తరహా సిండ్రోమ్‌తో కొంతమంది రోగులు వస్తుంటారని కిమ్స్ న్యూరాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరించారు. వైరల్ ఫీవర్లు, ఇన్‌ఫెక్షన్ బారిన పడి రోగ నిరోధక శక్తి సన్నగిల్లడంతో కొంతమంది జీబీఎస్ బారిన పడుతుంటారని ఆయన చెప్పారు. గత వర్షాకాలంలో తాము ఇలా ముప్పై మందికి చికిత్స చేశామని, సరైన సమయంలో కచ్చితమైన మందులు వినియోగిస్తే వారంలో తగ్గిపోతుందని, మరికొందరికి ఆరు నెలల సమయం పట్టవచ్చునని ఆయన వెల్లడించారు. వందలో ఒకరిద్దరికి మాత్రమే పరిస్థితి తీవ్రతరమవుతుందని.. బాగా బలహీనంగా ఉండేవారికే ఈ సమస్య ఎక్కువని వివరించారు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదని స్పష్టం చేశారు.



ఇవీ లక్షణాలు..

వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల బారినపడినప్పుడు అప్రమత్తమైన రోగనిరోధక వ్యవస్థ.. హానికారక జీవులను చంపడంతోపాటు నాడీ వ్యవస్థను కూడా దెబ్బతీయడం వల్ల ఈ సమస్య వస్తుంది. ముఖ్యంగా.. వెన్నుపూస నుంచి కాళ్లు, చేతులకు వెళ్లే నాడుల మీద ఉండే మైలీన్ అనే రక్షణ పొరను రోగనిరోధక వ్యవస్థ దెబ్బతీయడం వల్ల క్రమంగా కండరాలు బలహీనమైపోయి పక్షవాతానికి దారితీస్తుంది. కొంతమందికి వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేయాల్సిన అవసరం కూడా వస్తుంది. కాబట్టి వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల బారిన పడినవారు లక్షణాలను గమనించుకుంటూ అప్రమత్తంగా ఉండాలి. ఎక్కువ దూరం నడవలేకపోవడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, వేళ్లు, మడమలు, మణికట్టు భాగాల్లో పొడుస్తున్నట్లుగా ఉండడం, కాళ్లు, చేతులు బలహీనంగా మారి పనిచేయనట్లు అనిపించడం, బీపీ, గుండె స్పందనలో తేడా చోటు చేసుకోవడం సమస్యలు ఉండే అవకాశముందని వైద్యులు వివరించారు. ఈ లక్షణాలతోపాటు నీళ్ల విరేచనాలు, కడుపులో నొప్పి వంటి ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.

ఫాం హౌస్‌లో 14 నెలలు నిద్రపోయిన కేసీఆర్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ, జనవరి31(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన పోరాడాల్సిన మాజీ సీఎం కేసీఆర్ 14 నెలల పాటు ఫాం హౌస్‌లో కుంభకర్ణుడిలా నిద్రపోయాడని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. నల్లగొండలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ మాటల్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర ఏమీ లేదని, శ్రీకాంతాచారితో పాటు నాలుగున్నర కోట్ల ప్రజల పాత్ర ఉందని, కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇచ్చిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. తండ్రిపేరు చెప్పుకుని ఒకరు, మామ పేరు చెప్పుకుని మరొకరు ఎమ్మెల్యేలు అయ్యారని కేటీఆర్, హరీశ్‌రావులపై ధ్వజమెత్తారు.

కేసీఆర్‌వి ఉత్తరకుమార ప్రగల్భాలు..

- ఆయన ఫాంహౌస్ కలలు మానుకోవాలి
- కవితపై మరో లిక్కర్ స్కాంను పక్కదారి పట్టించేందుకే ఇదంతా: మహేశ్ గౌడ్



హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలన, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై చర్చ కోసం ఎన్నిసార్లు సవాలు విసిరినా స్పందించని కేసీఆర్.. ఫాంహౌస్‌లో కూర్చుని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నాడంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించలేని ప్రగతిని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే సాధించడంతో దిక్కుతోచని కేసీఆర్.. వాస్తవ పరిస్థితులకు భిన్నంగా మాట్లాడుతున్నారని ఓ ప్రకటనలో విమర్శించారు. ఆయన ఫాంహౌస్ కలలు మానుకుంటే మంచిదన్నారు. రాష్ట్ర ప్రజలు ఫాంహౌస్ పాలనను కోరుకోవట్లేదని.. ఇందిరమ్మ రాజ్యం, ప్రజా పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కూరుకుపోయిన కేసీఆర్ కుమార్తె కవితపై తాజాగా మరో లిక్కర్ స్కామ్ ఆరోపణలు వచ్చాయని గుర్తుచేశారు. ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే కేసీఆర్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి మరోమారు భంగపాటు తప్పదని జోస్యం చెప్పారు.

సీఎం రేవంత్ దెబ్బకు కేసీఆర్ మైండ్ బ్లాక్..

సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బకు కేసీఆర్ మైండ్ బ్లాక్ అయి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇన్ని రోజులూ కుంభకర్ణుడిలా ఫాంహౌస్‌లో పడుకున్న ఆయన.. పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే బయటికొస్తానంటున్నారని విమర్శించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బసవేశ్వర, సంగమేశ్వరల గురించి మాట్లాడుతున్న కేసీఆర్.. కాళేశ్వరం గురించి ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు.

ఇంట్లో తల్లి మృతదేహం చెంత 9 రోజులు!

ఆమె హఠాన్మరణంతో షాక్‌లోకి ఇద్దరు కుమార్తెలు.. మణికట్టు, గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం

బౌద్ధనగర్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి ఇద్దరు కూతుళ్లు.. ఆ కూతుళ్లకు ఆ తల్లి ! ముగ్గురే ఓ లోకంగా బయటి ప్రపంచంతో ఏమాత్రం సంబంధం లేకుండా బతుకుతున్నారు. ఇంటి తలుపులు ఎప్పుడూ మూసే ఉండటంతో స్థానికులకు ఏమాత్రం అనుమానం రాలేదు. ఆ ఇంట్లో తల్లి చనిపోయిందని.. తొమ్మిది రోజులుగా మృతదేహం ఇంట్లోనే ఉందని.. ఎవ్వరికీ తెలియదు! మృతదేహం నుంచి దుర్వాసన వస్తున్నా.. కుళ్లిపోయి పురుగులు పడుతున్నా తొమ్మిది రోజుల పాటు ఇద్దరమ్మాయిలు మృతదేహంతోనే సావాసం చేశారనీ తెలియదు!! ఆ ఇద్దరు తలుపులు మూసేసుకొని ఇంట్లో ఉన్నదేదో తింటూ.. రాత్రుళ్లు తల్లి మృతదేహం పక్కనే నిద్రిస్తూ గడిపారు. చివరికి వారే ఇంట్లోంచి బయటకొచ్చి 'మా అమ్మ చనిపోయింది' అని చెప్పారు. వారాసిగూడ బౌద్ధనగర్‌లో వెలుగుచూసిన ఈ ఘటన స్థానికులను తీవ్ర ఆలోచనల్లో పడేసింది. అప్పటిదాకా చక్కగా ఉన్న తల్లి హఠాత్తుగా చనిపోవడం జీర్ణించుకోలేక అమ్మాయిలు షాక్‌కు గురై ఎటూ పాలుపోని స్థితిలో ఇన్నాళ్లు ఇంట్లోనే మృతదేహంతో ఉండిపోయారని పోలీసులు అంచనాకొచ్చారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతురాలి పేరు లలిత(45). ఈమె భర్త పేరు సీఎల్ రాజు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. లలిత-రాజు దంపతులకు కూతుళ్లు రవళిక(25), యశ్విత(22) ఉన్నారు. ఐదేళ్ల క్రితం ఇంట్లో గొడవలు జరగడంతో రాజు భార్యాపిల్లలను, ఉద్యోగాన్ని వదిలేసి ఎటో వెళ్లిపోయాడు. అమ్మాయిలకు మేనమామ రమేశ్ ఉన్నా ఆ కుటుంబంతో గొడవలు జరగడంతో మూడేళ్ల క్రితం సంబంధాలు తెగిపోయాయి. రవళిక, యశ్విత పదో తరగతి దాకా చదివి మానేశారు. రవళిక ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలో, యశ్విత ఓ బట్టల షాపులో పనిచేస్తున్నారు. రాజు ఓయూ ఉద్యోగి కావడంతో ఈ కుటుంబం అక్కడి క్వార్టర్స్‌లోనే ఉండేది. అక్కడి అధికారులు క్వార్టర్స్ ఖాళీ చేయాలని చెప్పడంతో రెణ్నెళ్ల క్రితమే లలిత తన ఇద్దరు కూతుళ్లతో కలిసి బౌద్ధనగర్‌కు వచ్చి.. ఓ భవనం మూడో ఫ్లోర్‌లో అద్దెకు ఉంటోంది. అమ్మాయిలకు వచ్చే అరకొర జీతమే ఆధారం కావడంతో ఈ కుటుంబం ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారింది. జనవరి 22న రాత్రి ముగ్గురు భోజనాలు చేసి నిద్రపోయారు. ఉదయం లలిత ఎంతసేపటికి నిద్రలేవకపోవడంతో తల్లిని లేపేందుకు అమ్మాయిలు ప్రయత్నించి.. చనిపోయిందని తెలుసుకున్నారు. తల్లిలేని జీవితం ఎందుకనే విరక్తితో రవళిక, యశ్విత ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. కత్తితో మణికట్టు, గొంతు కోసుకున్నారు. రక్తం బాగా పోవడంతో స్పృహ కోల్పోయినట్టుగా చెబుతున్నారు. మూడు రోజుల తర్వాత స్పృహలోకొచ్చినా కూడా డిప్రెషన్‌తో ఇంటి తలుపులు తెరవకుండా లోపలే ఉండిపోయారు. రోజులు గడుస్తున్న కొద్దీ మృతదేహం కుళ్లిపోయి, దుర్వాసన పెరుగుతుండటంతో భరించలేక శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోంచి బయటకొచ్చారు. స్థానికుల సూచనతో సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడున్న బీఆర్ఎస్ నాయకుడు జి.చంద్రశేఖర్‌ను కలిశారు. తమ తల్లి తొమ్మిది రోజుల క్రితం చనిపోయిందని.. అప్పటి నుంచి మృతదేహం ఇంట్లోనే ఉందని, దహన సంస్కారాలకు సాయం చేయాలని కోరారు. వారి నుంచి భరించలేని దుర్వాసన వస్తుండటం.. ఇద్దరికీ గొంతు, మణికట్టు వద్ద గాయాలుండటాన్ని గమనించిన ఆయన వారాసిగూడ పోలీసులకు సమాచారమిచ్చారు. క్లూస్ టీమ్‌తో కలిసి చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఘటనాస్థలికి వెళ్లారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.



కూతుళ్ల వద్ద ఆగిన డాగ్‌స్క్వాడ్స్

ఈ ఘటనకు సంబంధించి మృతురాలు లలిత సోదరుడు, బ్యాంక్ మేనేజర్ అయిన రమేశ్‌ను పోలీసులు పిలిపించారు. అయితే ఈ కుటుంబం ఎవ్వరితో సఖ్యతగా ఉండరని, మనస్పర్థలు ఏర్పడటంతో కొన్నాళ్లుగా మాట్లాడటం లేదని ఆయన చెప్పారు. ఈ విషాదంలో అమ్మాయిల పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని ఆయనకు పోలీసులు సూచించారు. తల్లి చనిపోయిన షాక్‌లోకి వెళ్లడంతోనే ఇన్నాళ్లుగా కూతుళ్లు మృతదేహం వద్ద ఉండిపోయారని ఏసీపీ తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డాగ్ స్క్వాడ్స్ కూతుళ్లు రవళిక, యశ్విత వద్దకు వెళ్లి ఆగిపోయాయి. పోస్టుమార్టం నివేదిక వచ్చాకే ఘటనపై స్పష్టత వస్తుందని పోలీసులు చెప్పారు.

మార్గదర్శి ఎస్క్రో ఖాతాలో 5.15 కోట్లు

- వాటిని ఆర్బీఐకిగానీ, ప్రభుత్వానికిగానీ బదిలీచేయండి
- తెలంగాణ హైకోర్టుకు తెలిపిన ఏపీ ప్రభుత్వం
- ప్రొసీడింగ్స్ కొనసాగించవచ్చు
- వైఖరి చెప్పిన తెలంగాణ సర్కారు
- విచారణ నుంచి తప్పుకొన్న జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): 'మార్గదర్శి' కేసుపై శుక్రవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఈ కేసుపై తమ అభిప్రాయాలను వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వైఖరి తెలుపుతూ డిపాజిటర్లకు ఇంకా మార్గదర్శి చెల్లించాల్సిన మొత్తం రూ.5.15 కోట్లు ఎస్క్రో ఖాతాలో ఉన్నాయని తెలిపింది. వాటిని ఇంకా 1,270 మంది డిపాజిటర్లకు చెల్లించాల్సి ఉందని పేర్కొంది. అందువల్ల ఆ మొత్తాన్ని ఆర్బీఐకిగానీ, రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని నివేదించింది. హైకోర్టు ఆదేశాల మేరకు పత్రికల్లో బహిరంగ నోటీసు ఇచ్చినప్పటికీ తమకు డబ్బు రావాల్సి ఉందని ఏ డిపాజిటరు ముందుకు రాలేదని గుర్తుచేసింది. 2014లో ఉమ్మడి ఏపీ విభజనకు గురైందని, భౌగోళికంగా పరిశీలిస్తే కేసు నమోదైన దిగువ కోర్టు హైదరాబాద్‌లో ఉన్నందున ఈ కేసుతో ఏపీకి సంబంధం ఉండదని తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ కొనసాగించాలా? వద్దా? అని హైకోర్టే నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఎలాంటి ఆదేశాలు జారీ చేసిన కట్టుబడి ఉంటామని పేర్కొంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శికి వ్యతిరేకంగా వైఖరి తీసుకుంది. కేసును కొట్టివేయాలంటూ మార్గదర్శి చేసిన వినతిని మేజిస్ట్రేటు కోర్టు తిరస్కరించిందని, ఆ నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ వ్యవహారంపై ప్రాసిక్యూషన్ కొనసాగించాలని పేర్కొంది. మార్గదర్శి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లు జస్టిస్ శ్యాం కోషీ, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావుల ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. గతంలో ఆ సంస్థ తరఫున న్యాయవాదిగా హాజరైనందున విచారణ నుంచి తాను తప్పుకొంటున్నానని జస్టిస్ నర్సింగ్‌రావు తెలిపారు. దీంతో ఈ కేసులు వచ్చేవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ నేతృత్వం వహించే ద్విసభ్య ధర్మాసనం ఎదుట లిస్ట్ చేయాలని ధర్మాసనం పేర్కొంది.


జాతరలో పాల్గొన్న భక్త జనం

నాగోబా జాతరకు పోటెత్తిన భక్తులు

- ప్రజాదర్బార్‌పై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రభావం
- వేర్వేరుగా పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు
- ఆదివాసీల సమస్యలపై సీఎంతో చర్చిస్తాం: సీతక్క


నాగోబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరకు భక్తులు, ఆదివాసీలు భారీగా పోటెత్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆదివాసీ తెగల ప్రజలు భారీగా తరలి వచ్చారు. నాగోబాకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన కనిపించింది. కలెక్టర్ రాజార్షిషా అధ్యక్షతన ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. జాతరలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ఆదివాసీల నుంచి శాఖల వారీగా దరఖాస్తులను స్వీకరించారు. అయితే ప్రజాదర్బార్ వేదికగా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన అధికారులు దరఖాస్తులతోనే సరిపెట్టారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో తీసుకున్న దరఖాస్తులకు ఎలాంటి పరిష్కారం చూపారో స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేయలేదు. దీనిపై ఆదివాసీ సంఘాల నేతలు మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రభావంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు వేర్వేరుగా ప్రజా దర్బార్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే గిరిజన ఎమ్మెల్యేలంతా సమావేశమై ఆదివాసీల సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. కొందరు నేతలు ఎన్నికల సమయంలో జై శ్రీరామ్ అంటారని.. ఎన్నికల తర్వాత నై శ్రీరామ్ అంటూ ఎగనామం పెడతారని మాజీ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. కొన్ని పార్టీల పట్ల ఆదివాసీలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి ధర రూ.7022

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పత్తి ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చేయగా, శుక్రవారం మార్కెట్‌కు వచ్చిన పత్తికి మంచి ధర వచ్చింది. అత్యధికంగా రూ.7,022 ధర పలికింది. అత్యల్పంగా ఐదు వేల రూపాయలు, మోడల్ ధర 6,681 రూపాయలు వచ్చింది. ఎక్కువ మంది రైతులకు 6,500 నుంచి ఏడు వేల రూపాయల మధ్య ధర పెట్టారు. శుక్రవారం మార్కెట్‌కు 1,199 బస్తాల్లో 1318.9 క్వింటాళ్ల పత్తిని 330 మంది తీసుకువచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చిక్కుల్లో ఆర్థికం...!

దేశ ఆర్థిక వ్యవస్థ గత కొన్ని సంవత్సరాలతో పోల్చితే కొంత చిక్కుల్లో ఉన్నదన్న విషయం శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే తేల్చి చెప్పింది. మన ఆర్థిక వృద్ధిరేటు ఇప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నింటితో పోల్చితే బలంగానే ఉన్నప్పటికీ దేశీయంగాను, అంతర్జాతీయంగాను పలు సవాళ్లు రాబోయే కాలంలో ఆ జోరుకు పగ్గాలు వేయవచ్చునన్న సంకేతాలు వెలువరించింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు 6.3 నుంచి 6.8 శాతం మధ్యన ఉండవచ్చునని అంచనా వేసింది. 2047 నాటికి వికసిత్ భారత్ కావాలన్న లక్ష్యం నెరవేరాలంటే ఈ వృద్ధిరేటు ఏ మాత్రం సరిపోదు. ఏడాదికి సగటున ఎనిమిది శాతం వృద్ధిని సాధిస్తే తప్ప మనం ఆ లక్ష్యాన్ని చేరడం సాధ్యం కాదు.

గత కొన్నేళ్లుగా ఉన్న సానుకూలతలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం, యూరోపియన్ ఆర్థిక వ్యవస్థల్లో మందగమనం వల్ల ఎగుమతుల రంగం ఎదురీదుతోంది. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో భారత దేశం వాటా కేవలం 2 శాతం ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మన ఎగుమతుల వృద్ధిరేటు 1.6 శాతానికే పరిమితం అయింది. దీనికి తోడు కొత్తగా రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన అమెరికా అధ్యక్షుడు ఆత్మరక్షణ విధానాలకు పెద్ద పీట వేస్తున్నారు. దీని వల్ల అమెరికాకు ఎగుమతులు మరింతగా తగ్గే అవకాశం ఉంది. ఇవన్నీ విదేశాల నుంచి ఎదురవుతున్న సవాళ్లయితే దేశీయంగా ద్రవ్యోల్బణం పెనుభూతంగా ఉంది. గత ఏడాది రుతుపవనాల సానుకూలత కారణంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కొనుగోలుశక్తి పెరిగినప్పటికీ నగర జీవులు మాత్రం ధరల కాటుకు విలవిలలాడుతూనే ఉన్నారు. ఫలితంగా వారి కొనుగోలు శక్తి తగ్గిపోయింది. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని తట్టుకోగల రీతిలో వారి వేతనాలు పెరగడంలేదు. ఈ అస్థిరతల నుంచి బయటపడి నిలకడ వృద్ధిరేటు సాధించాలంటే భిన్న రంగాల్లో సంస్కరణలు చేపట్టక తప్పదన్న విషయం ఆర్థిక సర్వే నివేదికలో తేల్చి చెప్పారు. దేశీయంగా వృద్ధికి ఊతం ఇచ్చే రంగాలను ఉత్తేజితం చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రధానంగా వాణిజ్యం, ఎగుమతులు, పారిశ్రామిక రంగాల విషయంలో నియంత్రణలు సడలించడం, సుంకాలు హేతుబద్ధం చేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నది ఆర్థిక సర్వే సారాంశం. దేశంలో ఉపాధికి వెన్నుదన్నుగా నిలుస్తున్నది ఎంఎస్‌ఎంఈ రంగమే. ఈ రంగంలో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు మితిమీరిన నియంత్రణలను సడలించి పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించాలని సర్వేలో సూచించారు. అలాగే దేశంలో ఇప్పటికీ పప్పుదినుసులు, వంటనూనెల కొరత అధికంగా ఉంది. ఆ కొరతను అధిగమించేందుకు ఇప్పటికీ భారీ పరిమాణంలో వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. అవసరాన్ని మించి తృణ ధాన్యాలు ఉత్పత్తి చేయడాన్ని నిలువరించి పప్పులు, నూనెగింజల ఉత్పత్తిని పెంచడం అవసరమన్న విషయం సర్వే తేల్చి చెప్పింది. ఒకపక్క మార్కెట్ ధరల్లో ఆటుపోట్ల నుంచి రైతులకు రక్షణ కల్పించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు కావడంతో పాటు మరోపక్క సాధారణ గృహస్థులకు రక్షణ కల్పించే సమాంతర వ్యవస్థ ఒకటి ఉండాలని సూచించింది. ఇక ఎగుమతులు ఉత్తేజితం చేయాలంటే వాణిజ్య సంబంధిత వ్యయాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పారు. అప్పుడే భారత్ పోటీ సామర్థ్యం పెంచుకోగలుగుతుంది. ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావాలంటే మధ్యతరగతి ప్రజల ఆదాయాలు పెరగాలని, కంపెనీలు వేతనాల పెంపునకు చర్యలు తీసుకోవడం అవసరమన్న విషయం నాగేశ్వరన్ ఒక చక్కని ఉదాహరణ ద్వారా చెప్పారు. వేతనాల్లో అరకొర వృద్ధి ఉన్నట్టయితే తాను ఉత్పత్తి చేస్తున్న కార్లు అమ్ముడుపోవని ఫోర్డ్ మోటార్ కంపెనీ వ్యవస్థాపకుడు హెన్రీ ఫోర్డ్ గుర్తించారని వ్యాఖ్యానించడం ద్వారా కార్పొరేట్లు లాభాలు మూటగట్టుకుంటే సరిపోదని, దాన్ని ఉద్యోగులకు కూడా వేతన వృద్ధి రూపంలో పంచినప్పుడే ఆర్థిక వృద్ధికి దోహదకారులవుతారని ఆయన స్పష్టంగా సూచించారు. మొత్తం మీద ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడి దేశం స్థిరమైన వృద్ధిరేటు సాధించే దిశగా అడుగేయాలంటే సంస్కరణలను ఆశ్రయించక తప్పదు. ఒక పక్క వ్యయాలను నియంత్రించుకుంటూ మరోపక్క స్థిరమైన వృద్ధిని కొనసాగించడం ద్వారా వికసిత్ భారత్‌కు బాటలు వేయడం అనేది కత్తిమీద సాము అనక తప్పదు. ఆర్థిక సర్వేలో సూచించిన భిన్న మార్గాల్లో పయనిస్తూ దేశ ఉజ్వల భవిష్యత్తుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేటి బడ్జెట్లో ఏ విధమైన బాటలు వేస్తారన్నది వేచి చూడాలి.

సంస్కరణా? సంఘర్షణా?

పౌరులు అందరికీ దేశవ్యాప్తంగా అన్వయించే ఉమ్మడి పౌర స్మృతి అమలుపరిచే ప్రయత్నం చేయవలెను.

– భారత రాజ్యాంగం



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

భావజాల ప్రేరణతో వ్యవహరించే భారతీయ జనతా పార్టీ మన సంవిధానం నిర్దేశించిన పై మాటల (అధికరణ 44) పట్ల చిత్తశుద్ధి చూపుతుందా? ఉమ్మడి పౌరస్మృతి అనే మాటలకు మాత్రం బాగా ప్రాధాన్యమిస్తుంది. ఇది అర్థం చేసుకోదగిన విషయమే. అయితే ఆ అధికరణలోని 'పౌరులు', 'దేశ వ్యాప్తంగా' అనే మాటలను మనం ఉపేక్షించకూడదు.

మన సువిశాల భారతదేశంలో ఏ ప్రాంతంలోనైనా సరే నివసించే లేదా స్థిరపడే హక్కు ప్రతి పౌరునికీ ఉన్నదని, సకల ప్రదేశాలలోను సమస్త పౌరులకూ ఉమ్మడి పౌరస్మృతినే వర్తింపచేయాలన్నది మన రాజ్యాంగ సంకల్పం. అధికరణ 44 ఉద్దేశం అదే. ఎక్కడైనా సరే నివసించి లేదా స్థిరపడి ఒక పౌరస్మృతి లబ్ధిని పొందే హక్కు సమస్త పౌరులకు లభించేందుకు భారత రాజ్య వ్యవస్థ బాధ్యత. పార్లమెంటు చాల వరకు ఈ బాధ్యతను నిర్వహించింది. భారత పౌరులు అందరూ ఒకే కాంట్రాక్టుల చట్టం (లా ఆఫ్ కాంట్రాక్ట్స్ – చట్ట ప్రకారం ఒక ఒప్పందం ఆమోదయోగ్యం కావాలంటే ఆ ఒప్పందం పాటించవలసిన నియమ నిబంధనలను కాంట్రాక్టుల చట్టం నిర్దేశించింది. ఈ నియమ నిబంధనలను పాటించని ఒప్పందాలు చెల్లుబాటు కావు), ఒకే కాల దోష పరిమితి శాసనం (లా ఆఫ్ లిమిటేషన్), ఏ సివిల్ న్యాయస్థానంలోనైనా ఒకే విధమైన విచారణ ప్రక్రియ, పౌరుని సాంఘిక (నేర వ్యవహారాలతో సంబంధం లేని) విషయాలన్నిటికీ ఒకే విధమైన పౌర స్మృతిని అమలుపరచడం ప్రభుత్వ కర్తవ్యం.

వివాహం, విడాకులు, వారసత్వం మొదలైన సాంఘిక వ్యవహారాలకు సంబంధించి చట్టాలు తీసుకొచ్చే బాధ్యత, అధికారాలు పార్లమెంటుకు ఉన్నాయి. అయితే ఉత్తరాఖండ్ రాష్ట్రం వివాహం, విడాకులు, వారసత్వం, వారసత్వ సంక్రమణ వ్యవహారాలపై చట్టాన్ని తీసుకువచ్చే ఈ బృహత్తర బాధ్యతను స్వయంగా నిర్వహించడం ఒక దుస్సాహసమే. ఉత్తరాఖండ్ ఈ చట్టాన్ని భారతదేశ పౌరులు అందరికీ వర్తింపచేయగలుగుతుందా? ఇందుకు ఆ రాష్ట్రానికి అధికారాలు ఉన్నాయా? ఉత్తరాఖండ్ రాష్ట్రంలో పుట్టిన పౌరుల విషయాన్ని తీసుకున్నా వారు ఉత్తరాఖండ్‌లో నివసించుతున్నంతవరకు మాత్రమే ఆ చట్టాన్ని వర్తింపచేయడం సాధ్యమవుతుంది. ఆ చట్టాన్ని ఇష్టపడని ఏ వ్యక్తి అయినా సరే ఉత్తరాఖండ్ నుంచి వెళ్లిపోయి వేరే ప్రాంతంలో స్థిరపడడం ద్వారా ఆ చట్టం నుంచి స్వేచ్ఛ పొందుతాడు. ఉత్తరాఖండ్‌లో నివసించే ఒక పురుషుడు, ఒక మహిళ ఆ రాష్ట్రం వెలుపల సంప్రదాయ బద్ధంగా వివాహం చేసుకోగలుగుతారు. వారు ఉత్తరాఖండ్ నుంచి వెళ్లిపోకుండా, వివాహం చేసుకోకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆపలేదు.

మరో విషయాన్ని కూడా మనం గమనంలోకి తీసుకోవాలి. ఉత్తరాఖండ్‌లో జన్మించిన వ్యక్తికి దేశ వ్యాప్తంగా తన చట్టం అందుబాటులో ఉంచడం గానీ, వర్తింపచేయడం గానీ చేయలేదు. ఉత్తరాఖండ్‌లో పుట్టి, వేరే రాష్ట్రంలో నివసిస్తున్న వ్యక్తి అక్కడ వారిని వివాహం చేసుకుని, వేరే వారి పిల్లలను దత్తత తీసుకున్నా, తన వీలునామాను అక్కడ రిజిస్టర్ చేయించినా వాటికి వర్తింపచేయదగిన శాసనం (అప్లికబుల్ లా) ఏది అనే ప్రశ్న తలెత్తుతుంది. ఉత్తరాఖండ్ చట్టం అమల్లో ఉన్న పార్లమెంటరీ చట్టంతో సంఘర్షిస్తే పార్లమెంటరీ చట్టమే చెల్లుబాటు అవుతుంది.

ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉమ్మడి పౌరస్మృతిని తీసుకువచ్చినా దాని వెనుక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్నదనేది స్పష్టం. ఎవరూ కొట్టివేయలేని వాస్తవమిది. ఉమ్మడి పౌరస్మృతిపై ప్రజల ప్రతిస్పందనలను తెలుసుకునేందుకే ఆ చట్టాన్ని తీసుకువచ్చేలా ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని మోదీ సర్కార్ ప్రోత్సహించిందన్నది స్పష్టాతి స్పష్టం. ఊహించిన విధంగానే ఉత్తరాఖండ్ చట్టం ఒక తీవ్ర చర్చను పురిగొల్పింది. ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్ –యూసీసీ) పై భావనను పరీక్షించేందుకు సమర్థమైన అధికారాలు ఉన్న రాజ్యాంగ సంస్థ లా కమిషన్. 19వ లా కమిషన్ ఆగస్టు 31, 2018న తన నివేదికలో ఇలా అభిప్రాయపడింది : 'యూసీసీని సమకూర్చే చట్టాలను కాక వివక్షను పాటించే, ప్రోత్సహించే చట్టాలను ప్రధానంగా పరిశీలిస్తుంది. ఉమ్మడి పౌరస్మృతి అనేది ప్రస్తుత దశలో తప్పనిసరీ కాదు, వాంఛనీయమూ కాదు'.

మొత్తం మీద ఉత్తరాఖండ్ ప్రభుత్వ లక్ష్యం సమాజ జీవితంలో మారుతున్న విలువలు ఆచారాలు, కట్టుబాట్లకు అనుగుణంగా ప్రగతిశీల, ఉదారవాద చట్టాన్ని తీసుకురావడం కాదని విశదమవుతుంది. కేంద్ర హోం మంత్రి మాటల్లో చెప్పాలంటే 'తిరోగామి మతచట్టాల (పర్సనల్ లాస్)ను తొలగించడమే'నని చెప్పి తీరాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే అధిక సంఖ్యాక వాదాన్ని (మెజారిటేరియనిజం) దృఢంగా ప్రకటించడమే.

ఉత్తరాఖండ్ చట్టంలో మూడు భాగాలు ఉన్నాయి. మొదటి భాగం (సెక్షన్లు 4 నుంచి 48 దాకా) 'వివాహం', 'విడాకులు'కు సంబంధించినది; రెండో భాగం (సెక్షన్లు 49 నుంచి 377 దాకా) 'వారసత్వం'కు సంబంధించినది; మూడో భాగం (సెక్షన్లు 378 నుంచి 389 దాకా) 'సహజీవన సంబంధాలు'కు సంబంధించినది; నాల్గవ భాగం ఇతర అంశాలకు సంబంధించిన వివిధ నిబంధనలు. మొదటి భాగంలోని కొన్ని నిబంధనలు స్వాగతింపదగినవి. మారు మనువు, బహు భార్యాత్వాన్ని నిషేధించారు. వివాహ అర్హత వయసు యువతులకు 18, యువకులకు 21 సంవత్సరాలుగా నిర్ణయించారు. వివాహాన్ని తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలి. కొన్ని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమైనవి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నివసిస్తున్న లేదా వేరే రాష్ట్రంలో జీవిస్తున్న 'రెసిడెంట్' (వాస్తవ్యుడు)కు ఈ చట్టం వర్తిస్తుంది. 'వాస్తవ్యుడు'కు చాలా విస్తృత నిర్వచనమిచ్చారు : (1) ఉత్తరాఖండ్‌లో పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వ శాశ్వత ఉద్యోగి; (2) కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న ఏదైనా పథకం లబ్ధిదారు'. ఈ చట్టం ఉత్తరాఖండ్ 'ప్రాదేశిక అధికార పరిధి' (టెరిటోరియల్ జ్యూరిస్‌డిక్షన్) ఉల్లంఘించింది. ఈ చట్టంలోని కొన్ని నిబంధనలు చర్చనీయాంశాలు. ఉదాహరణకు విడాకులకు సంబంధించిన నిబంధనలు. కొన్ని నిబంధనలు యథా పూర్వస్థితిని సమర్థించేవి. ఒక వ్యక్తి పురుషుడు లేదా మహిళ కావచ్చు. 'వివాహం' అనేది పురుషుడు, మహిళ మధ్య జరగాలి. ఇటువంటి వివాహమే ధర్మ విహితమైనది. కొన్ని నిబంధనలు తిరోగమనపూర్వకమైనవి. కాలానికి అనుగుణంగా లేనివి. కాల దోషం పట్టిన 'దాంపత్య హక్కుల పునఃస్థాపన' (రెస్టిట్యూషన్ ఆఫ్ కాంజుగల్ రైట్స్) యథాతథంగా ఉంచారు.



akbar

> భారత రాజ్యాంగ అధికరణ 44లోని ఉమ్మడి పౌర స్మృతి అనే మాటలకు మాత్రం భారతీయ జనతా పార్టీ బాగా ప్రాధాన్యమిస్తుంది. ఆ అధికరణలోని 'పౌరులు', 'దేశ వ్యాప్తంగా' అనే మాటలను మనం ఉపేక్షించకూడదు. ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌరస్మృతిలోని మాటలు, అంతస్సూచనలను నిశితంగా చూస్తే అది అధిక సంఖ్యాకుల అంటే హిందువుల మత చట్టాలనే మన్నించి, హిందూయేతర మతాల వారు అనుసరిస్తున్న మత చట్టాలలోని అంశాలను తోసిపుచ్చిందని అర్థమవుతుంది.

మూడవ భాగం 'సహజీవన సంబంధాలు' గురించి విపులంగా ప్రస్తావించింది. ఇది తిరోగామి పూర్వకమైనదే కాక, రాజ్యాంగ విరుద్ధమైనది కూడా ఇది ఉత్తరాఖండ్ 'వెలుపల' నివసిస్తున్న ఉత్తరాఖండ్ 'వాస్తవ్యులు'కు కూడా వర్తిస్తుందని ఆ చట్టం పేర్కొంది. విరోధాభాసకు ఇదొక స్పష్టమైన ఉదాహరణ. మూడో భాగం అంతా వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, గోప్యత, ఏకాంత హక్కుపై ఎటువంటి మినహాయింపులు లేని దాడి అని చెప్పి తీరాలి. పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం కనుక ఈ భాగాన్ని పూర్తిగా కొట్టివేయాలి. మూడో భాగంలోని నిబంధనలు (15 నుంచి 19 దాకా) మరింత ఘోరమైనవి. నమ్మండి, నమ్మకపోండి సహజీవనంలో ఉన్న భాగస్వాములకు విధులు, హక్కులను అవి నిర్దేశించాయి!

రెండో భాగం 'వారసత్వం'కు సంబంధించినది. ఈ భాగాన్ని మరింత లోతుగా, నిశితంగా విశ్లేషించవలసిన అవసరమున్నది. 'వీలునామా లేని వారసత్వం' విషయంలో 'హిందూ వారసత్వ చట్టం–1956'లోని నిబంధనలను స్వల్ప మార్పులతో ఈ చట్టంలో చేర్చారు. అయితే ఇతర మతాల వారికి చెందిన వారసత్వ చట్టాలలోని సకల నిబంధనలను పూర్తిగా మినహాయించారు. ఈ చట్టం సంపద' (ఎస్టేట్)ను నిర్వచించింది. సమష్టి దాయాదిత్వాన్ని గుర్తించినట్టు కనిపిస్తుంది. దీన్నిబట్టి ఉత్తరాఖండ్ చట్టం పూర్తిగా హిందూ మతస్థుల ఆచారాలకు అనుగుణంగా ఉందని అర్థమవుతుంది.

'వీలునామా ప్రకారం వారసత్వ సంక్రమణ'కు సంబంధించి భారతీయ వారసత్వ చట్టం–1925లోని నిబంధనలకు కోర్టుల భాష్యాలను అంగీకరించి, కొత్త చట్టంలో చేర్చారు. ఉత్తరాఖండ్ వెలుపల నివసిస్తున్న ఉత్తరాఖండ్ వాస్తవ్యులకు సైతం ఈ యూసీసీని వర్తింపచేయడమనేది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. చట్టంలోని మాటలు, అంతస్సూచనలను నిశితంగా చూస్తే ఉత్తరాఖండ్ చట్టం అధిక సంఖ్యాకుల అంటే హిందువుల మత చట్టాలనే మన్నించి, హిందూయేతర మతాలవారు అనుసరిస్తున్న మత చట్టాలలోని అంశాలను తోసిపుచ్చిందని విశదమవుతుంది. ఉత్తరాఖండ్ చట్టం పౌరస్మృతుల్లో సంస్కరణలకు బీజాలు నాటిందా? లేక భిన్న మతాల మధ్య సంఘర్షణకు నాంది పలికిందా? కాలమే చెప్పుతుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అమిత్‌షా కల ఫలిస్తుందా?

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో భారత కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'మావోయిస్టు రహిత భారత్ అనే స్వప్నం సాకారమవుతోంది' అని ప్రకటించారు. గరియాబంద్ ఎన్‌కౌంటర్ తర్వాత దేశంలో 'మావోయిస్టు ఉద్యమం కొనఊపిరితో ఉంద'ని అన్నారు. ఈ మాటలన్నీ మావోయిస్టు ఉద్యమానికి, భారత ప్రభుత్వానికి మధ్య రాజకీయార్థిక రంగంలో, భావజాల సాంస్కృతిక రంగాల్లో జరుగుతున్న సంఘర్షణకు వ్యక్తీకరణ మాత్రమే. అసలు ఎన్‌కౌంటర్ ఘటనలే ఆ సంఘర్షణ వ్యక్త రూపాలు.

రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సరే మావోయిస్టు ఉద్యమ అణచివేతను కేంద్రమే చూసుకుంటోంది. ఇంతకు ముందు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆదివాసీ ప్రాంతాల మీద వైమానిక దాడులు చేశాయి. ప్రజల మీద రాకెట్ లాంచర్లను ప్రయోగించాయి. దేశ సరిహద్దుల్లో ఉండే సైనిక బలగాలు ఛత్తీస్‌గఢ్ అడవులకు చేరుకున్నాయి. అత్యాధునిక సాంకేతికతను వాడి విప్లవకారుల కదలికలు తెలుసుకొని వేల సంఖ్యలో భద్రతా బలగాలు చుట్టుముట్టి కాల్చేశాయి. ఈ విడత ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. అణచివేత మరింత తీవ్రమైంది.

మామూలుగా ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని కోరుకుంటాం. సంక్షేమ బాధ్యతలు నిర్వర్తించాలని ఆశిస్తాం. కానీ భారత రాజ్యం, కార్పొరేట్ పెట్టుబడి కలిసి కొనసాగుతున్నాయి. వనరుల మీద, మానవుల శ్రమశక్తి మీద అధికారం ఉన్న కార్పొరేట్ వర్గపు రాజకీయార్థిక సామాజిక సాంస్కృతిక ప్రయోజనాలన్నీ భారత రాజ్యంలో ప్రతిఫలిస్తున్నాయి. అడవులను, గనులను, సముద్ర తీరాలను, ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజల ఆస్తులను అదాని, అంబానిలాంటి కార్పొరేట్లకు ఇచ్చేస్తున్నారు. ఈ పాలనా విధానాలు, చట్టాలు, వాటి అమలు కోసం చేస్తున్న సైనిక చర్యలు అన్నీ కార్పొరేట్ రాజ్యపు సారభూత వ్యక్తీకరణలు. సనాతన, సామ్రాజ్యవాద మేలు కలయికగా ఈ వ్యవస్థను యథాతథంగా ఉంచడం రాజ్యం అసలు లక్ష్యం. కార్పొరేట్ దోపిడీని, సనాతనత్వంలోని హింసాపీడనలను బలోపేతం చేయడం బీజేపీ ఆశయం. ఇది ఇట్లా ఉంటూనే చాలా మార్పులు రావచ్చు. అవన్నీ పాత అసమానతలను నిలబెట్టి, కొత్త అసమానతలు తీసుకొచ్చేవే.



> ఒక రాజకీయార్థిక సామాజిక సాంస్కృతిక ఉద్యమంగా మావోయిస్టు పార్టీని నిర్మూలించగలరా? గత యాభై ఐదేళ్ల చరిత్రలో ఇలాంటి నిర్బంధాలను ఆ ఉద్యమం చవిచూసింది. అనేక క్లిష్ట దశలను దాటుకొని వచ్చింది. ఇక ముగిసిపోయిందని అనుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పలు ఆటుపోట్ల మధ్యనే కేంద్ర ప్రభుత్వానికి అతి ముఖ్యమైన టార్గెట్ కాగల స్థాయికి ఎదిగింది.

మావోయిస్టు ఉద్యమంతో భారత రాజ్యానికి అక్కడ పేచీ ఉన్నది. ఫాసిజానికి మిగతా అన్ని ప్రజాతంత్ర ఉద్యమాల మీద ఆగ్రహం ఉన్నప్పటికీ మావోయిస్టు ఉద్యమంలోని మిలిటెన్సీ, త్యాగనిరతి, విశాలమైన ప్రాపంచిక దృక్పథం, ముఖ్యంగా మానవ జీవితాన్ని సరికొత్తగా నిర్మించగల భవిష్యత్ దర్శనం దానికి చుక్కెదురు. పార్లమెంటరీ పార్టీలన్నిటినీ ఓడించేశక్తి దానికి ఉన్నదని గత మూడు సాధారణ ఎన్నికల్లో రుజువైంది. బీజేపీ మీద కొద్దిపాటి వ్యతిరేకత వ్యక్తమైనా మొత్తం మీద సానుకూలంగానే ఉన్నది. దేశంలో ఫాసిస్టులకు అంకెకు రాని ఒకే ఒక శక్తి మావోయిస్టు ఉద్యమం. అది ఆ ఉద్యమ ప్రాపంచిక దృక్పథంలో ఉన్నది. భావజాలంలో ఉన్నది. దాని రాజకీయ కార్యక్రమం వల్లే అనేక సమస్యలపై పోరాటాలు చేయగలుగుతున్నది. వివిధ పోరాట ప్రవాహాలకు ప్రేరణనిస్తున్నది. వాటికి ఉమ్మడి స్వభావాన్ని ఇస్తున్నది. సారాంశంలో రాజ్యాంగ పరిధిలో, దానికి బైటా జరుగుతున్న ప్రజా ఉద్యమాలు కార్పొరేటీకరణకు ప్రతిబంధకంగా తయారయ్యాయి. ఈ ఉద్యమాలు సనాతన భావజాలానికి వ్యతిరేకంగా హేతు వికాసానికీ తోడ్పడుతున్నాయి. ఫాసిస్టు పునాదుల మీద విప్లవోద్యమ ప్రత్యక్ష, పరోక్ష నాయకత్వంలో, ప్రభావాలతో ఉద్యమాలు జరుగుతున్నాయి. మావోయిస్టు ఉద్యమం రాజకీయ భావజాలశక్తిగా ఉన్నంత కాలం ఈ దేశాన్ని కార్పొరేట్ ఇండియాగా మార్చడం కష్టం.

బీజేపీ ఏ ఏ జీవన రంగాల నుంచి కార్పొరేట్ హిందూ రాష్ట్రను స్థాపించాలని అనుకుంటున్నదో ఆ అన్ని తావుల నుంచి ప్రత్యామ్నాయ నిర్మాణం చేయగల చేవ, చూపు, చొరవ మావోయిస్టు ఉద్యమానికి ఉన్నాయని బీజేపీకి స్పష్టంగా తెలుసు. అందుకే మొదట ఈ దేశాన్ని మావోయిస్టు రహిత భారత్‌గా మార్చాలి. ఆ తర్వాతే కార్పొరేట్ భారత్‌గా మార్చడానికి వీలవుతుంది. ఈ రెండు పనుల కోసం కనీసం ఐదారేళ్లుగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2026 మార్చి నాటికి మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలిస్తామని అంటున్నారు. మావోయిస్టు ఉద్యమ ప్రమాదం నుంచి తన దీర్ఘకాలిక వ్యూహాన్ని కాపాడుకోడానికి దేశాన్ని అంతర్యుద్ధంలోకి తోసేశారు. మొదట మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలిస్తే ఇక మిగతా పోరాట వ్యక్తీకరణలకు కనీసంగా చోటులేకుండా చేయడం సులభం.

దీని కోసం భౌతికంగా విప్లవకారులను హత్య చేయడమేగాక దాని చుట్టూ ఒక భావజాలాన్ని కూడా రాజ్యం నిర్మిస్తున్నది. మావోయిస్టు ఉద్యమం కొన ఊపిరిలో ఉందని తానొక్కడే అంటే లాభం ఉండదని అమిత్‌షాకు తెలుసు. ఆ మాట ఒక భావజాలంగా సమాజమంతా వ్యాపించాలి. ఈ స్థితికి కారణం ఫాసిస్టు యుద్ధమని కాకుండా విప్లవోద్యమ పంథాలో తప్పులు వెతికేలా మేధావులను తయారు చేయాలి. ఇక విప్లవం చేయలేరని అయినవాళ్లతో, కానివాళ్లతో కూడా అనిపించాలి. అలాంటి ఒక దుర్బల మానసికతను వ్యాపింపచేయాలి. మావోయిస్టు రహిత భారత్ అంటే మావోయిస్టులు అందరినీ చంపేయడమే కాదు. సమాజాన్ని మౌలికంగా మార్చలేమనే పలాయన మానసికతను స్థాపించడం. ఇది ఎంత ప్రమాదమో ఉదారవాదులు, పీడిత అస్తిత్వశక్తులు, మిగతా విప్లవ సంస్థలు ఆలోచించాలి.

నిజానికి ఒక రాజకీయార్థిక సామాజిక సాంస్కృతిక ఉద్యమంగా మావోయిస్టు పార్టీని ఎప్పటికైనా నిర్మూలించగలరా? గత యాభై ఐదేళ్ల చరిత్రలో ఇలాంటి నిర్బంధాలను ఆ ఉద్యమం చవిచూసింది. అనేక క్లిష్ట దశలను దాటుకొని వచ్చింది. ఇక ముగిసిపోయిందని అనుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని డజన్ల కీలక నాయకులు, వందలాది మంది రెండోస్థాయి, మూడోస్థాయి నాయకులు హత్యకు గురయ్యారు. అనారోగ్యంతో, వయోభారంతో చాలా మంది చనిపోయారు. ఎందరో అర్థాంతరంగా వదిలి వెళ్లిపోయారు. ఇన్ని ఆటుపోట్ల మధ్యనే కేంద్ర ప్రభుత్వానికి అతి ముఖ్యమైన టార్గెట్ కాగల స్థాయికి విప్లవోద్యమం ఎదిగింది. దేశంలో పిడికెడు మంది మినహా నూటా నలభై కోట్ల జనాభాకు విప్లవం అత్యవసరం కావడమే మావోయిస్టు ఉద్యమ వ్యూహాత్మక బలం. ఇది కేవలం ఆశావాదం కాదు. అనేక లోటుపాట్లను సమీక్షించుకొని పురోగమించిన దాని గత, వర్తమాన చరిత్ర సారం. అతి మామూలు మనుషులను నాయకులుగా, మేధావులుగా, రాజకీయ సాంస్కృతిక వ్యూహకర్తలుగా మార్చగల మానవీయ ప్రక్రియ విప్లవోద్యమంలో కొనసాగుతున్నంత వరకు మావోయిస్టు రహిత భారత్ ఎన్నటికైనా సాధ్యమవుతుందా? అమిత్‌షా కల ఫలిస్తుందా?

• పాణి

జాతరలలో జర జాగ్రత్త

గంగానమ్మ, మైసమ్మ, పోచమ్మ, అంకమ్మ, పోలేరమ్మ వంటి గ్రామ దేవతల పేరుతో వివిధ ప్రాంతాల్లో తిరునాళ్ళు నిర్వహిస్తారు. అదే విధంగా శివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున రెండు మూడు రోజులు తిరునాళ్ళు నిర్వహిస్తారు. ఇవన్నీ మన సంస్కృతి, సంప్రదాయాలలో భాగంగా జరుపుకుంటారు. వివిధ జాతరలు, తిరునాళ్ళు సందర్భంగా ఊరంతా సందడిగా ఉంటుంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు కలవడానికి ఇవి చక్కటి వేదికలుగా ఉపయోగపడతాయి. కొన్ని జాతరలని ఏడాదికి ఒకసారి నిర్వహిస్తారు. ప్రస్తుతం నాగోబా జాతర జరుగుతున్నది. సమ్మక్క సారక్క వంటి మరికొన్ని జాతరలు రెండేళ్ల కొకసారి నిర్వహిస్తారు. జాతరల సమయంలో పెద్ద ఎత్తున ఒకేచోట జనం చేరే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు సరైన ఏర్పాట్లు చేయకపోతే ప్రజలకు తాగునీరు, ఆహారం కొరత ఏర్పడుతుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎలాగూ తప్పవు. అలాగే వివిధ ప్రాంతాల్లో జాతరలు ముగిసిన వెంటనే సరైన పరిశుభ్రత చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఆ ప్రాంతంలో నివసించే వారికి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

తెలుగు రాష్ట్రాలలో సాధారణంగా ఫిబ్రవరి నుండి మే వరకు తిరునాళ్ళు, జాతరలు ఎక్కువగా జరుగుతాయి. తిరునాళ్ళు సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానిక ఉత్పత్తులకి మంచి డిమాండ్ ఉంటుంది. ప్రభుత్వాలతో పాటు, ప్రజలు కూడా జాతర్ల సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జాతరలు జరిగే ప్రాంతంలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లు వాడకుండా స్వీయ నియంత్రణ పాటించాలి. అదే విధంగా దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది.. కాబట్టి ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. అలాగే జీవ హింస కూడా ఎక్కువగా జరుగుతుంది. మద్యం అమ్మకాలపై నియంత్రణ ఉండాలి. కొన్ని ప్రాంతాల్లో వివిధ మతాలకి చెందిన తిరునాళ్ళు కూడా జరుగుతుంటాయి. ఇవి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆచారాలని ప్రజలు పాటిస్తూనే, కాలానుగుణంగా వచ్చే మార్పులను గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే వాటి పరమార్థం నెరవేరుతుంది.

– యం. రాం ప్రదీప్

ధరణి కష్టాలకు 'భూభారతి'తో చెల్లు!



> కొత్త రెవెన్యూ చట్టం 'భూ భారతి'తో రెవెన్యూ రికార్డుల నిర్వహణలో అనేక మార్పులు రానున్నాయి. రాష్ట్రంలోని ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలో 'భూదార్' నంబర్‌ను కూడా కేటాయించనున్నారు. భూ క్రయవిక్రయాలు జరిపే సమయంలో ముందుగా ఆ భూమిని సర్వే చేయించాలి. ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. భూభారతి రూల్స్‌ను సైతం ప్రభుత్వం రెవెన్యూ నిపుణుల అభిప్రాయాల మేరకు రూపొందిస్తే ఈ చట్టం పరిపూర్ణం కానుంది. చరిత్రలో గొప్ప భూ చట్టంగా మిగిలిపోనుంది.

అద్భుతం, బ్రహ్మాండం అని ప్రచారం చేసిన 'ధరణి' రాకతో రైతులకు ఏం మాత్రం ప్రయోజనం కలగకపోగా సరికొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయి. రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చిన కొత్తలోనే ధరణితో రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర అధ్యయనం చేసింది. కొత్త ఆర్వోఆర్ చట్టం తెస్తే తప్ప ధరణి దారిద్ర్యానికి చెక్ పడదని భావించింది. దీంతోనే ఆర్వోఆర్ చట్టం–2024 'భూభారతి'కి బీజం పడింది.

గత ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరిస్తామంటూ భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టింది. ఈ సమయంలో రెవెన్యూ ఉద్యోగులకు సరైన సమయం ఇవ్వలేదు. దీంతో మొక్కుబడిగా భూ రికార్డుల ప్రక్షాళన జరిగింది. అదే సమయంలో రకరకాల సాకులతో లక్షలాది ఎకరాల భూములను పార్ట్–బి కింద పెట్టారు. వీరికి గతంలో పట్టాదారు పాస్ పుస్తకాలున్నా కొత్త పుస్తకాలు జారీ చేయలేదు. చివరకు ఈ భూముల వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు కూడా చేయలేదు. ధరణి రాకతో లక్షలాది మంది రైతులు ఉన్న హక్కులను కోల్పోయారు. వివిధ రకాల సాకులతో ఏకంగా 18.45 లక్షల భూమిని రికార్డుల్లోకి ఎక్కించలేదు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలోనే పరిష్కారం కావాల్సిన భూ సమస్యలను హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ వరకు తెచ్చారు. రెవెన్యూ కోర్టులను ఎత్తేశారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేకంగా ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేస్తామని చేయకపోగా, జిల్లా స్థాయిలోనే మమ అనిపించి ఏ ఒక్కరికీ న్యాయం చేయకుండానే సివిల్ కోర్టులను ఆశ్రయించాలని సెలవిచ్చారు. భూ సమస్యలుంటే ధరణి పోర్టల్‌కు దరఖాస్తు చేసుకుంటే పరిష్కారం చేస్తామంటూ ఉచిత ప్రకటనలు నాటి ప్రభుత్వ పెద్దలే చేశారు. దరఖాస్తు రుసుంగా వేలకు వేల రూపాయలు వసూలు చేశారు. ఈ విధంగా చేసినా ఏ ఒక దరఖాస్తునూ ధరణి పరిష్కరించలేదు. మాడ్యూల్స్ పేరుతో సుమారు నాలుగేళ్ల ఊరిస్తూ రైతులను కష్టాలకు గురి చేస్తూ వచ్చారు.

రాష్ట్రంలో భూ సమస్యలు పరిష్కారం కావాలంటే కొత్త ఆర్వోఆర్ చట్టంతోనే సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. రెవెన్యూ అధికారులకు అధికారాలు ఇస్తూ, రైతులకు భూములపై హక్కులు కల్పిస్తూ, భూ సమస్యల పరిష్కరించేందుకు ఆర్వోఆర్ చట్టం–2024 భూభారతి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో ముందుగా ఈ చట్టానికి సంబంధించిన ముసాయిదాను ప్రవేశపెట్టారు. ఇదే ముసాయిదాపై తొలిసారిగా చరిత్రలో నిలిచిపోయే విధంగా వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను సైతం తీసుకున్నారు. వీటన్నింటి క్రోడీకరణ తర్వాతనే భూ భారతి బిల్లు–2024ను శాసనసభ, శాసనమండలిలో ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. గవర్నర్ ఆమోదం సైతం ఇటీవలనే లభించింది.

ధరణి పోర్టల్ బాధ్యతలను గత ప్రభుత్వం విదేశీ సంస్థ టెర్రాసిస్‌కు ఇచ్చింది. విదేశీ సంస్థ చేతిలో మన రాష్ట్రంకు సంబంధించిన విలువైన భూములను పెట్టడం సరైన పద్ధతి కాదనేది మొదటి నుంచీ ఉన్న విమర్శ. టెర్రాసిస్ కాంట్రాక్టు గడువు గత ఏడాది డిసెంబరు 31తో ముగిసింది. వెనువెంటనే రేవంత్ సర్కార్ పోర్టల్ బాధ్యతలను నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)కి అప్పగించింది. ఈ విధంగా ధరణితో పాటు టెర్రాసిస్‌కు కూడా ప్రభుత్వం మంగళం పాడింది.

కొత్త రెవెన్యూ చట్టం 'భూ భారతి'తో రాష్ట్రంలో భూ సమస్యలకు చెక్ పడనుంది. ఇదే కాకుండా రెవెన్యూ రికార్డుల నిర్వహణలో అనేక మార్పులు రానున్నాయి. రాష్ట్రంలోని ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలో 'భూదార్' నంబర్‌ను కూడా కేటాయించనున్నారు. భూ క్రయవిక్రయాలు జరిపే సమయంలో ముందుగా ఆ భూమిని సర్వే చేయించాలి. ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. క్రయవిక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మ్యుటేషన్ కూడా పూర్తవుతుంది. కానీ, వారసత్వంగా జరిగే భూముల బదిలీ (ఫౌతీ)లో కొత్త నిబంధన తీసుకొచ్చారు. తహశీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగినా, మ్యుటేషన్ చేసే అధికారాన్ని మాత్రం ఆర్డీవోకు అప్పగించారు. నిర్ణీత కాలం పాటు (30 రోజులు) మ్యుటేషన్ చేయకుండా నిలిపివేస్తారు. ఆ లోగా ఆ భూమిపై ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ప్రక్రియ పూర్తి చేస్తారు. కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ 38 ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హక్కులపై మ్యుటేషన్ అధికారాలను ఆర్డీవోకు ఇవ్వడం జరిగింది.

ధరణి పోర్టల్‌లో మొత్తం 33 మాడ్యూళ్లు ఉండగా భూభారతిలో వాటిని 6కు తగ్గించనున్నారు. ప్రస్తుతం భూమి పట్టాలో కేవలం రైతు పేరు మాత్రమే ఉండగా ఇకపై అనుభవదారు (కాస్తు) కాలమ్ సహా మొత్తం 11 కాలములు ఉంటాయి. పార్ట్–బీ కేసులు పరిష్కారమైనవారి వివరాలను భూ రికార్డుల్లో ఎక్కించి, పాస్ బుక్ ఇచ్చేలా మార్పులు చేశారు. తహశీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారం ఇచ్చారు. జిల్లా స్థాయిలోనే భూసమస్యలు పరిష్కారం అయ్యే వ్యవస్థ అందుబాటులోకి రానుంది. జిల్లా స్థాయిలోనే ట్రిబ్యునళ్లను సైతం ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. వీటితో కోర్టులపై ఒత్తిడి కూడా తగ్గనుంది. ధరణి ముసుగులో గత పాలకులు రెవెన్యూలో గ్రామ స్థాయిలో పనిచేసే వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు చేశారు. కొత్త రెవెన్యూ చట్టంతో ప్రజలకు క్షేత్ర స్థాయిలో సేవలు అందించేందుకు గ్రామానికో రెవెన్యూ అధికారి రాబోతున్నారు.

గత ప్రభుత్వం ఆర్వోఆర్ చట్టం–2020 ద్వారా ధరణి పోర్టల్‌ను తెచ్చింది. కానీ చట్టానికి సంబంధించిన రూల్స్‌ను మాత్రం తేలేదు. ఆర్వోఆర్ చట్టం 2024కు భూభారతికి రూల్స్‌ను కేవలం మూడు నెలల్లోనే అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ప్రకటించిన దాని ప్రకారం రూల్స్ అనేవి ఆచరణాత్మకంగా ఉండేలా ఉండాలి. చట్టానికి రూల్సే ప్రాణం. వీటిని సైతం ప్రభుత్వం రెవెన్యూ నిపుణుల అభిప్రాయాల మేరకు రూపొందిస్తే భూ భారతి చట్టం పరిపూర్ణం కానుంది. చరిత్రలో గొప్ప భూ చట్టంగా మిగిలిపోనుంది.

▪ డా. ఎన్.యాదగిరిరావు
అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ

ఓరుగల్లులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, లెదర్ పార్కు సైనిక్ స్కూల్ ఏర్పాటు.. కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా.. కోచ్ ఫ్యాక్టరీ, కొత్తరైల్వేలైన్ల నిర్మాణం.. ఇవే కాదు రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీతో పాటు మేడారం మహాజాతరకు జాతీయ హోదా కల్పన లాంటి వాటి కోసం ఉమ్మడిజిల్లా వాసులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు. ఏటా కేంద్రం కరుణిస్తుందని.. బడ్జెట్‌లో కేటాయింపులు చేసి తమ కలలను సాకారం చేస్తుందని ఆశిస్తున్నారు. కానీ ఎప్పుడూ నిరాశే మిగులుతోంది. అయితే ఈ సారి పలు పథకాలు, అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుంచి నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మోదీ సర్కారును కోరిన నేపథ్యంలో ఎంతోకొంత మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అందరూ శనివారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



కేంద్రం కరుణించేనా?

నేటి నిర్మలమ్మ పద్దుపై ఓరుగల్లు వాసుల ఆశలు

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టే బడ్జెట్‌పై ఓరుగల్లు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో పలు పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనుల పూర్తికి అవసరమైన నిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరడం, ఆ ప్రతిపాదనల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాల అంచనాలను అందించడం లాంటి పరిణామాలతో ఈ సారి కేంద్రం కరుణించి.. బడ్జెట్‌లో ఓరుగల్లుకు కేటాయింపులు జరుపుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించిన వాటిలో వరంగల్ నగరంలో చేపట్టనున్న భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, లెదర్ పార్కు, సైనిక్ స్కూల్‌తో పాటు కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా, కోచ్ ఫ్యాక్టరీ, కొత్త రైల్వే లైన్లకు కేంద్ర బడ్జెట్‌లో చోటు లభిస్తుందనే ఆశతో ఓరుగల్లువాసులు ఉన్నారు. వీటితో పాటు విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీతో పాటు మేడారం మహాజాతరకు జాతీయ హోదాపై కేంద్రం తేల్చుతుందనే ఆశతో ఉన్నారు. శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి ఓరుగల్లును కరుణిస్తారా అనేది ఉత్కంఠగా మారింది.

కేఎంటీపీకి పీఎం మిత్రలో చోటు దక్కేనా?

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)కు పీఎం మిత్ర పథకంలో చోటివ్వడంతో పాటు గ్రీన్ ఫీల్డ్ హోదా ఇవ్వాలని, అంతేకాకుండా రూ.300కోట్ల గ్రాంటు కూడా విడుదల చేయాలని

మిగతా 7వ పేజీలో...

- పలు అభివృద్ధి పనులకు ఇకనైనా మోక్షం కలిగేనా?
- వివిధ పథకాల నిర్వహణకు కేంద్ర నిధుల కోసం ప్రభుత్వం లేఖ
- నగరంలో భూగర్భ డ్రెయినేజీకి రూ.4,170కోట్లు కోరిన రాష్ట్రం
- టెక్స్‌టైల్ పార్కును పీఎం మిత్రలో చేర్చి.. రూ.300కోట్ల గ్రాంటు ఇవ్వాలని విజ్ఞప్తి
- లెదర్ పార్కు, సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం ఎదురుచూపులు
- కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా.. కోచ్ ఫ్యాక్టరీకి నిధులొచ్చేనా?
- కాజీపేట- భూపాలపల్లితో పాటు మూడు కొత్త రైల్వేలైన్లకు మోక్షం కలిగేనా?
- నేడు పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలాసీతారామన్

భూగర్భ డ్రెయినేజీకి నిధుల కోసం..

వరంగల్ నగరంలో 10లక్షలకు పైగా జనాభా, 1,500లకు పైగా కాలనీలున్నాయి. కానీ నగరంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటంతో లోతట్టు ప్రాంతలు ఏటా నీట మునిగిపోవాల్సిందే. భారీ నిర్మాణాలతో నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయింది. అడ్డదిడ్డంగా నిర్మించిన ఇళ్లతో నీళ్ల బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో వానాకాలం కష్టాలు తప్పటం లేదు. అయితే ఈ కష్టాలకు కాస్తంత ఊరటనిచ్చేదిగా పేర్కొన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను త్వరిత గతిన నిర్మించాలన్న డిమాండ్ ప్రజల్లో డిమాండ్ ఉంది. దీంతో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ మహనగరంలో భూగర్భ డ్రెయినేజీని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు నవంబరు 19వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా భూగర్భ డ్రెయినేజీకి మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రూ.4,170కోట్ల నిధులతో వరంగల్ నగరంలో మూడు విడతల్లో భూగర్భ డ్రెయినేజీని పూర్తి చేస్తామని ప్రకటించింది. అయితే ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. బడ్జెట్‌లో కేంద్ర కరుణిస్తుందా అనే ఉత్కంఠ ఓరుగల్లు వాసుల్లో నెలకొంది.



బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న వివిధ బీసీ సంఘాల నాయకులు

యుద్ధభేరి సభతో బీసీల సత్తా చూపిస్తాం

- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలి
- బీసీ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయండి
- బీసీ వరంగల్ జేఏసీ చైర్మన్, టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్

6

కేయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం



- ఉత్తర్వులు జారీ చేసిన వీసీ ప్రతాప్‌రెడ్డి
- కొత్త రిజిస్ట్రార్‌కు అభినందనల వెల్లువ

7

నేడు జనగామకు మందకృష్ణ

జనగామ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ శనివారం జనగామకు రానున్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మండే మాదిగల గుండె చప్పుడు వినిపించేందుకు, రాజధానిలో రణభేరి మోగించేందుకు చేసే వేల గొంతులు-లక్ష డప్పులు కార్యక్రమ విజయవంతానికి గాను జనగామలో సన్నాహక డప్పుల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న జరిగే ఈ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని నాయకులు తెలిపారు. జనగామ జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు సంకకు డప్పు వే సుకొని తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ కోరారు.

ఎకో టూరిజం ఏర్పాటుకు చర్యలు

అధికారులతో కలెక్టర్ ప్రావీణ్య



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుడా ప్రదిపాదించిన ఎకో టూరిజం పార్కు ఏర్పాటు చేసేందుకు ధర్మసాగర్ మండలంలోని ఇనుపరాతి గుట్టలో స్థల ఎంపికను అధికారులు సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కుడా, అటవీ, రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని ఎంపిక చేసిన ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఈ పార్కు ఏర్పడితే ప్రజలకు, పిల్లలకు సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే హాట్ బెలూన్స్, వాటర్ స్పోర్ట్స్, రకరకాల పక్షులను చూడవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి లావణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవో రాథోడ్ రమేశ్, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులపై దృష్టి సారించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ పరిధిలో బడా బకాయిదారులపై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో పన్ను వసూలు పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ హాజరై అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పన్నుల వసూలు జరగలేదని ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం రెండు మాసాల సమయం మాత్రమే ఉందన్నారు. అలసత్వాన్ని వీడి ప్రణాళికాబద్ధంగా సమగ్ర కార్యాచరణ రూపొందించుకుని పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రతీ వార్డు ఆఫీసర్ వారి డివిజన్‌లలో పెద్ద మొత్తంలో బకాయి ఉన్న 200 మంది జాబితా సిద్ధం చేసుకుని డివిజన్‌ల కమర్షియల్ రెసిడెన్షియల్‌లలో పన్ను వసూలు చేసిన జాబితా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతీ రోజు మధ్యాహ్నం వరకు రెసిడెన్షియన్ పన్ను వసూలు పూర్తి చేసి పెద్ద మొత్త మొత్తంలో బకాయి ఉన్న వారి నుంచి పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రాపర్టీ ట్యాక్సీలో ఇప్పటి వరకు 10.83 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయని ఇంకా రూ66.88 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటి కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, పన్నుల అధికారి రామకృష్ణ, రెవెన్యూ అధికారులు షహజాది బేగం, శ్రీనివాస్, యూసుఫ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డ్రైవింగ్ చేయాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝూ



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝూ

హనుమకొండ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝూ అన్నారు. శుక్రవారం హనుమకొండ డిపోలో రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝూ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత సంవత్సరంతో పోల్చితే రోడ్డు ప్రమాదాల శాతం తగ్గాయన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ డ్రైవింగ్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ కూడళ్లలో డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షతమైన డ్రైవింగ్ చేసి ప్రతిభ కనబరిచిన డ్రైవర్లును అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభాను, ట్రైయినీ ఐపీఎస్ మన్నవ్, ఆర్టీసీ డిపో మేనేజర్లు, అధికారులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బంజరు భూములు, వ్యవసాయం అనుకూలంగా లేని భూముల్లో సౌరశక్తిని ఉత్పత్తి చేసి ఆదాయం పొందేందుకు రైతులు, వ్యవయసాయ ఉత్పత్తి సంఘాలు, రైతు సముహాలు, నీటి వినియోగదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలు, పంచాయతీలు, గ్రామ సంస్థలు, మండల సమాఖ్యలు, డెవలపర్స్ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ, వరంగల్ ఎస్ఈలు వెంకట రమణ, మధుసూదన్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను టీజీఇఆర్‌సి నిర్ణయించిన టారిఫ్ మేరకు డిస్కం కొనుగోలు చేస్తోందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 22 ఆఖరి తేదీ అని పేర్కొన్నారు.

కాళోజీ వర్సిటీ.. సమస్యలతో సుస్తీ

- ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని పట్టించుకోని వైనం
- హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా పనిచేయని దైన్యం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

వరంగల్ మెడికల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి సమస్యల సుస్తీ చేసింది. కనీసం హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా పనిచేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థులు, తల్లిదండ్రులు, అనుమానాల నివృత్తి కోసం సుదూర ప్రాంతాల నుంచి విశ్వవిద్యాలయానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తీరా ఇక్కడికి వచ్చాక కనీసం పరిపాలన భవనంలోకి కూడా వెళ్లనీయడం లేదని బాధితులు వాపోతున్నారు.

అధికారులు కలవరు

సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన బాధితులు అనుమానాల నివృత్తి కోసం అధికారులను కలిసేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఏ కార్యాలయంలోనైనా సందర్శకులను నేరుగా కలిసేందుకు అధికారులు నిర్దిష్ట సయమాన్ని కేటాయిస్తారు. కానీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎందుకు భిన్నంగా వ్యవహరించడం పట్ల బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

సిబ్బంది కొరత

విశ్వవిద్యాలయం తీవ్ర సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతోంది. వైద్య విద్యార్థులకు తగిన సమయంలో సేవలు అందడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న వారిపై పనిభారం పెరగడంతో నిర్లక్ష్యమైన సమాధానాలు ఇస్తున్నారని వైద్య విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వీసీ నియామకం ఎన్నడో?

సుమారు పదేళ్లుగా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డాక్టర్ బి.కర్ణాకర్‌రెడ్డి కొనసాగుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన వీసీ నియామకం కోసం సెర్చ్ కంపెనీ ఏర్పాటు చేసింది. సెర్చ్ కంపెనీ కూడా ముగ్గురి పేర్లను సిఫార్సు చేసినట్లు అధికారికంగా తెలుస్తుంది. అయినా నూతన వీసీ నియామకం చేయకపోవడం పట్ల కారణాలు తెలియడం లేదు. కొత్త వీసీ రావడం ఖాయం కాబట్టి పాత వీసీ పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సారించి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం సమస్యలను పరిష్కరిస్తూ నూతన వీసీ నియామకాన్ని చేపట్టాలని వైద్య విద్యార్థులు తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ప్రోత్సాహక పథకం (ఎకనామికల్ రిహాబిలిటేషన్ స్కీం) కింద రుణాల కోసం అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి జయంతి ఒక ప్రకటనలో తెలిపా రు. దివ్యాంగులకు జీవనోపాధి అవకాశాలు కల్పించడం కోసం 100శాతం రాయితీతో రూ. 50 వేల చొప్పున జిల్లాలో 13 యూనిట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీలోగా tgobmms.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు చేపూరి శ్రీరామ్‌తో.. 25వ అష్టావధానం

హనుమకొండ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి అవధానిగా పేరుగడించిన చేపూరి శ్రీరామ్‌చే 25వ అష్టావధానం ఆదివారం ఉదయం 10 గంటలకు వరంగల్ దర్శన్ స్టూడియోలో నిర్వహిస్తున్నారు. కాకతీయ పద్య కవిత వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రత్యేక అవధాన కార్యక్రమంలో పద్య ప్రియులు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కాకతీయ పద్య కవిత అధ్యక్షుడు కంది శంకరయ్య, కార్యక్రమ కోఆర్డినేటర్ ఏ.కరుణాసాగర్‌లు కోరారు.

యుద్ధభేరి సభతో బీసీల సత్తా చూపిస్తాం

- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలి
- బీసీ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయండి
- బీసీ వరంగల్ జేఏసీ చైర్మన్, టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి సభతో బీసీల సత్తా ఏంటో చూపిస్తామని బీసీ వరంగల్ జేఏసీ చైర్మన్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం వివిధ బీసీ సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడారు. ఈ సభ ఆరంభం మాత్రమేనని, బీసీలమంతా ఏకమయ్యామని, ఇక నుంచి ఓట్లు మావే... సీట్లు మావేనన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆరంభమైన యుద్ధభేరి సభ.. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో విజయభేరిగా మారబోతుందన్నారు. గత 77 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై వివక్ష కొనసాగుతుందని, ఇక వారి ఆటలు సాగవనే పరిస్థితికి బీసీలు చేరుకున్నారన్నారు. ఈ సభ ఆరంభం మాత్రమేనని, రానున్న రోజుల్లో బీసీల ఐక్యతతో తమ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. స్థానిక సంస్థలలో మొదలుపెట్టి, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో సైతం 50 శాతం సీట్లు బీసీలకు కేటాయించాలన్నారు. లేకపోతే బీసీలంతా పూర్తిగా ఏకమైతే మీ పార్టీలకు పుట్టగతులుండవని హెచ్చరించారు. బీసీలను తమ బానిసలుగా, సేవకులుగానే చూశారే తప్ప లీడర్లుగా గుర్తించలేదన్నారు. మేం లక్ష మందితో సభ జరపాలనుకున్నామని, కానీ ఆసంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. సభకు అనుగుణంగా పోలీసు అధికారులు సహాయ సహకారాలు అందించాలని, ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా సహకరించాలన్నారు. ఈ సభతో రాష్ట్రంలో బీసీ విప్లవం రాబోతుందని, దేశమంతా ఈ సభ వైపే చూస్తుందన్నారు. రాజకీయ యుద్ధభేరిసభకు ముఖ్య అతిథులుగా డీఎంకే పార్టీ ఎంపీ విల్సన్, ఆర్జేడీ పార్టీ ఎంపీ మిస్సాయాదవ్, ఎస్పీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ హాజరవుతారని, వీరితో పాటు ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, తీన్మార్ మల్లన్న, సినీ నటుడు సుమన్‌లు హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ నాయకులు రాజకీయాలకతీతంగా హాజరు కావాలన్నారు.

ఎమ్మెల్సీగా ఆశీర్వదించి గెలిపించండి..

రాబోయే ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటున్నానని, ఉపాధ్యాయులు ఆదరించి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని సుందర్‌రాజ్ యాదవ్ కోరారు. అటు ప్రభుత్వ విద్యా వ్యవస్థ, ఇటు ప్రైవేట్ విద్యా వ్యవస్థపై అవగాహన ఉన్న వ్యక్తిగా మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానన్నారు. అనంతరం బీసీ రాజకీయ యుద్ధభేరి సభా స్థలాన్ని బీసీ సంఘాల నాయకులు పరిశీలించారు. వివిధ బీసీ సంఘాల నాయకులు పల్లెబోయిన అశోక్, బొనగాని యాదగిరి గౌడ్, వడ్నాల నరేందర్, పులి రజనీకాంత్, రవీందర్ రాజయ్య, శ్యాం, అరుణ, ఓదెలు, కనకరాజు పాల్గొన్నారు.

‘రేపు కొత్త పొద్దు కోసం’ కవితా సంకలనం ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవయిత్రి, వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు గట్టు రాధిక కలం నుంచి జాలువారిన తాజా కవితా సంకలనం కొత్త పొద్దు కోసం ఆవిష్కరణోత్సవం ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రాక్టీసింగ్‌స్కూల్‌లో జరుగుతుంది. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సభలో ప్రముఖ కవి యాకూబ్ కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తారు. కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వి ఆర్.విద్యార్థి, ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి, సినీ దర్శకుడు గట్టు నవీన్ కుమార్ తదితరులు అతిథులుగా పాల్గొంటారు. పెనుగొండ సరసిజ సంకలనాన్ని సమీక్షిస్తారు. సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రాధిక కోరారు.

పత్తి చివరి క్వింటా వరకు కొనుగోలు చేస్తాం

సీసీఐ సీజీఎం పాణిగ్రహి


సీసీఐ సీజీఎం పాణిగ్రహి

వరంగల్ వ్యవసాయం, జనవరి31 (ఆంధ్రజ్యోతి): పత్తి చివరి క్వింటా వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) సీజీఎం(మార్కెటింగ్) పాణిగ్రహి తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఈ ఏడాది సెప్టెంబర్ వరకు పనిచేస్తాయని, రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా 77189 55728 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం పంపాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

అమ్మవారి సన్నిధిలో వేములవాడ ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్

వరంగల్ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక భద్రకాళి అమ్మవారిని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. శిశిర నవరాత్రులను పురస్కరించుకొని శుక్రవారం ఆయన ముందుగా గోపూజ నిర్వహించి వల్లభ గణపతిని దర్శించుకొని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శిశిర నవరాత్రులను పురస్కరించుకొని భక్తుడు జైపాల్ రెడ్డి పుష్పాలంకరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దవంగర, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని సూపరింటెండెం ట్ ఇంజనీర్ జె.నరేష్ అన్నారు. టీఎస్ ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పోచంపల్లి, వడ్డెకొత్తపల్లి గ్రామాల్లోని సబ్‌స్టేషన్‌లో చేపడుతున్న 33కేవీ ఫీడర్ పనలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల కు అవసరమైన స్తంభాలు, విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు అందిస్తామన్నారు. విద్యుత్‌షాక్ రాకుండా విధిగా ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, దీని ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై ఆదనపు భారం తగ్గుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ సిబ్బందిని కోరారు. విద్యుత్‌ను ప్రజలువాడకంలో పొదుపు పాటించాలన్నారు. విద్యుత్ వనరులను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యుత్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఇంజనీర్ జె.నరేష్ కోరారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు ఉన్నట్లుతే స్థానిక విద్యుత్ అధికారులను తెలియజేయాలని కోరారు.

పీఎం అవార్డులకు ప్రతిపాదనలు పంపాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పీఎం అవార్డుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2022 నుంచి 2024 డిసెంబరు నెలాఖరు వరకు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వివరాలతో సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. పీఎం అవార్డుల కోసం మొత్తం మూడు కేటగిరిలలో 14 అంశాలకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. హర్ ఘర్ జల్ యోజన, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, పీఎం విశ్వకర్మ, ప్రధానమంత్రి అవాస్ యోజన, పీఎం స్వానిధి, అంగన్‌వాడీ, పోషన్ అభియాన్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పీఎం సూర్య ఘర్ ముఫ్త్‌బిజిలి యోజన, మిషన్ ఇంద్రధనస్సు, రైతులు, మత్స్యకారులు, పశుపోషకులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పథకం అమలు చేస్తున్న వివరాలను సమగ్రంగా నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఏవో అనురాధ, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, బల్దియా ఉప కమిషనర్ ప్రసన్నరాణి, మెప్మా టీఎంసీ రమేశ్, డీసీపీవో శ్రీదేవి పాల్గొన్నారు.

వర్సిటీల్లో ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టాలి

అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి


సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతు లేఖను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు ఇస్తారి, రామచంద్రం, రాజేందర్

కేయూ క్యాంపస్ జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా వర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల వయస్సును 65 ఏళ్ళకు పెంచడం పట్ల కేయూ అధ్యాపకుల సంఘం (అకూట్) జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, కార్యవర్గం బాధ్యులు ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఎం. శ్రీనివాస్, డాక్టర్ కిశోర్‌కుమార్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కేయూలో ఏర్పాటు చేసిన అకూట్ సమావేశంలో ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ఇతర బాధ్యులు మాట్లాడారు. వర్సిటీల్లో రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని అన్నారు. జీవో 3 ప్రకారం వర్సిటీల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును పెంచడం చారిత్రక నిర్ణయమన్నారు. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో విద్యా ప్రమాణాలు పెరుగుతాయని చెప్పారు. వర్సిటీల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. కొత్తగా నియామకాలు చేపట్టకపోతే వర్సిటీలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకుందని అన్నారు. కార్యక్రమంలో అకూట్ సంయుక్తకార్యదర్శి డాక్టర్ కిశోర్‌కుమార్, ట్రెజరర్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్, అకూట్ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ వై.వెంకయ్య,డాక్టర్ బి. నాగరాజు, డాక్టర్ కుంట అయిలయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేస్తే సీఎం పదవి పోతుందని రేవంత్‌కు భయం

- కమిటీల పేరుతో కాలయపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- విలేకరులతో మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య

హనుమకొండ టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ చేస్తే మాల ఎమ్మెల్యేలతో తన సీఎం పదవి పోతుందని సీఎం రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుందని అందుకే వర్గీకరణ చేయకుండా ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తున్నామని చెప్పి కమిటీలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కువ శాతం జనాభా కలిగిన మాదిగలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ జరగకపోవడం వలన టీచర్ల పోస్టులు, ఎంబీబీఎస్ సీట్లు ఎక్కువ శాతం మాలలకే దక్కాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేయకపోతే మాదిగలంతా ఏకమై బుద్ధి చెబుతారని రాజయ్య సీఎంను హెచ్చరించారు.

పదవీ విరమణ పొందిన సిబ్బందిని సత్కరించిన సీపీ

వరంగల్ క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి పదవి విరమణ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సురేశ్‌కుమార్, ఏసీపీ పార్థసారధి, సురేంద్ర, ఆర్ఐలు సతీష్, శ్రీనువాస్ ఆర్ఎస్సైలు శ్రవణ్, పదవి విరమణ పొందిన కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

కేయూ క్యాంపస్ జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధిలో యువత పాత్రకీలకమని కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ రమ అన్నారు. ఏబీవీపీ నేతృత్వంలో వర్సిటీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను శుక్రవారం ఈసీ మెంబర్ డాక్టర్ బి.రమ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ..యువత ముత్తుకు దూరంగా ఉండాలని, మహనీయులు స్ఫూర్తితోముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాజేశ్, సాయికుమార్, శివకుమార్, పూజ, హరికృష్ణ, ప్రశాంత్, సంయుక్త, కిరణ్, సతీశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షురాలిగా సంగీత


సంగీత

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షురాలిగా కోలెపాక సంగీత నియామకం అయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. కాగా, వరంగల్ జిల్లాకు పూర్తి స్థాయిలో అధ్యక్షుడి ఎంపికయ్యే వరకు వరంగల్ జిల్లా తాత్కాలిక అధ్యక్షురాలిగా సంగీతనే కొనసాగుతారని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగేందర్‌రావు

హనుమకొండ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పని సరి అని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగేందర్‌రావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలో శుక్రవారం రాత్రి ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజనీర్ కేతిడి జితేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఈ నాగేందర్‌రావు మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా విధి నిర్వహణలో తోటి ఉద్యోగుల పై ప్రేమాను రాగాలతో ఉంటూ క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన ఉత్తమ అధికారిగా పేరు సంపాదించుకున్న జితేందర్‌రెడ్డి సేవలను కొనియా డారు. అనంతరం సునిత దంపతులను ఎస్‌ఈతో పాటు తోటి ఇంజనీర్లు, స్టాఫ్, స్నేహితులు, శ్రేయాభిలాషులు, బంధు మిత్రులు శాలు వాలతో ఘనంగా సన్మానించారు. క్వాలిటి కంట్రోల్ ఎస్‌ఈ నర్సింహారావు, జగిత్యాల ఎస్‌ఈ కిషన్‌రావు, హనుమకొండ ఈఈ సురేశ్‌బాబు, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ మెంబర్స్ కందుల ప్రభాకర్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, టీజీవో రాష్ట్ర సెక్రటరీ కిరణ్‌కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత

మడకొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : మడకొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో నర్సింగ్ శిక్షణ విద్యార్థులు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ కోర్సు పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని శుక్రవారం ప్రాంగణం జిల్లా మేనేజర్ పి. జయశ్రీ తెలిపారు. ప్రాంగణం నుంచి 31 అభ్యర్థులు పరీక్ష రాయగా 31 మంది ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణత సాధించడంపై డీఎం హర్షం వ్యక్తం చేశారు. వరంగల్, ఆసిఫాబాద్, ములుగు, జనగాం, కరీంనగర్, భూపాలపల్లి, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు చెందిన విద్యార్థులు ప్రాంగణంలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు.

నిబంధనలకు నీళ్లు.. లక్షల్లో అద్దెల వసూళ్లు

- నగరంలో ఓ కార్పొరేటర్ లీజ్ దందా
- కుడాకు అద్దె చెల్లించని వైనం
- నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు పట్టించుకోని అధికారులు

హనుమకొండ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుడా భవనాన్ని లీజ్‌కు తీసుకున్న ఓ ప్రజాప్రతినిధి నిబంధనలకు నీళ్లొదిలాడు. ఆ కాంప్లెక్స్‌లోని షాపులకు రూ.లక్షల్లో అద్దెలు వసూలు చేస్తూ కుడాకు చెల్లించుకుండా సదరు నాయకుడు చేస్తున్న దందా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. హనుమకొండ బస్టాండ్ ప్రాంతంలోని ఓ కాంప్లెక్స్ సాక్షిగా ఓ కార్పొరేటర్ చేస్తున్న దందా ఇది. సదరు కార్పొరేటర్ ఓ కుడా భవనాన్ని లీజ్‌కు తీసుకొని అందులోని షాపులను కిరాయికి ఇచ్చి రూ.లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్నాడు. కానీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన అద్దె మాత్రం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడు. అధికార పార్టీ నేతగా చలామణీ అవుతూ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి ప్రభుత్వానికి, కుడా కార్యాలయ ఆదాయానికి గండి కొడుతున్నాడు. ఆ కార్పొరేటర్‌పై గతంలో భూ కబ్జా కేసుల్లో కొద్దిరోజులు జైలుకు వెళ్లివచ్చాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి ప్రస్తుతం కార్పొరేటర్‌గా పని చేస్తూనే తనకున్న పరిచయాలతో 2022లో పదేళ్లకు గాను కుడా కాంప్లెక్స్‌ను లీజ్ అగ్రిమెంట్ చేసుకున్నాడు. కుడా చట్టంలోని నిబంధనల ప్రకారం ఇతరకు సబ్ లీజ్ ఇవ్వడానికి ఉండదు. ఒకవేళ అలాచేయాల్సి వస్తే కుడా అధికారులకు నోటీసు ఇచ్చి ఇవ్వాలి. అలా సబ్‌లీజ్ ద్వారా వచ్చిన సొమ్మును కుడా అధికారులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ సదరు కార్పొరేటర్ నిబంధనలకు విరుద్ధంగా కాంప్లెక్స్‌లో ఓ ప్రైవేటు బ్యాంకు సబ్‌లీజ్ అగ్రిమెంట్ చేసుకుని.. తాను కుడాకు చెల్లించాల్సిన దాని కంటే ఎక్కువకు లీజ్ అగ్రిమెంట్ వసూలు చేస్తున్నాడని సమాచారం. అంతేకాదు కాంప్లెక్స్ ఎదుట పార్కింగ్ నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఆరు నెలలుగా అద్దె చెల్లింపు లేదు..

కుడా కాంప్లెక్స్‌కు సుమారు నెలకు రూ. 10లక్షల వరకు అద్దె చెల్లించవలసి ఉండగా.. ఆరు నెలలకు పైగా అద్దె చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా పట్టించుకోవండం లేదని స్థానికులు కుడా అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అధికార పార్టీలో చేరి అధికారులను, పోలీసులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తనకున్న పరిచయాలతో జిల్లా అధికారులనే భయభ్రాంతులకు గురిచేసినట్టు కొందరు అధికారులు చెప్పుకోవడం చర్చనీయాంశమైంది.

కాంప్లెక్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు..

కుడా కాంప్లెక్స్ భవనం అగ్రిమెంట్ ప్రకారం కాకుండా నిబంధనలకు విరుద్ధంగా బిల్డింగ్ షేప్‌ను మార్చి ఫస్ట్ ఫ్లోర్‌ను కూల్చివేసి మెట్లు తొలగించి లిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. తనకు అగ్రిమెంట్ చేసిన 60,583 చదరపు ఫీట్లకు బదులు 2వేల చదరపు ఫీట్లు అదనంగా వాడుకుంటున్నా కుడా అధికారులు స్పందించపోవడం కాంప్లెక్స్ భవనాన్ని కనీసం సందర్శించకపోవడం అధికారుల తీరుపై ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి లీజ్ పేరుతో సబ్ లీజ్‌లకు ఇచ్చి అక్రమాలకు పాల్పడుతున్న కార్పొరేటర్‌కు చెందిన లీజ్ అగ్రిమెంట్‌ను వెంటనే రద్దు చేసి కుడా అధికారులే కాంప్లెక్స్ భవనాన్ని టెండర్ల ద్వారా లీజ్‌కు ఇస్తే లక్షలల్లో ఆదాయం వస్తుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2369	2130
పల్లికాయ (సూక)	6200	4600
పల్లికాయ (పచ్చిది)	5550	3100
కందులు	6533	5540
పెసళ్లు	7501	5133
పత్తి	7000	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13600	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14700	11500
ఎల్లో మిర్చి	16500	13500
యూఎస్341	14300	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కేయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రామచంద్రం

» ఉత్తర్వులు జారీ చేసిన వీసీ ప్రతాప్‌రెడ్డి



రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంకు ఉత్తర్వులు ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ కొత్త రిజిస్ట్రార్‌గా కేయూ సీనియర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కేయూ రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పదవీ కాలం ముగియడంతో శుక్రవారం నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పదవీ బాధ్యతలు చేపట్టారు. వరంగల్ ఉమ్మడి జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వపూర్‌లో పేద దళిత కుటుంబంలో జన్మించి ఉస్మానియా, కాకతీయ వర్సిటీల్లో ఉన్నత చదువులు చదివి స్వయం కృషితో ప్రొఫెసర్‌గా వల్లూరి రామచంద్రం ఎదిగారు. కేయూలో అనేక అకాడమిక్, పరిపాలన పదవులు చేపట్టారు.

పరిపాలనా సమర్థుడు..

కాకతీయ యూనివర్సిటీలో కొత్త రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వర్సిటీలో 1991లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, వర్సిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా అనేక పదవులు నిర్వహించి సమర్థులుగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం దూర విద్య కేంద్రం డైరెక్టర్‌గా, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(సీడీసీ) డీన్‌గా, వర్సిటీ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 33ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం ఉంది. ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పర్యవేక్షణలో ఆరుగురు పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టాలను పొందారు. 47 సెమినార్లతో పాటు కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యారు. 2 పుస్తకాలు, మరో 34 పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఓయూలో రాజనీతి శాస్త్రం, ఎస్వీలో మనోవిజ్ఞాన శాస్త్రం, కేయూలో విద్యవిభాగాల్లో పీహెచ్‌డీపరిశోధనలుచేసి డాక్టరేట్ పొందారు.

అభినందనల వెల్లువ..

ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టగానే వర్సిటీలోని ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, స్కాలర్లు, విద్యార్థులు, ప్రజా సంఘాల బాధ్యులు పుష్పగుచ్ఛం, శాలువాలు అందచేసి ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపారు. వారిలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ బి.నాగరాజు, ఎఫ్‌వో రాజయ్య, టీచింగ్ ఏఆర్ ప్రణయ్‌కుమార్, దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీను, చరిత్ర టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, వర్సిటీ బోధన, బోధనేతర సంఘాల నేతలు, స్కాలర్లు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

కేంద్రం కరుణించేనా?

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపెరల్ (పీఎం మిత్ర) పథకాన్ని 202-22లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఫార్మ్, ఫైబర్, ఫ్యాక్టరీ, ఫ్యాషన్, ఫారిన్ (ఫైవ్ ఎఫ్) విధానంతో టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని కోసం 2021-22 నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరం వరకు రూ.4,445కోట్లు వెచ్చించేలా ప్రణాళిక రూపొందించారు. దేశవ్యాప్తంగా ఏడు టెక్స్ పార్కుల్లో రాష్ట్రానికి ఒకటి కేటాయిస్తున్నట్లు 2023 మార్చి 18న ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. అయితే అప్పటికే రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన కేఎంటీపీ ఉండటంతో పీఎం మిత్ర కింద దీన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. పీఎం మిత్ర మార్గదర్శకాలకు అనుగుణంగా కేఎంటీపీ లేదని కేంద్రం వాదించింది. ప్రధానంగా కేంద్రం వాటా 49 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతంగా ఉంటుంది. పీఎం మిత్ర నిబంధనల ప్రకారం టెక్స్‌టైల్ పార్కు కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి ఎకరాల భూమిని కేటాయించాలి. అలాగే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ పిలిచి డెవలపర్‌ను ఎంపిక చేయాలి. మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి దానికి టెక్స్‌టైల్ శాఖ ఆమోదం పొందాల్సి ఉంటుంది. అలాగే అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, మంచినీరు, వృథా నీటి శుద్ధి తదితర సౌకర్యాలతో పాటు ఉత్పత్తి చేసిన వస్త్రాల డిజైనర్లు, దుస్తుల తయారీదారులు, ఇంక్యుబేషన్ సెంటర్లకు ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. అలాగే కామన్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ, కామన్ ఎఫ్లుయెంట్, ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ), కార్మికులకు వసతి సదుపాయం, ఆరోగ్య సౌకర్యాలు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రం, వేర్‌హౌసింగ్, లాజిస్టిక్స్ లాంటి అదనపు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. కంపెనీలకు స్థలాల కేటాయింపు సైతం స్పెషల్ పర్పస్ వెహికిల్(ఎస్‌పీవీ) ఆధ్వర్యంలో చేపట్టాలి. ఈ మార్గదర్శకాలను అమలు చేస్తే మొదటి దశలో రూ.300కోట్లు, రెండో దశలో రూ.200కోట్లు, మూడో దశలో రూ.500కోట్లు కేంద్రం గ్రాంటుగా ఇస్తుంది. అంతేకాకుండా ఈ పార్కులో ఏర్పాటు చేసే కంపెనీలకు భారీగా సబ్సిడీలు ఇస్తుంది. అయితే ఇప్పటికే భూ సేకరణతో పాటు కంపెనీలతో ప్రభుత్వం ఎంవోయి కుదుర్చుకుంది. దీంతో పీఎం మిత్రను అమలు చేసేందుకు కేంద్రం కొర్రీలు పెడుతుందనే చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో పీఎం మిత్రలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కోరటంతో కేంద్ర ఏలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనే ఆసక్తి ప్రజల్లో నెలకొంది.

లెదర్ పార్కు.. సైనిక్ స్కూల్‌పై ఆశలు?

జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్‌తో పాటు కరీంనగర్ జిల్లాలో లెదర్ పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. దీంతో మూడు దశబ్దాలుగా ఎదురుచూస్తున్న స్టేషన్‌ఘనపూర్‌లోని శివునిపల్లి లెదర్ పార్కుకు మోక్షం లభించేనా అనే ఉత్కంఠ నెలకొంది. శివునిపల్లిలో 117 ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్ పార్కు నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేశారు. అయితే ప్రతిపాదనలు అటకెక్కటంతో 2002లో టీడీపీ ప్రభుత్వ హయంలో 25 ఎకరాల్లో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు .10కోట్ల నిధులు కూడా కేటాయించారు. 2003లో రూ.10లక్షలతో లెదర్ పరిశ్రమ కోసం ఓ భవనం కూడా నిర్మించారు. స్థానికంగా ఆసక్తితో ఉన్న 50మందికి చెన్నైలో చెప్పులు తయారు చేయటం, లెదర్ బ్యాగులు, ఇతర లెదర్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా ఇప్పించారు. రెండు విడతల్లో 120మందికిపైగా లెదర్ ఉత్పత్తుల తయారిపై చైన్నైలో శిక్షణ కూడా ఇచ్చారు. అయినప్పటికి ఇప్పటివరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు. సుమారు వెయ్యి కోట్ల నిధులతో లెదర్ పార్కులను అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ బడ్జెట్‌లో లెదర్ పార్కుకు నిధులు వచ్చేనా అని స్థానికులు ఎదురుచూస్తున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం 2016లో వరంగల్‌కు సైనిక్ స్కూల్‌ను మంజూరు చేసింది. అయితే అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా పునాదులు కూడా పడటం లేదు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కావాల్సిన భూమి, భవనాల నిర్మాణం, ఇతర మౌళిక వసతుల కల్పన కోసం రూ.5కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. తొలుత హసన్‌పర్తి మండల కేంద్రంలో.. ఆ తరువాత ధర్మసాగర్ మండలం ఎల్కుర్తిలో ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. భూ కేటాయింపుల నిర్లక్ష్యంతో వరంగల్‌కు వచ్చిన సైనిక్ స్కూల్ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే వరంగల్‌లోనే సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కొత్తగా ప్రకటించే సైనిక్ స్కూళ్లల్లో వరంగల్‌కు చోటు దక్కుతుందా అనేది ఉత్కంఠగా మారింది.



వెనుకబడిన జిల్లాల అభివృద్ధి మాటేవి ఎటో..?

ఏటా వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లి, ములుగు జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా నీతిఅయోగ్ గుర్తించింది. వీటికి 2017 నుంచి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారు. అయితే 2022 నుంచి వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపులకు బ్రేక్ పడింది. దీంతో ఈ ఏడాది బడ్జెట్‌లో రాష్ట్రంలోని మూడు వెనుకబడిన జిల్లాలకు రూ.1,350 కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుండటంతో వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుందా.. లేదా అనే ఉత్కంఠ నెలకొంది.

రైల్వే డివిజన్ హోదా.. కోచ్ ఫ్యాక్టరీకి నిధులు వచ్చేనా?

కాజీపేటకు రైల్వే డివిజన్ హోదాతో పాటు కోచ్ ఫ్యాక్టరికి నిధులు కేటాయింపుపై ఈ బడ్జెట్‌లో కేంద్రం తేల్చుతుందనే ఆశతో ఓరుగల్లువాసులున్నారు. ఎన్నో ఏళ్లగా కోచ్‌ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలు చేస్తుంటే 2023 జూలై 8వ తేదీన కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాజీపేటలో భూమి పూజ నిర్వహించారు. 2025లోపు పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈ వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. అయితే విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీపై హామీ ఉంటే కేంద్రప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమ ఇచ్చి చేతులు దులుపుకుందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబరు 9వ తేదీన రైల్వే బోర్డు వ్యాగన్ పరిశ్రమను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తు ఆదేశాలు జారీ చేసింది.

అప్‌గ్రేడ్ చేసిన కోచ్ ఫ్యాక్టరీలో ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌లను తయారు చేసేలా యూనిట్‌ను అభివృద్ధి చేయాలని రైల్వే బోర్డు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఇందుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఈ బడ్జెట్‌లో కోచ్ ఫ్యాక్టరీకి నిధులు కేటాయిస్తుందనే ఆశతో ఉన్నారు. అలాగే కాజీపేట డివిజన్ కోసం ఎన్నో ఏళ్లగా రైల్వే ఉద్యోగులు, ప్రజలు పోరాటాలు చేస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ సెంట్రల్ కోస్ట్ జోన్ ఏర్పాటవుతుండటంతో కాజీపేట డివిజన్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ బడ్జెట్‌లో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి నిధులతో పాటు డివిజన్ హోదాపై బడ్జెట్‌లో కేంద్రం వరాలు కురిపిస్తుందనే ఆశతో ఉన్నారు.

మరిన్ని ప్రాజెక్టులపై ఆశలు..

- మామునూరు ఎయిర్ పోర్టుకు భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాలిసిన నిధులను ఈ బడ్జెట్ కేంద్రం కేటాయిస్తుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.
- కోల్ రైల్ ప్రాజెక్టుకు ఇప్పటికే డీపీఆర్ సిద్ధమైంది. రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా రామప్ప, మేడారం, ఏటూరునాగారం నుంచి మణుగూరుకు సుమారు రూ.4,100కోట్ల అంచనా వ్యయంతో 207కిలో మీటర్ల రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే పనులు ప్రారంభం కానున్నాయి.
- కాజీపేట(నష్కల్)- కరీంనగర్ మధ్య రూ.464కోట్ల అంచనా వ్యయంతో 62కి.మీ రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికి నిధులు కేటాయింపులు చేయాల్సి ఉంది.
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్గొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ రైల్వే లైన్. ఈ ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేసింది. నిధులుకేటాయిస్తే పనులుమొదలయ్యే అవకాశం ఉంది.
- డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలో మీటర్ల రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైన్ కోసం రూ.5 వేల కోట్లతో అంచనాలను రూపొందించింది. ఈ ప్రాజెక్టుకు కూడా నిధులు కేటాయించాల్సి ఉంది.
- 2023-24 బడ్జెట్‌లో కాజీపేట-భూపాలపల్లి మధ్య 64కి.మీ నిర్మించే రైల్వే లైన్‌కు ఫైనల్ లోకేషన్ సర్వే కోసం రూ. 1,152కోట్లు కేటాయించింది. సర్వే పూర్తి చేసి, నిధులు కేటాయిస్తే కోల్‌బెల్ట్‌తో వరంగల్ నగరానికి దూరాభారం తగ్గనుంది.
- ములుగు గిరిజన యూనివర్సిటీకి రూ.889.07కోట్ల నిధులు అవసరం. భూకేటాయింపులు పూర్తి కావటంతో పాటు తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. నిధులు కేటాయిస్తే వర్సిటీకి కావాల్సిన నిర్మాణాలు, సామగ్రి కొనుగోళ్లు షురూ చేసే అవకాశం ఉంది.

సినిమాల రాంబాబు మనోడే..

» సినీ రంగంలో రాణిస్తున్న ఏటూరునాగారం వాసి

» రామన్నగూడెం నుంచి ఫిలింనగర్‌కు..

» పలు భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలతో తెరపై రాణింపు



వకీల్‌సాబ్ సినిమాలో ఓ సన్నివేశంలో..


ఏటూరునాగారం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ యువతకు స్ఫూర్తిగా.. ఎన్ని కష్టాలు ఎదురైనా.. పట్టుదలతో కన్న కలలను సాకారం చేస్తూ అనేక మందికి ప్రేరణగా నిలుస్తున్నాడు ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన మామిడి రాంబాబు. తన గురువు ప్రోద్బలంతో రాజధానికి వెళ్లి తన లక్ష్యాన్ని చేరుకునేందుకు శ్రమిస్తున్నాడు. తొలినాళ్లలో చేసింది చిన్న పాత్రలే అయినా తన నటనతో ప్రేక్షకుల మన్ననలు పొంది.. క్రమంగా పలు భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకున్నాడు. సినిమాలు, సిరియళ్లు, వెబ్ సిరీస్‌లలో నటిస్తూ సినిమాల రాంబాబుగా స్థానికులతో పిలిపించుకుంటున్న రాంబాబు 2015లో వచ్చిన బాహుబలి-1 సినిమా కోఆర్డినేటర్‌గా పని చేసిన వినయ్‌తో ఉన్న పరిచయంతో సినీ రంగానికి దగ్గరై ఏటూరునాగారం నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. అంతగా చదువుకోని ఆయన ఓ కిరాణం షాపులో పని చేసేవాడు. ఆ తర్వాత ఓ కాంట్రాక్టర్ దగ్గర కొంత కాలం కొనసాగాడు. మెగాస్టార్ చిరంజీవికి వీరాభిమాని అయిన రాంబాబు సినిమాలపై ఆసక్తితో పది సంవత్సరాల క్రితం హైదరాబాద్ వెళ్లాడు. ఈ క్రమంలో బాహుబలి-1 సినిమాలో సైనికుడిగా నటించి, పనిచేసే అవకాశం లభించింది. ఆ సమయంలోని సినిమా కార్యాలయాల్లోని వారితో పరిచయాలు పెరిగాయి. ప్రారంభంలో రోజుకు రూ.300 వరకు వేతనం పొందిన రాంబాబు నేడు క్రమక్రమంగా ఆది రూ.10వేలకు చేరింది.



ఓచిత్రంలో విలన్ సోనుసూద్ బృందంలో ఒకడిగా..

పెద్ద హీరోలతో..

చిరంజీవి, పవన్ కల్యాణ్, బాలకృష్ణ, రవితేజ, మహేష్ బాబు, ప్రభాస్, గోపిచంద్ వంటి పెద్ద హీరోలతో నటించాడు. పలు సినిమాల్లో విలన్ పాత్రలు కూడా పోషించాడు. రాజమౌళి, త్రివిక్రమ్, వీ.వీ వినాయక్, రాంగోపాల్ వర్మ తదితర అనేక మంది పేరున్న డైరెక్టర్ల సినిమాల్లో నటించి మెప్పించాడు. బాహుబలి 1, 2, వీ.వీ వినాయక్ దర్శకత్వం వహించిన ఖైదీ నెంబర్-150 సినిమాలో అలీని కిడ్నాప్ చేసే సన్నివేశంలో నటించాడు. అంతేకాకుండా సర్దార్ గబ్బర్ సింగ్, సౌక్యం, నేనే రాజు నేనే మంత్రి, శ్రీమంతుడు, తిక్క, చుట్టాలబ్బాయి, రాజాది గ్రేట్, రాధ, నాపేరు శివ నా ఇట్లు ఇండియా, చలో మోహనరంగ, కురుక్షేత్రం, శరభ, గౌతమిపుత్ర శాతకర్ణి, కాటమ రాయుడు, శౌర్యం, డిటెక్టర్, అటాక్, మరుల తెలపవ ప్రియ లాంటి సినిమాల్లో విలన్ బృంద సభ్యుడిగా వివిధ పాత్రలు పోషించాడు. భగవంత్ కేసరి, సరిపోదా శనివారం, స్వయంభూ సింగం, అజయ్ దేవగన్(హిందీ), గేమ్ ఛేంజర్, రాబిన్హుడ్, పుష్ప-2, కన్నప్ప, కూలీ, ప్రణయ గోదారి, భీమా, కుంభస్థలం, బాలకృష్ణ డాకుమహారాజ్ సినిమాల్లో నటించాడు. ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి డైరెక్షన్లో మహేష్ బాబు హీరోగా నటిస్తున్న సినిమాలో అవకాశం దక్కించుకున్నాడు.



బాహుబలి 1లోని ఓ సన్నివేశంలో గుర్రంపై రాంబాబు (ఫైల్)

బుల్లితెరపై..

సినిమాలే కాకుండా బుల్లితెరపైనా నటిస్తూ మెప్పిస్తున్నాడు రాంబాబు. స్వాతి చినుకులు, రాధాగోపాలం, మంగమ్మగారి మనవరాలు, రాములమ్మ, అగ్నిపూలు, అమెరికా అమ్మాయి, గోకులంలో సీత, అగ్నిసాక్షి, కుంకుమ పువ్వు, నాపేరు మీనాక్షి, ప్రతిఘటన, తులసిదళం, మనస్సు మమత, ఆడదే ఆధారం, అగ్నిసాక్షి, నిండు నూరెళ్ల సావాసం, శ్రావణ సంధ్య, ప్రేమ ఎంత మధురం, గుప్పెడంత మనసు, సూర్యకాంతం, అభినందన, మా అన్నయ్య, లక్ష్మీ సౌభాగ్యవతి, చిన్ని, గుండమ్మ కథ, రంగుల రత్నం, సత్యభామ లాంటి అనేక సీరియల్‌ళ్లు, వెబ్ సరిస్‌లో రాంబాబు రాణిస్తున్నాడు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

కాజీపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కంభమేళాకు ఫిబ్రవరి 18, 22 తేదీలలో ప్రత్యేక రైలు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు (07077, 78,) చర్లపల్లి - దానాపూర్‌ల మధ్య అప్ అండ్ డౌన్ నడుస్తుందని తెలిపారు. కాజీపేటలో మధ్యాహ్నం 3 గంటలకు హాల్టింగ్ ఉంటుందని తెలిపారు. జనగామ, కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షాలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

పోలీసు క్రీడల్లో ఏసీపీలకు పతకాలు

వరంగల్ క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏసీపీలు ఎస్బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఏఆర్ ఏసీపీ అనంతయ్యలు పలు పతకాలను కైవసం చేసుకున్నారు. బ్యాడ్మింటన్ 55 సంవత్సరాల డబుల్స్ విభాగంలో జితేందర్‌రెడ్డి- మధుసూదన్ జోడి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. 50 సంవత్సరాల డబుల్స్ విభాగంలో జితేందర్‌రెడ్డి- అనంతయ్య జోడి రజిత పతకాన్ని గెలుచుకున్నారు. టెబుల్ టెన్నిస్ విభాగంలో మధుసూదన్- అనంతయ్య కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. బ్యాడ్మింటన్ సింగిల్‌లో జితేందర్‌రెడ్డి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన ముగ్గురు ఏసీపీలను సీపీ అంబర్ కిషోర్ ఝా, జట్టు మేనేజర్ నాగయ్య అభినందించారు.



పతకాలతో ఏసీపీలు జితేందర్‌రెడ్డి, మధుసూదన్, అనంతయ్య

నేడు, రేపు బొడ్రాయి ఉత్సవాలు

- ముస్తాబైన రంగశాయిపేట బొడ్రాయి
- హాజరు కానున్న మంత్రి కొండా సురేఖ



గ్రామ దేవతలు

శంభునిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవతల వార్షికోత్సవాలకు రంగశాయిపేట ముస్తాబైంది. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల కోసం ఆర్‌వైఎఫ్ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. రంగశాయిపేట యూత్ ఫోర్స్ (ఆర్‌వైఎఫ్) ఆధ్వర్యంలో రంగశాయపేటలో గత సంవత్సరంబొడ్రాయి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగశాయిపేట నెహ్రూ విగ్రహం వద్ద బొడ్రాయిని ప్రతిష్ఠించటంతోపాటు రామాలయం వద్ద బొడ్రాయిని పునః ప్రతిష్ఠించారు. అనంతరం శాస్త్రీయంగా తిరుగువారం, మండల పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం వార్షికోత్సవాల కోసం బొడ్రాయి నిర్వహణ కమిటీ బాధ్యులుతగిన ఏర్పాట్లుచేస్తున్నారు. శనివారం గణపతి పూజతో పూజలు ప్రారంభించి సామూహిక హోమాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం గ్రామదేవతలకు బోనాలు సమర్పిస్తారు. ఈ వేడుకలకు రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.



సిద్ధమైన బొడ్రాయి ప్రాంగణం

దక్షిణమధ్య రైల్వేలో పీవోహెచ్

» యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు

» కాజీపేటలో భూమి లేదని లేఖ ఇచ్చినట్టు సమాచారం

» మహబూబాబాద్, డోర్నకల్‌లో రైల్వే భూములు

» ఎక్కడ ఏర్పాటు చేస్తారనే దానిపై లేని స్పష్టత

మహబూబాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని సికింద్రాబాద్ డివిజన్‌లో నూతనంగా పిరియాడికల్ ఓవర్ హాలింగ్ (పీవోహెచ్) యూనిట్ ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ సన్నాహాలు చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. భారతీయ రైల్వేలో 2027 వరకు 3 వేల మిలియన్ టన్నుల (సుమారు రూ.300 కోట్ల టన్నులు) సరుకు రవాణా చేయాలని రైల్వేశాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఆ లక్ష్యానికి చేరుకోవడానికి తీవ్రమైన లోకోమోటివ్‌ల కొరత ఉన్నందున వాటిని సమకూర్చుకోవడానికి రైల్వేశాఖ కార్యాచరణ చేపట్టింది. ఇందుకుగాను 7014 ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లు అవసరం అవుతాయని అంచనా వేసింది. 2022-23 సంవత్సరాల నుంచి రాబోయే ఐదేళ్లలో వీటిని దశలవారీగా సమకూర్చుకోవాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రతీ ఏడాది 1400 లోకో మోటివ్‌లను సమకూర్చుకోవడానికి రైల్వేబోర్డు అంగీకరించింది. దీని కొరకు అన్ని జోనల్ పరిధిలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పెద్దఎత్తున మానవ వనరులను సమకూర్చుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం భూమి విషయంలో తర్జనభర్జనలు జరుగుతున్న నేపథ్యంలో ఎక్కడ ఏర్పాటు చేస్తారనే దానిపై స్పష్టత రాలేదు.

దక్షిణమధ్య రైల్వే పరిధిలో ప్రస్తుతం..

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 894 ఎలక్ట్రికల్ లోకో మోటివ్‌లు, 570 డిజిల్ లోకోమోటివ్‌లు ఉన్నాయి. 3వేల మిలియన్ టన్నుల సరుకు రవాణా లక్ష్యాన్ని చేరుకోవడానికి దక్షిణ మధ్యరైల్వేకు రెండు వేల గూడ్స్ లోకోమోటివ్‌లు, 480 కోచ్ లోకో మోటివ్‌లు అవసరం అవుతాయి. పెద్దఎత్తున సమకూర్చుకోనున్న లోకోమోటివ్‌ల నిర్వహణ కోసం పీవోహెచ్ యూనిట్ తప్పనిసరి కావడంతో నూతనంగా వాటిని ఏర్పాటు చేయాలని, అప్పుడు లక్ష్యాన్ని చేరుకోడానికి అవకాశం ఉంటుందని భావించిన రైల్వేశాఖ పీవోహెచ్ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది.



పీవోహెచ్‌ల ఏర్పాటుకు సన్నాహాలు..

భారీ సంఖ్యలో లోకోమోటివ్‌లు సమకూర్చుకుంటున్నందున దక్షిణ మధ్య రైల్వే పరిధిలో వాటి నిర్వహణకు అవసరమైన పీవోహెచ్ యూనిట్ ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇందుకు గాను వంద లోకోమోటివ్‌ల నిర్వహణకు అవసరమైన పీవోహెచ్‌లు మొదటి దశలో ఏర్పాటు చేయడానికి సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని కాజీపేట పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం నుంచి సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్‌ను ఆదేశాలు వచ్చాయి. పీవోహెచ్ ఏర్పాటుకు అవసరమైన రైల్వే భూమి ఉంటే వివరాలు తెలపాలని, రైల్వే భూమితో పాటు రాష్ట్రప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూముల వివరాలు సైతం తెలపాలని ఆదేశించింది. జీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలకు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం నుంచి జవాబిస్తూ కాజీపేటలో పీవోహెచ్ ఏర్పాటుకు 130 ఎకరాల భూమి అవసరం పడుతుందని, ప్రస్తుతం కేవలం 10 నుంచి 15 ఎకరాల రైల్వేకు సంబంధించిన భూమి మాత్రమే ఉందని తెలిపారు. కాజీపేటలో రైల్వే వ్యాగన్ తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నందున భూమి లభ్యతలేదని లేఖలో పేర్కొన్నట్టు సమాచారం. అలాగే రాష్ట్రప్రభుత్వ సహకారంతో గతంలో దేవాదాయ భూమిని కూడా సేకరించి వ్యాగన్ తయారీ కేంద్రానికి సమకూర్చినట్లు డీఆర్ఎం కార్యాలయం తెలిపింది.

విజయవాడలోని రాయనపాడులో..

ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడలోని రాయనపాడులో 84 ఎకరాల స్థలంలో పీవోహెచ్ యూని ట్ ఏర్పాటు జరుగుతున్నట్లు తెలిపింది. ఇందులో ఏడాదికి కేవలం 60 లోకో మోటివ్‌ల వార్షిక నిర్వహణ మాత్రమే వీలుపడుతుందని డీఆర్ఎం కార్యాలయం తెలిపింది. దేశంలో ప్రస్తుతం 5,524 లోకో మోటివ్‌లున్నాయి. ప్రతీ ఏడాది వీటిలో 627 లోకోలకు వార్షిక మరమ్మతులు పీవోహెచ్‌ల ద్వారా నిర్వహించాలి. కానీ, కేవలం 426 లోకోల నిర్వహణకు మాత్రమే ప్రస్తుతం ఉన్న పీవోహెచ్‌ల ద్వారా వీలవుతుంది. అందుకే నూతనంగా అవసరం ఉన్నచోట పీవోహెచ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

మహబూబాబాద్, డోర్నకల్‌లో రైల్వే భూములు..

పీవోహెచ్ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన భూములు మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్నాయి. అలాగే డోర్నకల్ రైల్వేజంక్షన్ పరిధిలో సైతం పెద్దఎత్తున రైల్వే భూములు ఉన్నాయి. వీటితో పాటు అవసరమైన భూములను ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సైతం సేకరించడానికి వీలుపడుతుంది. మహబూబాబాద్ జిల్లాలో పీవోహెచ్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎదురుచూస్తున్నారు. రైల్వేశాఖ అధికారులు ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బల్దియాలో ఉన్నతాధికారుల బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో గురువారం రాత్రి ఉన్నతాధికారుల బదిలీలు జరిగాయి. బల్దియాలో టాక్సెషన్ అధికారిగా పని చేస్తున్న బిర్రు శ్రీనివాస్ భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్‌గా, కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న నిమ్మ కృష్ణారెడ్డి హైదరాబాద్ కొంపెల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. అదే విధంగా హైదరాబాద్ గ్రేటర్ మునిసిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న వై. రామకృష్ణ టాక్సెషన్ అధికారిగా వరంగల్‌కు వచ్చారు. అలాగే భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న టి. రాజేశ్వర్ వరంగల్ బల్దియాకు డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. వీరు శుక్రవారం విధుల్లో చేరి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం కాశిబుగ్గ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉండడంతో బల్దియా అడ్మిన్‌గా పని చేస్తున్న ప్రసన్నరెడ్డిని నియమించే అవకాశాలు ఉన్నట్టు బల్దియా వర్గాలు చెప్పాయి.

ఊళ్లను కమ్మేస్తోంది!

- విషం చిమ్ముతున్న మడికొండ డంపింగ్ యార్డ్
- ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్న జనం
- ఇబ్బంది పడుతున్న పిల్లలు, వృద్ధులు
- శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు
- యార్డు ఎత్తేయాలని ఫిర్యాదులు
- బల్దియా, కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసనలు
- అయినా స్పందించని పాలకులు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండ శివారులోగల డంపింగ్ యార్డుతో జనం ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. డంపింగ్‌యార్డ్ నుంచి వచ్చే దుర్వాసన, విష పొగ వల్ల నిత్యం నరకం అనుభవిస్తున్నారు. మడికొండ, రాంపూర్, ఎలుకుర్తి, నర్సింగరావుపల్లి, కాజీపేట, బాపూజీనగర్, అయోధ్యపురం, ధర్మసాగర్, సోమిడి, పెద్దపెండ్యాల గ్రామాల ప్రజలు పొగతో ఊపిరాడక అవస్థలు పడుతున్నారు.

కలుషితమవుతున్న వడ్డెపల్లి చెరువు..

చెత్త నుంచి వెలువడే నీరు పిల్ల కాలువ ద్వారా పిల్లి వాగు, సోమిడి కాలువ గుండా వడ్డెపల్లి చెరువులో కలుస్తోంది. ఇక్కడి నుంచే హనుమకొండ, వరంగల్ ప్రజలకు తాగునీరు అందుతోంది. ఇటీవల నగరానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెత్త యార్డును తరలిస్తామని చెప్పి చేతులుదులుపుకున్నారు. పర్యావరణ వేత్తలు కూడా ఇక్కడి ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదు.

ప్రతీ రోజు 450 టన్నుల చెత్త తరలింపు..

నగరంలో ప్రతీ రోజు 450 టన్నుల చెత్త వెలువడుతోంది. 270 టన్నుల తడి చెత్త, 150 టన్నుల పొడి చెత్త, 15 టన్నుల పొడి చెత్త (హానికమైన చెత్త) 15 టన్నుల హజార్డర్ చెత్తను ఇండ్ల నుంచి సేకరించి మడికొండ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి వచ్చే పొగతో చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా శ్వాసకోశ వ్యాధులు, దగ్గు, దమ్ము, ఉబ్బసం, టీబీ, అస్తమాతో పాటు కండ్ల కలకలు, కంటి జబ్బుల బారిన పడుతున్నారు.

డంపిండ్ యార్డ్‌ను ఎత్తేయాల్సిందే..

డంపింగ్ యార్డ్‌ను తక్షణమే ఇక్కడి నుంచి తరలించాలని లేదంటే నిరసనలు, ధర్నాలు తప్పవని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మడికొండ డంపింగ్ యార్డ్ వద్ద స్థానిక కార్పొరేటర్‌తో పాటు ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. చెత్తను ఎప్పటికప్పుడు శుద్ధీ చేసి ఎరువుగా మార్చాల్సిన బయో మైనింగ్ కంపెనీ చాలా రోజులుగా పని చేయక పోవడాన్ని గుర్తించి బల్దియా అధికారులు తీరుపై మండిపడ్డారు.

3 సంవత్సరాలుగా నరకయాతన..

మడికొండ శివారులోని రాంపూర్‌లో సర్వే నెంబర్ 1791లో సుమారు 34 ఎకరాల్లో 2012లో అప్పటి మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ హయాంలో ప్రజల ఆమోదం మేరకు శిఖం భూములలో డంపిండ్ యార్డ్‌ను ఏర్పాటు చేశారు. భూ యజమానులకు 20 సంవత్సరాల ఒప్పందం మేరకు ఎకరానికి రూ. 4 లక్షలు చెల్లించారు. కానీ సమస్య పెద్దది కావడంతో భూములు ఇచ్చిన యజమానులు కూడా డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



మడికొండలో పొగతో కూడిన డంపింగ్ యార్డ్ ఇదే



డంపింగ్ యార్డ్ వద్ద నిరసన తెలుపుతున్న వివిధ గ్రామాల ప్రజలు

డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలి
- మునిగాల సరోజన, కార్పొరేటర్



మడికొండలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ వల్ల పిల్లలు, పెద్దలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో చాలా సార్లు కౌన్సిల్‌లో సమావేశంలో డంపింగ్ యార్డ్‌ను తరలించాలని విజ్ఞప్తి చేశాం. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు. సమస్య పరిష్కరించాలి

గ్రామాల్లో ఉండలేకపోతున్నాం..
- కరుణాకర్‌రెడ్డి, రాంపూర్



డంపిండ్ యార్డ్ నుంచి వచ్చే పొగ, దుర్వాసనతో ఉండలేకపోతున్నాం. చుట్టుపక్కల గ్రామాల్లో పంటలు కూడా సరిగా పండడంలేదు. వెంటనే ఇక్కడి నుంచి డంపింగ్ యార్డ్‌ను తొలగించకుండే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం.

త్వరలో హుజురాబాద్‌కు తరలించే అవకాశం ఉంది
- బొమ్మన రాజారెడ్డి, సీఎంహెచ్‌వో, బల్దియా

డంపింగ్ యార్డ్‌ను కొద్ది రోజులలో హుజురాబాద్‌కు తరలించే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు ప్రజలు ఓపిక పట్టాలి. హుజురాబాద్‌లో సుమారు 25 ఎకరాల్లో సాలిడ్ వేస్ట్ ప్లాంట్ ఏర్పాటు చేసి అక్కడికి తెలంగాణలోని 7 మున్సిపాలిటీల చెత్తను తరలిస్తారు. చెత్త ద్వారా అధునాతన పద్ధతిలో కరెంటు ఉత్పత్తి చేస్తారు.

పాలకేంద్రంలో నగదు చోరీ

కాజీపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : కాజీపేటలోని ఓ పాలకేంద్రంలో చోరీ జరిగింది. కాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట విష్ణుపురిలో గత 15 సంవత్సరాలుగా గుడిమల్ల చంద్రశేఖర్ పాలకేంద్రం పాల కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం చంద్రశేఖర్ పాలకేంద్రం సగం తెరిచి పాలు సరఫరా చేసేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి రూ. 30 వేలు చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి

మడికొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మడికొండ ఎస్‌హెచ్‌వో పుల్యాల కిషన్ అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ తరాలపల్లిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాజీపేట ఎంఈవో బి. మనోజ్‌కుమార్, జెడ్పీఎస్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ, మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుస్ నాయక్, డాక్టర్ రాథోడ్ జ్యోత్స్న, హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్, స్థానికులు పాల్గొన్నారు.

బల్దియాలో క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను యూనియన్ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు జన్ను ప్రకాశ్, సింగారపు బాబురావు ముఖ్య అతిథులు హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించి అక్కడి సిబ్బందికి పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం సీఐటీయూ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామన్నారు. నాయకులు సింగారపు క్రిష్ణ, బొజ్జ రాజు, రేపూడి ప్రశాంత్, సిలివేరు విష్ణు, కొమ్ము దాసు, విజయ్, శివ పాల్గొన్నారు.



బల్దియా కార్యాలయం ఎదుట క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

భూమి తగాదాలో వ్యక్తిపై దాడి
ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

మడికొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భూ తగాదాలో జరిగిన దాడిలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మడికొండ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట సోమిడికి చెందిన కాయిత జంపయ్య(55) గత సంవత్సరం డిసెంబరు, 28న మడికొండ రెవెన్యూ శివారులోని వ్యవసాయ భూమిలో పని చేసుకుంటున్నాడు. అదే సమయంలో జంపయ్యకు చెందిన భూవిలో కాయిత కుమార్ అలియాస్ సుక్కయ్య, మొరం పోస్తుండగా జంపయ్య అడ్డుకున్నాడు. దీంతో సుక్కయ్య ముళ్ళకంపతో జంపయ్యపై దాడి చేయడంతో అతడు గాయాలపాలయ్యాడు. జంపయ్య కుమారుడు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించి జంపయ్యను ఆస్పత్రికి పంపించారు. నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొంద తూ జంపయ్య మృతి చెందాడు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన జంపయ్య

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- విజేతలకు బహుమతులు అందజేత

వరంగల్ కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం రిపబ్లిక్ డే 'బల్దియా స్పోర్ట్స్ మీట్' విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బల్దియా పరిధిలోని కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు, మీడియా, అధికారులు, సిబ్బందికి క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారం, టాగ్ఆఫ్‌వార్, మ్యూజికల్ చైర్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇలాంటి క్రీడలు ఉద్యోగులకు, సిబ్బందికి మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయన్నారు. స్వతహాగా తాను కూడా ఒక క్రీడాకారిణిని అని తనకు కూడా క్రీడలంటే చాలా ఇష్టం అని అన్నారు. ప్రతీ మూడు మాసాలకు ఒక మారు క్రీడలు నిర్వహించేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. క్రికెట్ పోటీలలో విజేతలుగా నిలిచిన శానిటేషన్ జట్టు, రన్నరప్‌గా నిలిచిన టౌన్‌ప్లానింగ్ జట్లకు కమిషనర్ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, హెచ్‌వో రమేష్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

● గ్రీవెన్స్ సమస్యలు వెంటనే పరిష్కరించండి

టౌన్‌ప్లానింగ్ అధికారులు గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన పరిష్కరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్ర వారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మా ట్లాడారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన సమస్యల (ఫిర్యాదు)లతో పాటు రెగ్యులర్‌గా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఏప్రిల్ 2024 నుంచి ఇప్పటి వరకు డ్యాష్ బోర్డులో నమోదైన ఫిర్యాదుల పరిష్కారంపై చొరవ చూపాలన్నారు. గీవెన్స్ పోర్టల్‌లో సివిల్ ఫిర్యాదులకు సంబందించిన సమాచారాన్ని అప్డేట్ చేయాలన్నారు. పెండింగ్ గ్రీవెన్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రొఫార్మా తయారు చేయాలన్నారు. సివిల్ సంబంధిత సమస్యలు ఉంటే సిటీ ప్లానర్ క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. భూ సమస్యలు ఉంటే పరిష్కారం అయ్యే వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని అన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జీ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, డిప్యూటి కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రజిత, ఖలీల్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



క్రికెట్ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న కమిషనర్

పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న జడ్జి క్షమా దేశ్‌పాండే

హనుమకొండ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాలకు చట్టపరమైన సహాయం అందించే లక్ష్యంతో బాలలకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేశామని హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమా దేశ్‌పాండే తెలిపారు. శుక్రవారం జిల్లా బాలరక్షా భవన్‌లో జువైనల్ కోర్టు న్యాయమూర్తి ఎండి.ఫరిహా అహ్మద్‌తో కలిసి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించి మాట్లాడారు. సామాన్యులకు అండగా న్యాయసేవా సంస్థ పనిచేస్తుందని, పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జువేనైల్ బోర్డు సభ్యులు మేరుగు సుభాష్, డాక్టర్ గోపికారాణి, డీపీఓలు రమణమూర్తి, రాధారెడ్డి, ఏపీపీ రచిత, డీసీపీవో సౌరం ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాపిడో కెప్టెన్‌లకు అవగాహన కార్యక్రమం

న్యూశాయంపేట, జనవరి31(ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయంలో మెడికల్ ఎమర్జెన్సీల(సీపీఆర్)పై ర్యాపిడో కెప్టెన్‌లకు శుక్రవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో ర్యాపిడో కెప్టెన్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి రీజినల్ బిజినెస్ హెడ్ పగుడాల రవికుమార్, ఎమర్జెన్సీ విభాగం అధిపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ర్యాపిడో వారు వారి పని నిమిత్తం సాధ్యమైనంతవరకు ఎక్కువగా ప్రయాణాలు చేస్తారన్నారు. ఈ సీపీఆర్ సెషన్‌తో, వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో అవగాహన కల్పించి వారు ఇతరుకు సకాలంలో సహాయం అందించాలని కోరుకుంటు న్నామన్నారు. కార్యక్రమంలో ర్యాపిడో కెప్టెన్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పగుడాల రవికుమార్

ఎంజీఎం సూపరింటెండెంట్
డాక్టర్ కిశోర్‌కు సన్మానం

వరంగల్ మెడికల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎంజీఎం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిశోర్‌ను శాలువాతో వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంజీఎం హాస్పిటల్‌లో పేదలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కిశోర్‌ను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

వర్సిటీల్లో బోధన, బోధనేతర
పోస్టులను భర్తీ చేయాలి

కేయూ క్యాంపస్ జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా వర్సిటీల్లో బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డీవైఎఫ్ఐ జిల్లా సెక్రటరీ డి. తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో తిరుపతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2013 నుంచి వర్సిటీల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టలేదన్నారు. ఉద్యోగ వయస్సు దాటి నిరుద్యోగ యువత ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సు పెంచిన దృష్ట్యా ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు ఓ.చిరంజీవి, ఎస్.కరుణాకర్, సంతోష్, వర్ధన్, రాకేశ్, అనిల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ సెక్రటరీ తిరుపతి

జువైనల్ హోమ్‌లో వైద్య శిబిరం

వరంగల్ టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఆటోనగర్‌లోని జువైనల్ వెల్ఫేర్ కరెక్షన్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్స్ హోమ్‌లో డాక్టర్ యశస్విని ఆధ్వర్యంలోఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.యశస్విని మాట్లాడుతూ.. విద్యార్థులు రోజూ వేడి ఆహారం, గుడ్లు, పాలు తీసుకోవాలని సూచించారు. చందర్‌రావు, పాల్గొన్నారు.

కళాకారిణికి నంది అవార్డు

ఖిలావరంగల్, జనవరి 31: ప్రజా కళాకారిణి కుంట శాంతికి ప్రిన్సెస్ ఉమెన్స్ బ్యూటీ సొసైటీ మాషం స్టూడియో వారు నంది అవార్డు అందించారు. శుక్రవారం శివనగర్‌లోని కేపీఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ తాళ్ళ సునితరాజ్, వైస్ ప్రెసిడెంట్ ఊర్వశీ పటేల్ మాట్లాడుతూ.. వరకట్న దురాచారం, మద్యపాన నిషేధం, నిరక్షరాస్యత, బాల్యవివాహాలపై డప్పు కళాకారిణిగా ఆమె అనేక కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కాలికి గజ్జెకట్టి తన పాటలతో ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. ఆమె చేసిన కృషిని గుర్తించి నంది అవార్డు అందజేశామని అన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే బీసీలకు రాజ్యాధికారం

వడ్డెపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఐక్య ఉద్యమాలతోనే బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ కూరపాటి రమేష్ అన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, ఈనెల 2న హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి భారీ బహిరంగ సభకు బీసీలు రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలి రావాలని బీసీ ఆజాది సైకిల్ యాత్ర చేపట్టిన చాపర్తి కుమార్‌గాడ్గే, బత్తుల సిద్దేశ్వర్ల యాత్ర జనగామలో ప్రారంభమై శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్‌విగ్రహం వరకు చేరుకుంది. ఈ సైకిల్ యాత్ర నిర్వాహకులకు కూరపాటి రమేష్‌తోపాటు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొంగ వీరస్వామి, ఆల్‌ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్‌లు స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ రాజకీయ యుద్ధభేరి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ చంద మల్లయ్య, చిలువేరు శంకర్, దిడ్డి ధనలక్ష్మి, తాటికొండ సద్గుణ, కొంగ నరహరి, నవ్య, సతీష్, శోభారాణిగౌడ్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సైకిల్ యాత్ర అంబేద్కర్ విగ్రహం నుంచి వడ్డెపల్లి చర్చి మీదుగా బీసీ యుద్ధ భేరి సభ కరపత్రాలను పంపిణీ చేస్తూ భీమారం చేరుకుంది.

బీసీ యుద్ధభేరి సభకు సగరులు తరలిరావాలి..

బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి భారీ బహిరంగ సభకు జిల్లా సగర (ఉప్పర) సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నలుబాల సతీష్ సగర పిలుపునిచ్చారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సగర సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఎంజాల మల్లేశం, వడ్లకొండ కుమారస్వామి పాల్గొన్నారు.

● వడ్డెపల్లి : హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న మధ్యాహ్నం 2 గంటలకు బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు రావాలని ఆహ్వాన సంఘం కమిటీ కన్వీనర్లు మండల పరశురాములు, ధర్మపురి రాజగోవిందు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ శాసన మండలి ఉపసభాపతి డాక్టర్ బండా ప్రకాష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అలాగే మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, జోగు రామన్న, తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారిని, మాజీ ఎమ్మెల్యే ఎన్. రాజలింగం, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్‌లను వేర్వేరుగా హైదరాబాద్‌లో కలిసి సభకు రావాలని ఆహ్వాన పత్రాలను అందజేశారు.

● హనుమకొండ టౌన్ : సమాజంలో 90 శాతం మేరకు ఉన్న బడుగు, బలహీన మెజారిటీ వర్గాల ప్రజలు సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2 న నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభలోపాల్గొని విజయవంతం చేయాలని విశ్రాంత ప్రొఫె సర్ కూరపాటి వెంకటనారాయణ పిలుపు నిచ్చారు.శుక్రవారం బాలసముద్రంలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఆయనతో పాటు ప్రొఫెసర్ దినేష్‌కుమార్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, సీనియర్ అడ్వకేట్ గుడి మళ్ల రవి కుమార్, దారబోయిన సతీష్, కేయూ పరిశోధక విద్యార్థి అనిల్ పాల్గొన్నారు. ప్రొఫెసర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అనేక రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులుగా పనిచేసినా బీసీల స్థితిగతులు మారలేదన్నారు. ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ మండల్ కమిషన్ ద్వారా బీసీ కులాలకు సంక్రమించిన 27 శాతం రిజర్వేషన్లలో 9 శాతం కూడా అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ పార్టీలు ప్రాంతీయ పార్టీలు , వామపక్ష పార్టీలు అన్ని కూడా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని గుడిమళ్ల రవికుమార్ అన్నారు.

● రెడ్డికాలనీ : ఈ నెల 2వ తేదీన సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేశ్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం 4వ డివిజన్ రెడ్డికాలనీలో యుద్ధభేరి మహాసభకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ రాజకీయ యుద్ధభేరి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేశ్ తదితరులు

వెల్లుల్లిని వెలివేయవద్దు!

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

మన వంటల్లో వెల్లుల్లికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈ మధ్య కాలంలో వెల్లుల్లి లేని వంటిల్లు అరుదుగా కనిపిస్తుంది. ఇలాంటి వెల్లుల్లికి ఉన్న లక్షణాలను మన పూర్వీకులు ఎన్నడో గుర్తించారు. ఆయుర్వేద గ్రంథాల్లో కూడా దీనికి సముచిత స్థానం కల్పించారు.

మనకు తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు చేదు అని ఆరు రుచులున్నాయి. వెల్లుల్లిలో ఒక్క పులుపు తప్ప మిగిలిన రుచులన్నీ ఉంటాయి. ఒక రుచి లేనిది కాబట్టి దీన్ని 'రసోన' అని పిలిచేవారు. అదే 'లశునం' అయింది. ఇక వెల్లుల్లి పొరలు తెల్లగా ఉంటాయి. నీరుల్లిపాయలకు ఎర్ర పొరలు ఉంటాయి. వెల్లుల్లి కూడా చూడటానికి తెల్ల ఉల్లి పాయ మాదిరిగానే ఉంటుంది. అందుకే వెల్ల + ఉల్లి అనే పదాలను కలిపి 'వెల్లుల్లి' అని పిలవటం మొదలుపెట్టారు. ఇక్కడ ఇంకో ఆసక్తికరమైన విషయాన్ని కూడా చెప్పుకోవాలి. వెల్లుల్లిని 'భోజన కుతూహలం' రసాయనం



అని పేర్కొంది. వైద్య శాస్త్ర ప్రకారం- మన శరీరంలో రస, రక్తాది ఏడు ధాతువులుంటాయి. ఈ ఏడు ధాతువులను పెంపు చేసే ద్రవ్యాలను రసాయనాలు అంటారు. వెల్లుల్లి కూడా అలాంటి రసాయనం. అందుకే ఇది ధాతుపుష్టిని ఇస్తుంది. వయోభారం మీద పడకుండా, ముసలితనం ముంచుకు రాకుండా కాపాడుతుంది. శరీరానికి కావలసిన వేడిని సమకూరుస్తుంది. శరీరంలో దోషాలను తొలగిస్తుంది. గుండెకు టానిక్‌లా ఉపయోగపడుతుంది. జీర్ణశక్తిని శస్తుంది. కంటి చూపును పెంచుతుంది. దగ్గు, ఆయాసాల్ని పోగొడుతుంది. నీరుపట్టటాన్ని తగ్గిస్తుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్నాయి కాబట్టే ఆయుర్వేద వైద్యులు దీనిని తినమని సలహా ఇస్తూ ఉంటారు. అయితే ఇక్కడ ఇంకో మాట కూడా చెప్పుకోవాలి. ఇన్ని రకాల ప్రయోజనాలు ఉన్నాయి కదా అని ఈ వెల్లుల్లిని అతిగా తినకూడదు. ప్రతి రోజు ఒక వ్యక్తి నాలుగైదు గ్రాముల కన్నా ఎక్కువ తినకూడదు. ఇది శక్తిమంతమైన ఔషధం కాబట్టి కొద్దిగా తిన్నా ఎక్కువ కాలం దీని ప్రభావం ఉంటుంది. వేడి శరీరతత్వం ఉన్నవారు వెల్లుల్లిని ఎక్కువగా తినకూడదు. రక్తస్రావం అవుతున్నవారు.. రక్త స్రావాన్ని ఆపే మందులను వాడేవారు, మొలల వ్యాధితో బాధపడుతున్నవారు దీనిని తినకూడదు. వాత వ్యాధులతో బాధపడేవారు, స్థూలకాయ సమస్య ఉన్నవారు వెల్లుల్లిని పరిమిత మోతాదుల్లో తీసుకోవాలి. వెల్లుల్లిని అన్నంలో తినటం ఇష్టం లేని వారు ఒకటి రెండు వెల్లుల్లి రెబ్బలను నోట్లో వేసుకొని క్యాప్సూల్స్‌ను మింగినట్లు మింగాలి.

వెల్లుల్లిని యూరోపియన్లు ఎక్కువగా ఇష్టపడేవారు. అందుకే దీనికి 'యవనేష్టం' అనే పేరు వచ్చింది. 'ఆయుర్వేద ప్రకాశ' అనే గ్రంథంలో వెల్లుల్లి వల్ల కలిగే లాభాలను ప్రస్తావించారు. "ఏకేన లశునేనాపి శుద్ధో భవతి పారదః" అని ఈ గ్రంథం పేర్కొంది. అంటే - పాదరసం లాంటి ఖనిజాలను కూడా బయటకు పంపటానికి వెల్లుల్లి తోడ్పడుతుందని అర్థం.

- గంగరాజు అరుణాదేవి

ఇలా చేస్తే పురుగు పట్టదు!


మనం ఇళ్లలో బియ్యం, పప్పులు తదితరాలను నిల్వ చేసుకుంటూ ఉంటాం. కొంతకాలం తరవాత వీటిలో పురుగులు చేరి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. పురుగు పట్టకుండా ఉండాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం!

- బియ్యంతోపాటు అన్ని రకాల పప్పుల్లో ఎక్కువగా ఎర్రని ముక్క పురుగులు పడుతుంటాయి. వీటిని నివారించడానికి బియ్యం, పప్పుల డబ్బాల్లో నాలుగు లవంగాలు వేసి ఉంచాలి. లవంగాల ఘాటుకి పురుగులు చేరవు.
- బియ్యానికి, రవ్వలకూ తెల్లని పొడవాటి పురుగులు పడుతుంటాయి. ఆ డబ్బాల్లో బిరియానీ ఆకులు లేదా మిరియాలు వేసి ఉంచితే వాటి వాసనకు పురుగులు చనిపోతాయి.
- ధాన్యం బస్తాల్లో కొన్ని ఎండు మిరపకాయలు కలిపితే ఎటువంటి పురుగులూ చేరవు.
- వేరుశనగ గుండ్లు, కంది పప్పు, పెసర పప్పు, మినప గుండ్లు నిల్వ చేసిన డబ్బాల్లో రెండు ఎండిన పసుపు కొమ్ము ముక్కలు వేసి ఉంచితే పురుగు పట్టదు.
- కారం డబ్బాల్లో ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలు వేస్తే పురుగు రాదు



- గోధుమల డబ్బాలో గుప్పెడు ఎండిన వేపాకులు వేసి ఉంచితే మంచి ప్రయోజనం ఉంటుంది.
- పుట్నాలు, శనగలు, పెసలు, బఠానీల డబ్బాల్లో రెండు చెంచాల కల్లుప్పు కలిపితే వాటికి ఎటువంటి పురుగులూ పట్టవు.
- మిరియాలను కచ్చా పచ్చాగా నలగగొట్టి, ఒక చిన్న గుడ్డలో మూట కట్టి వంట గదిలోని అరల్లో ఉంచితే పురుగులు దరి చేరవు.
- ఒకటి లేదా రెండు అగ్గిపెట్టెలను మూత తీసి వంట గది అరల్లో మూలగా పెట్టినా ఫలితం కనిపిస్తుంది. అగ్గిపుల్లలకు ఉండే మందులో సల్ఫర్ ఉంటుంది. దీని ఘాటుకు పురుగులు చనిపోతాయి.
- బియ్యం, పప్పులు, పిండి, రవ్వ... ఇలా అన్నిటినీ గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ చేసుకుంటే పురుగుల సమస్య రాదు.

వంటిల్లు



స్పైసీగా ఉండే వంటకాలను ఇష్టపడేవారికి చిల్లీ వెరైటీలు మంచి ఆప్షన్. స్నాక్స్ నుంచి కూరల వరకూ వీటిలో ఎన్నో రకాలున్నాయి. వాటిలో కొన్ని మీకోసం...

చిల్లీతో... రుచి రుచిగా

భర్వాన్ మిర్చి స్టఫ్డ్ చిల్లీ

కావాల్సిన పదార్థాలు: పెద్ద సైజులో ఉన్న పచ్చి మిరపకాయలు- 8, శనగపిండి- ఒక కప్పు, కొబ్బరి కోరు- రెండు చెంచాలు, పసుపు- చిటికెడు, ధనియాల పొడి- ఒక చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, వెల్లుల్లి ముక్కలు- ఒక చెంచా, అల్లం ముక్కలు- ఒక చెంచా, టమోటా పేస్ట్- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, పంచదార- అర చెంచా, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని


జాగ్రత్తలు
- ఎక్కువ కారం లేకుండా ఉన్న పెద్ద మిరపకాయలు మార్కెట్లో లభ్యమవుతాయి. ఈ కూర వాటితో చేస్తే బావుంటుంది.
- ధనియాల పొడి, జీలకర్ర పొడి రుచికి తగిన విధంగా కలుపుకోవాలి.



తయారీ విధానం: ఒక గిన్నెలో ధనియాల పొడి, శనగపిండి వేసి ముద్దగా చేయాలి.
- పచ్చి మిరపకాయలను మధ్యలోకి చీల్చాలి. దానిలో ఉన్న గింజలన్నీ తీసివేయాలి. దీని మధ్యలో శనగపిండి ముద్దను కూరాలి.
- ఒక మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. దానిలో పచ్చి మిరపకాయలను వేయించాలి. వాటిని పక్కన పెట్టుకోవాలి.
- మిగిలిన నూనెలో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి ముక్కలు వేసి వేయించాలి. ఇవి దోరగా వేగిన తర్వాత వాటిలో పసుపు, జీలకర్ర పొడి, టమోటా పేస్ట్ వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలు ఉడికించాలి. ఆ తర్వాత ఉప్పు, పంచదార వేయాలి.
- ఈ మిశ్రమంలో కొద్దిగా నీళ్లు పోయాలి. కొద్దిగా చిక్కపడిన తర్వాత దానిలో వేయించిన పచ్చి మిరపకాయలను వేయాలి.

చిల్లీ చికెన్ సూప్

కావాల్సిన పదార్థాలు: చికెన్ ముక్కలు- రెండు కప్పులు, ఉల్లిపాయ ముక్కలు- రెండు కప్పులు, టమోటా ముక్కలు- ఒక కప్పు, మొక్కజొన్న గింజలు- పావు కప్పు, వెల్లుల్లి ముక్కలు- ఒక చెంచా, పచ్చి మిర్చి ముక్కలు- రెండు చెంచాలు, జీలకర్ర పొడి- ఒక చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచాలు, కారం- ఒక చెంచా, దాల్చిన చెక్క పొడి- అర చెంచా, మిరియాల పొడి- అర చెంచా, నెయ్యి- పావు కప్పు, నిమ్మరసం- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని.



తయారీ విధానం: ఒక మూకుడులో నెయ్యి వేసి వేడి చేయాలి. దానిలో చికెన్ ముక్కలు వేసి దోరగా వేయించాలి. చికెన్ ముక్కలను ఒక ప్లేటులోకి తీసుకొని చల్లార్చాలి.
- మిగిలిన నేతిలో ఉల్లిపాయ ముక్కలను వేయించాలి. అవి వేగిన తర్వాత వెల్లుల్లి, పచ్చి మిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఆ తర్వాత జీలకర్రపొడి, ధనియాల పొడి, కారం, దాల్చిన చెక్క పొడి, మిరియాల పొడి వేసి వేయించాలి.
- ఈ మిశ్రమంలో కొద్దిగా నీళ్లు పోయాలి. ఆ తర్వాత టమోటా ముక్కలు వేసి, మూత పెట్టాలి.
- టమోటా ముక్కలు బాగా ఉడికిన తరువాత, ఆ మిశ్రమంలోదానిలో మొక్కజొన్న గింజలు వేసి ఉడికించాలి. ఆ తర్వాత చికెన్ ముక్కలు వేయాలి. బాగా ఉడికిన తర్వాత నిమ్మరసం వేయాలి.

జాగ్రత్తలు
- కారం ఎక్కువగా కావాలనుకొనేవారు ఎక్కువ పచ్చి మిర్చి ముక్కలు వేయాలి.
- సూప్ చిక్కగా కావాలనుకొనేవారు ఎక్కువ టమోటా ముక్కలు వేయాలి.
- మొక్కజొన్న గింజలతో పాటు ఇతర కూరగాయలను కూడా ఈ సూప్‌లో వేసుకోవచ్చు.

చిల్లీ పనీర్

కావాల్సిన పదార్థాలు: పనీర్ ముక్కలు- రెండు వందల గ్రాములు, కార్న్ ఫ్లోర్- మూడు చెంచాలు, మైదా- మూడు చెంచాలు, ఎర్ర కారం- రెండు చెంచాలు, మిరియాల పొడి- ఒక చెంచా, నూనె- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, క్యాప్సికం ముక్కలు- అరకప్పు, వెల్లుల్లి ముక్కలు- ఒక చెంచా, వెనిగర్- ఒక చెంచా, చిల్లీ సాస్- ఒక చెంచా, టమోటా సాస్- రెండు చెంచాలు, ఎండు మిరప పేస్ట్- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం: ఒక గిన్నెలో కార్న్ ఫ్లోర్, మైదా, ఉప్పు, ఎర్రకారం, చెంచా మిరియాల పొడి వేయాలి. దీనిలో కొద్దిగా నీళ్లు పోసి మృదువుగా కలపాలి.

జాగ్రత్తలు
- కార్న్‌ఫ్లోర్ మిశ్రమం పలచగా ఉంటే పనీర్ ముక్కలు ఎక్కువ నూనె పీలుస్తాయి. రుచి బావుండదు.
- కొందరు ఉల్లికాడలను చిన్న ముక్కలుగా చేసి కూరపై చల్లుతారు.
- ఎక్కువ కారం ఉండకూదనుకుంటే ఎండు మిరప పేస్ట్ వేయకూడదు.

- ఈ మిశ్రమంలో పనీర్ ముక్కలను వేయాలి. పనీర్ ముక్కలకు అన్ని వైపులా ఈ మిశ్రమం అంటాలి. మిగిలిన మిశ్రమాన్ని గిన్నెలోనే ఉంచాలి.
- ఒక మూకుడులో పావు కప్పు నూనె తీసుకొని వేడి చేయాలి. దానిలో ఈ పనీర్ ముక్కలను దోరగా వేయించాలి. వాటిని బయటకు తీసి చల్లార్చాలి.
- ఆ మూకుడులోనే మరో కప్పు నూనె పోసి వెలుల్లి, ఉల్లిపాయ, క్యాప్సికం ముక్కలు వేసి వేయించాలి. ఆ తర్వాత దానిలో చిల్లీ సాస్, టమోటా సాస్, వెనిగర్, ఎండు మిరప పేస్ట్ వేసి వేయించాలి. ఆ తర్వాత మిగిలిన కార్న్ ఫ్లోర్ మిశ్రమాన్ని వేసి ఉడికించాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసుకోవాలి. ఈ ముక్కలు బాగా ఉడికిన తర్వాత మిశ్రమంలో తగినంత ఉప్పు వేసుకోవాలి.
- ఈ మిశ్రమంలో చివరగా వేయించిన పనీర్ ముక్కలను వేయాలి.

అప్పట్లో మహిళలకు ఆ అధికారం... మన దేశంలోనే ఉండేది!

భారత ఉపఖండ చరిత్రలో 18వ శతాబ్దానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మొఘల్ సామ్రాజ్యం క్షీణించటంతో అనేక మంది రాజులు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. అదే సమయంలో మన దేశంలో బ్రిటిష్ వారి ప్రాబల్యం పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో- అవధ్ రాజ్యం కళలకు కేంద్రబిందువు అయింది. ఆ రోజుల్లోని పరిస్థితుల గురించి, నాటి రాజకీయాలలో మహిళల పాత్ర గురించి ప్రముఖ చరిత్రకారిణి, నవలా రచయిత ఐరా ముఖోటి - 'ది లయన్ అండ్ లిల్లీ- ద రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ అవధ్' అనే పుస్తకం రాశారు. 'జైపూర్ లిటరరీ ఫెస్టివల్' (జేఎల్ఎఫ్)లో పాల్గొంటున్న ఐరాను 'నవ్య' పలకరించింది.

18వ శతాబ్దంలో అనేక రాజ్యాలు ఉండగా... మీరు అవధ్ చరిత్రను ఎంపిక చేసుకోవటం వెనుక ఉన్న కారణం ఏమిటి?

ఆ శతాబ్దంలో... భారత ఉపఖండంలో అవధ్‌కు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. మొఘల్ సామ్రాజ్య పతనం తర్వాత అవధ్ కళలకు ఒక ముఖ్యమైన కేంద్రంగా మారింది. అంతేకాకుండా - ఆ రాజ్య పరిపాలనను రాణులు ప్రభావితం చేశారు. కొన్ని లక్షల మంది కళాకారులు అవధ్ రాజ్యంలో ఉండేవారు. దీనిపై చరిత్రకారులు ఇప్పటివరకూ పెద్దగా దృష్టి సారించలేదు. అలాగే... అవధ్‌పై ఆధిపత్యం కోసం బ్రిటిష్ వారికి ఫ్రెంచ్ వారికి మధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధాలు చాలా కీలకమైనవి. వీటి ప్రభావం మన దేశ రాజకీయాలపైనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఉంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకొని అవధ్ గురించి ఈ పుస్తకం రాశాను.

'ఆనాటి మన దేశంలోని రాజ్యాల మీద ఫ్రెంచ్ పాలకుల ప్రభావం' అనే అంశంపై మీకు ఎందుకు ఆసక్తి కలిగింది?

మన దేశ చరిత్రను విదేశీయులు తమ కోణం నుంచి నమోదు చేస్తూ వచ్చారు. ఇప్పుడు మనం వెనక్కి తిరిగి చూస్తే- 17, 18, 19 శతాబ్దాల చరిత్ర ఎక్కువగా బ్రిటిష్ వారి కోణం నుంచే కనిపిస్తుంది. కానీ ఆ సమయంలో మన దేశంలో ఆధిపత్యం సంపాదించటానికి బ్రిటిష్ వారితో పాటు ఫ్రెంచ్ వారు కూడా పోటీ పడ్డారు. అయితే దీని గురించి ఇప్పటి వరకూ ఎవరూ ఎక్కువగా మాట్లాడలేదు. ఆ కోణం నుంచి చూస్తే ఎలా ఉంటుందనే ఉద్దేశంతో... ఆనాటి రికార్డులను, పత్రాలను పరిశీలించటం ప్రారంభించాను. ఈ పుస్తకానికి అవే ఆధారం.

మొఘల్ కాలంలో రాజ్యాలను పాలించిన రాణులు తక్కువ మంది కనబడతారు. ఆ సమయంలో రాజ్యపాలనలో మహిళలు ఎలాంటి పాత్ర పోషించేవారు?

అవధ్ చరిత్రను తిరగేస్తే మనకు అనేక ఆసక్తికరమైన అంశాలు కనబడతాయి. మొఘల్ పరిపాలనా సమయంలో మహిళలు సాంస్కృతిక అంశాలలోనే ముఖ్య పాత్ర పోషిస్తూ ఉండేవారు. కుటుంబ వ్యవహారాల్లో కానీ, రాజకీయ వ్యవహారాల్లో కానీ వారి పాత్ర తక్కువగా ఉండేది. నూర్జహాన్ లాంటి చాలా కొద్దిమంది రాణులను మనం చూడవచ్చు. కానీ అవధ్ రాజ్యంలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉండేవి. మహిళలు రాజకీయాంశాలలో కూడా చురుకైన పాత్ర పోషించేవారు. ఇతర రాజకుటుంబాల వారితో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేవారు. పెళ్లిళ్లు కుదిర్చేవారు. విధాన నిర్ణయాలను తీసుకోవటంలో కూడా ముఖ్య పాత్ర పోషించేవారు. అవధ్ రాజు సాదర్‌జంగ్ భార్య నవాబ్ బేగం కావచ్చు, ఆమె కోడలు బహూ బేగం కావచ్చు... రాజ్య వ్యవహారాలలో చురుకుగా ఉండేవారు. తమ భర్తలు యుద్ధాలకు వెళ్లినప్పుడు వారి తరఫున రాజ్యానికి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొనేవారు. ఇక్కడ బహూ బేగం గురించి చెప్పుకోవాలి. ఒక రాణిగా ఆమె అనేక ప్రాంతాలను స్వయంగా పరిపాలించేది. ఈ విషయంలో ఆమెకు, అప్పటి గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్‌కు మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. అయినా ఆమె తగ్గలేదు. ఇక... అవధ్‌లో కొన్ని వేలమంది కళాకారులు పనిచేస్తూ ఉండేవారు. నర్తకీమణులు, గాయనీమణులు, చిత్రలేఖకులు, చేనేత పనివారు- ఇలా ఎంతో మందికి ఉపాధి లభించేది. ఈ కోణం నుంచి చూస్తే మహిళలకు అవధ్‌లో సముచిత స్థానమే ఉంది.

మన దేశ చరిత్రను జాగ్రత్తగా గమనిస్తే- విదేశీ పాలకులలో మహిళలు ఎవరు కనిపించరు. ఒక మహిళా చరిత్రకారిణిగా దీనిపై మీ అభిప్రాయమేమిటి?

- ఇది చాలా ఆసక్తికరమైన అంశం. ఆ రోజుల్లో బ్రిటన్‌లో కానీ, ఫ్రాన్స్‌లో కానీ, పోర్చుగల్‌లో కానీ పురుషా



ధిక్య సమాజాలే ఉండేవి. అక్కడి మహిళలకు మన దేశంలోని మహిళలకు ఉన్నంత స్వేచ్ఛ కూడా ఉండేది కాదు. వారి సమాజాలలో మహిళలు పెళ్లికాక ముందు తండ్రి ఆధీనంలో ఉండేవారు. పెళ్లిఅయిన తర్వాత భర్త ఆధీనంలో ఉండేవారు. అతి తక్కువమంది మహిళలు చదువుకొనేవారు. అందువల్ల మనకు ఆ సమాజాల్లో అధికార హోదాల్లో మహిళలు కనిపించరు. ఇక్కడో ఆసక్తికరమైన విషయం చెప్పాలి. పెళ్లి సమయంలో పుట్టింటివారు తమ ఆడ పిల్లలకు ఆస్తులు ఇవ్వటం పరిపాటి. బ్రిటిష్ చట్టాల ప్రకారం పెళ్లి సమయంలో పుట్టింటివారు ఇచ్చిన ఆస్తులపై ఆడపిల్లలకు ఎటువంటి అధికారం ఉండేది కాదు. పెళ్లి అయిన వెంటనే ఆ ఆస్తులపై అధికారం భర్తలకు బదలాయింపు జరిగేది. ఇదే సమయంలో మన దేశంలో పుట్టింటి వారు ఇచ్చిన ఆస్తులపై అధికారం మహిళలకే ఉండేది. నూర్జహాన్, ముంతాజ్ బేగం లాంటివారు కూడా తమ పుట్టింటి వారు ఇచ్చిన ఆస్తుల మీద అధికారాన్ని చెలాయించేవారు. ఈ పద్ధతిని చూసి బ్రిటిష్‌వారు ఒక విధంగా దిగ్భ్రాంతికి గురయ్యారని చెప్పవచ్చు.

కొన్నిసార్లు చరిత్ర ఉన్నత వర్గాలకు చెందిన మహిళల గురించి మాత్రమే చెబుతుంది. సామాన్య ప్రజల గురించి చెప్పదు. మీ పరిశోధనలో సామాన్య మహిళలు ఎలా జీవించారో గుర్తించారా?

దురదృష్టమేమిటంటే- ఒకప్పుడు చరిత్రలో ముఖ్యమైన అంశాలను మాత్రమే నమోదు చేసేవారు. దీని వల్ల సామాన్యులకు సంబంధించిన వివరాలు ఎక్కువగా లభించవు. సామాన్య ప్రజలు, మహిళలు ఎలా జీవించేవారో, వారి జీవన ప్రమాణాలు ఎలా ఉండేవో మనకు తెలియదు. అయితే పరోక్షంగా కొన్ని విషయాలు తెలుసుకోగలుగుతాం. 18వ శతాబ్దంలో- బెంగాల్, బీహార్ మాదిరిగానే అవధ్ కూడా చాలా ధనిక ప్రాంతం. నవాబులు, బేగంల దగ్గర ఆర్థిక వనరులు విపరీతంగా ఉండేవి. వారు ఈ వనరులను కళల కోసం, ఇతర సామాజిక ప్రయోజనాల కోసం ఖర్చు పెట్టేవారు. అవధ్ రాజధానిలో చేనేత కార్మికులకు, నేత పనివారికి ప్రత్యేకమైన ప్రాంతం ఉండేది. ఇక్కడ పనిచేసేవారిలో ఎక్కువ మంది మహిళలే ఉండేవారు. వీరందరికీ వేతనాలు లభించేవి. వారు ఆ వేతనాలను తమ కుటుంబాలకోసం ఖర్చు పెట్టేవారు. ఈ కోణం నుంచి చూస్తే అవధ్‌లో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఎక్కువ ఉండనే చెప్పవచ్చు.

- సివిఎల్‌ఎన్ ప్రసాద్

మేకప్

కొత్తగా, మరింత అందంగా...

కాలంతో పాటు మేకప్ పోకడలూ మారి పోతూ ఉంటాయి. అలాంటి కొన్ని కొత్త మేకప్ పోకడలు, మెలకువల గురించి తెలుసుకుందాం!



సన్నని కనుబొమలు

90లలో విపరీతంగా ప్రజాదరణ పొందిన గీత గీసినట్టుండే కనుబొమల పోకడ మళ్లీ మేకప్‌లో ప్రధాన స్థానాన్ని ఆక్రమించింది. అయితే ఏ ముఖాకృతికి ఎలాంటి కనుబొమలు నప్పుతాయో తెలియాలంటే, మేకప్ నిపుణులను సంప్రతించాలి. వారి సహాయంతో కనుబొమలను విల్లులా తీర్చిదిద్దుకుని నలుగురినీ ఆకట్టుకోవచ్చు. అలాగే కనుబొమలను దిద్దుకోవడం కోసం నలుపు రంగుకు బదులుగా ముదురు గోధుడ రంగు ఇబ్రో పెన్సిల్ ఎంచుకోవాలి.

ఐషాడో ఇలా...

నీలి రంగు ఐషాడో ప్రస్తుత మేకప్ ట్రెండ్. డ్రెస్ రంగుకు నప్పేలా అదే రంగు ఐషాడో ఎంచుకునే రోజులు పోయాయి. ప్రత్యేకంగా కనిపించేలా చేసే 'పేల్ బ్లూ పెర్ల్', 'స్మోకీ నేవీ' రంగులు వాడుకలోకి వచ్చాయి. వీటిలో దేన్ని ఎంచుకున్నా, కనురెప్పలు ఎబ్బెట్టుగా కనిపించకుండా... ఐలైనర్‌లో కలిసిపోయేలా ఐషాడోను పూసుకోవాలి. కనురెప్పలను కిందికి దించినా, పైకి లేపినా కంటి అందం చెక్కుచెదరకుండా ఉండేలా చూసుకోవాలి.



లిప్ లైనర్‌తో...

పెదవులకు లిప్‌స్టిక్ పులిమేసుకునే రోజులు పోయి, లైనర్ మీద దృష్టిని పెంచే రోజులు ఇచ్చాయి. లైనర్‌తో పెదవులను అంచులను తీర్చిదిద్ది, పలుచగా లిప్‌స్టిక్ అద్దుకోవడమే తాజా పోకడ. అయితే ఎంచుకునే లిప్ లైనర్ వీలైనంత ముదురు రంగులో ఉండేలా చూసుకోవాలి. పెదవుల అంచుల దగ్గరి నుంచి మొదలుపెట్టి, మధ్య వరకూ లైనర్ గీసుకుని, లేత గులాబీ, పీచ్ రంగు లిప్‌స్టిక్స్ పెదవులకు పలుచగా అద్దుకోవాలి.

పిల్లలు హాయిగా పడుకోవాలంటే...

కొంతమంది చిన్న పిల్లలు రాత్రి సమయంలో నిద్రపోకుండా ఏడుస్తూ ఉంటారు. పెద్ద పిల్లలు కూడా అర్ధరాత్రి వరకూ పడుకోరు. దీనివల్ల తల్లిదండ్రులు ఇబ్బంది పడుతూ ఉంటారు. పిల్లలు హాయిగా నిద్రపోవడానికి నిపుణులు చెబుతున్న చిట్కాలు...

- పిల్లలు సరిగ్గా నిద్రపోవాలంటే వారికి నిద్ర వేళలు అలవాటు చేయాలి. అంటే రోజుకొక సమయం కాకుండా ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపుచ్చాలి. క్రమం తప్పకుండా ఇలా కొద్ది రోజులు అలవాటు చేస్తే అదే వేళకు పిల్లలు నిద్రపోతారు.
- మూడు సంవత్సరాలలోపు వయసున్న పిల్లలను మాత్రమే పగటిపూట పడుకోబెట్టాలి. అంతకన్నా పెద్దవయసున్న పిల్లలను మధ్యాహ్నం పడుక్కోనివ్వకూడదు. ఒకవేళ పడుక్కున్నా అరగంట తరవాత వారిని నిద్రలేపాలి. పగటిపూట పడుకున్న పిల్లలు రాత్రి వేళ నిద్రపోరు.
- పడుకొనేముందు పిల్లలు హాయిగా ఆడుకునేలా చూడాలి. వాళ్ల మనసులో ఎటువంటి భయం, ఆందోళన కలుగకుండా చూసుకోవాలి. పసి పిల్లలకు మంచి పాట వినిపిస్తూ నిద్రపుచ్చాలి. కొంచెం పెద్ద పిల్లలకైతే కథలు చెబుతూ, సరదాగా మాట్లాడుతూ పడుకోబెట్టాలి. దీనివల్ల పిల్లల మనసు ప్రశాంతంగా మారి త్వరగా, ఎక్కువసేపు పడుకుంటారు.
- కొంతమంది పిల్లలు చీకటికి, మరికొంత మంది ఒంటరిగా పడుకోవడానికి భయపడుతుంటారు. పిల్లలు నిద్రించే గదిలో చిన్న బల్బు వేసి ఉంచాలి. పడుకునేముందు భయానకమైన సినిమాలు చూడనివ్వకూడదు. త్వరగా పడుకోవాలని బెదిరించకూడదు. పిల్లలు నిద్రకు ఉపక్రమించే ముందు తల్లిదండ్రులు వారితో కొంత సమయం గడిపితే ధైర్యంగా ఉంటారు.
- పిల్లలు నిద్రించే సమయంలో టీవీ పెట్టకూడదు. తల్లిదండ్రులు ఫోన్‌లో మాట్లాడుతున్నా కూడా పిల్లలు పడుకోరు. ఇంట్లో నిశ్శబ్దంగా ఉండేలా చూసుకోవాలి.
- రాత్రి పూట వీలైనంత త్వరగా పిల్లలకు భోజనం పెట్టాలి. లేదంటే జీర్ణ సమస్యలు ఏర్పడి పిల్లలు త్వరగా నిద్రపోరు.



శ్రీకాంత్ అవుట్

బ్యాంకాక్: ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న కిడాంబి శ్రీకాంత్‌కు నిరాశే ఎదురైంది. థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ క్వార్టర్‌ఫైనల్లో శ్రీకాంత్ 17-21, 16-21తో జెంగ్ గ్జింగ్ వాంగ్ (చైనా)చేతిలో ఓటమిపాలయ్యాడు. మరో భారత సింగిల్స్ ఆటగాడు శంకర్ ముత్తుస్వామి 21-19, 18-21, 13-21తో గ్జువాన్ చెన్ జు (చైనా) చేతిలో ఓడాడు. ఇక, మహిళల సింగిల్స్‌లో రక్షిత రామరాజు, డబుల్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి-సాయి ప్రతీక్ వెనుదిరిగారు. దీంతో టోర్నీలో భారత్ పోరు పూర్తిగా ముగిసింది.

ఫైనల్లో మనమ్మాయిలు

సెమీఫైనల్లో ఇంగ్లండ్ చిత్తు
దక్షిణాఫ్రికాతో తుదిపోరు రేపు
అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్



కౌలాలంపూర్ : అండర్-19 టీ20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల నుంచి మరో ఆల్‌రౌండ్ ప్రదర్శన. తొలుత స్పిన్నర్లు ప్రత్యర్థిని తిప్పేయగా, స్వల్ప లక్ష్యాన్ని భారత్ సునాయాసంగా ఛేదించింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తొమ్మిది వికెట్లతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి మెగా టోర్నీ ఫైనల్‌కు చేరింది. ఆదివారం జరిగే తుది పోరులో దక్షిణాఫ్రికాను ఎదుర్కొంటుంది. భారత బౌలర్లు పరునిక సిసోడియా (3/21), వైష్ణవీ శర్మ (3/23), ఆయుషీ శుక్లా (2/21) స్పిన్‌కు విలవిలలాడిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 113/8 స్కోరుకే పరిమితమైంది. పెరిన్ (45), నోర్‌గ్రోవ్ (30) మాత్రమే రాణించారు. ఇక..ఓపెనర్లు కమలిని (50 బంతుల్లో 8 ఫోర్లతో 56 నాటౌట్), త్రిష (29 బంతుల్లో 5 ఫోర్లతో 35) మెరవడంతో ఛేదనను భారత్ 15 ఓవర్లలో 117/1 స్కోరుతో పూర్తి చేసి విజయం అందుకుంది. సిసోడియా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

కమిలిని, త్రిష దూకుడు: ఓపెనర్లు కమిలిని, త్రిష దనాదన్ బ్యాటింగ్‌తో ఛేదనను భారత్ ధాటిగా అరంభించింది. దాంతో పవర్ ప్లేలో 44/0తో నిలిచింది. తెలుగు బ్యాటర్ త్రిష మైదానానికి ఇరువైపులా షాట్లతో అలరించింది. ఈ జోడీయే మ్యాచ్‌ను ముగిస్తుందనుకున్న దశలో..త్రిషను స్పిన్నర్ బ్రైట్ బౌల్డ్ చేసింది. దాంతో 60 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ వెంటనే కమలిని కూడా అవుటయ్యేదే. ఆమె కొట్టిన షాట్‌ను ఇంగ్లండ్ కెప్టెన్ అబిగేల్ కవర్స్‌లో పట్టేసింది. కానీ డైవింగ్ చేసి అందుకొనే క్రమంలో ఆమె చేయి నేలను తాకింది. దాంతో మూడో అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో కమలిని ఊపిరి పీల్చుకుంది. అనంతరం సనిక (11 నాటౌట్) జతగా కమిలినీ రెండో వికెట్‌కు అభేద్యంగా 57 పరుగులు జత చేసి జట్టును విజయ తీరాలకు చేర్చింది.

దక్షిణాఫ్రికా తొలిసారి

తొలి సెమీస్‌లో ఆసీస్‌పై నెగ్గిన సఫారీలు తొలిసారి టైటిల్ ఫైట్‌కు చేరారు. మొదట ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 105/8 స్కోరు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా 18.1 ఓవర్లలో 106/5 స్కోరు చేసి నెగ్గింది.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 113/8 (పెరిన్ 45, పరునిక 3/21, వైష్ణవి 3/23); **భారత్: 15 ఓవర్లలో 117/1** (కమలిని 56 నాటౌట్, త్రిష 35).

అదిరే ఆటతో..

సిరీస్ వశం

భారత్ ఆల్‌రౌండ్‌షో
నాలుగో టీ20లో విజయం
హార్దిక్, దూబే హాఫ్ సెంచరీలు
ఒత్తిడిలో ఇంగ్లండ్ చిత్తు



హార్దిక్ పాండ్యా (53)



శివమ్ దూబే (53)

పుణె: స్వదేశంలో భారత్ జైత్రయాత్ర సాగిస్తోంది. టీ20 ఫార్మాట్‌లో మరే జట్టుకూ సాధ్యంకాని రీతిలో వరుసగా 17వ సిరీస్‌ను చేజిక్కించుకుంది. శుక్రవారం ఇంగ్లండ్‌తో ఉత్కంఠగా సాగిన నాలుగో టీ20లో భారత్ 15 పరుగులతో నెగ్గింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో విశేషంగా రాణించిన సూర్య సేన 3-1 తేడాతో మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను వశం చేసుకుంది. 2019 నుంచి టీమిండియా సొంత గడ్డపై టీ20 ఫార్మాట్‌లో ద్వైపాక్షిక సిరీస్‌ను ఓడిపోలేదు. ముందుగా భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 181 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 53), శివమ్ దూబే (34 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 53) అర్ధసెంచరీలు సాధించగా.. అభిషేక్ (29), రింకూ సింగ్ (30) సహకరించారు. సకీబ్‌కు 3, ఒవర్టన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇంగ్లండ్ 19.4 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. బ్రూక్ (51), డకెట్ (39), సాల్ట్ (23) మాత్రమే రాణించారు. దూబే స్థానంలో కంకషన్ సబ్‌గా అరంగేట్రం చేసిన పేసర్ హర్షిత్ రాణా 3 వికెట్లతో అదరగొట్టాడు. అలాగే బిష్ణోయ్‌కు 3, వరుణ్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా దూబే నిలిచాడు.

ఆరంభం బాగున్నా..: 182 పరుగుల ఛేదనలో ఓపెనర్లు డకెట్, సాల్ట్‌ల దూకుడుతో ఇంగ్లండ్ పవర్‌ప్లేలోనే 62 రన్స్ సాధించింది. కానీ మధ్య ఓవర్లలో స్పిన్నర్లు పట్టు సాధించి ఇంగ్లండ్‌ను నేలకు దించారు. మొదట ఐదు రన్స్ తేడాతోనే మూడు వికెట్లు తీసి ఒత్తిడి పెంచారు. 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన బ్రూక్‌తో పాటు కార్స్ (0)ను 15వ ఓవర్‌లో వరుణ్ చక్రవర్తి పెవిలియన్‌కు చేర్చడంతో ఇక కోలుకోలేకపోయింది. మిగిలిన వికెట్లన్నీ టపటపా కోల్పోగా ఆఖరి ఓవర్‌లో సమీకరణం 19 రన్స్‌కు మారింది. అయితే ఇంగ్లండ్ 3 రన్స్ మాత్రమే చేసి ఆలౌటవడంతో భారత్ సంబరాల్లో మునిగింది.

హార్దిక్-దూబే జోరుతో..: సిరీస్‌లో తొలిసారి టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ హార్దిక్-దూబే జోరుతో 12/3 నుంచి 180+ స్కోరుతో ప్రత్యర్థికి సవాల్ విసరగలిగింది. పేసర్ సకీబ్ మహమూద్ తొలి బంతికే శాంసన్ (1) పనిబట్టగా.. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన తిలక్ వర్మ వచ్చీ రాగానే భారీ షాట్‌కు వెళ్లి గోల్డెన్ డకౌటయ్యాడు. అయితే ఆరో బంతికి కెప్టెన్ సూర్యను కూడా డకౌట్ చేయడంతో 12 పరుగుల వద్దే భారత్ కీలక మూడు వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ రషీద్ బంతి చేతబట్టి ఊపు మీదున్న అభిషేక్‌ను దెబ్బతీశాడు. దీంతో నాలుగో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే రింకూ కూడా పెవిలియన్‌కు చేరగా జట్టు బాధ్యతను దూబే, హార్దిక్ తీసుకున్నారు. ఇద్దరూ చెరో ఎండ్‌లో భారీ షాట్లతో అలరించారు. 14వ ఓవర్‌లో దూబే 4,6.. 16వ ఓవర్‌లో హార్దిక్ 6,6తో స్కోరులో వేగం పెరిగింది. ఆ తర్వాత ఆర్చర్ ఓవర్‌లోనూ తను 6,4 బాదగా దూబే 4తో 17 రన్స్ సమకూరాయి. అటు హార్దిక్ మరో 6,4తో 27 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే భారీ షాట్‌కు వెళ్లి ఒవర్టన్‌కు చిక్కాడు. అప్పటికే ఆరో వికెట్‌కు 87 పరుగులు సమకూరాయి. అటు దూబే సైతం 19వ ఓవర్‌లో రెండు ఫోర్లతో 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ చివరి ఓవర్‌లో 3 వికెట్లు కోల్పోయిన భారత్ మూడు పరుగులే చేసింది.

1

ఒకే ఓవర్‌లో పరుగులివ్వకుండా మూడు వికెట్లు తీసిన తొలి ఇంగ్లండ్ బౌలర్‌గా సకీబ్ మహమూద్. అలాగే భారత్‌పై టీ20ల్లో ఈ ఫీట్ నమోదవడం కూడా ఇదే మొదటిసారి.

కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అరంగేట్రం చేసిన తొలి టీ20 ప్లేయర్‌గా హర్షిత్ రాణా.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (సి) కార్స్ (బి) మహమూద్ 1; అభిషేక్ (సి) బెథెల్ (బి) రషీద్ 29; తిలక్ (సి) ఆర్చర్ (బి) మహమూద్ 0; సూర్యకుమార్ (సి) కార్స్ (బి) మహమూద్ 0; రింకూ (సి) రషీద్ (బి) కార్స్ 30; దూబే (రనౌట్) 53; హార్దిక్ (సి) బట్లర్ (బి) ఒవర్టన్ 53; అక్షర్ (సి) బెథెల్ (బి) ఒవర్టన్ 5; అర్ష్‌దీప్ (రనౌట్) 0; బిష్ణోయ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 181/9. వికెట్ల పతనం:** 1-12, 2-12, 3-12, 4-57, 5-79, 6-166, 7-180, 8-180, 9-181. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-37-0; మహమూద్ 4-1-35-3; కార్స్ 4-0-39-1; ఒవర్టన్ 4-0-32-2; రషీద్ 4-0-35-1.

ఇంగ్లండ్: సాల్ట్ (బి) అక్షర్ 23; డకెట్ (సి) సూర్యకుమార్ (బి) బిష్ణోయ్ 39; బట్లర్ (సి) రాణా (బి) బిష్ణోయ్ 2; బ్రూక్ (సి) అర్ష్‌దీప్ (బి) వరుణ్ 51; లివింగ్‌స్టోన్ (సి) శాంసన్ (బి) రాణా 9; బెథెల్ (సి) సూర్య(బి) రాణా 6; కార్స్ (సి) రింకూ (బి) వరుణ్ 0; ఒవర్టన్ (బి) రాణా 19; ఆర్చర్ (బి) బిష్ణోయ్ 0; రషీద్ (నాటౌట్) 10; సకీబ్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 1; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19.4 ఓవర్లలో 166 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-62, 2-65, 3-67, 4-95, 5-129, 6-133, 7-137, 8-146, 9-163, 10-166. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3.4-0-35-1; హార్దిక్ 1-0-11-0; వరుణ్ 4-0-28-2; అక్షర్ 3-0-26-1; బిష్ణోయ్ 4-0-28-3; రాణా 4-0-33-3.

శ్రీలంక 136/5

గాలె: శ్రీలంక-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టును భారీ వర్షం ఆటంకపరిచింది. దీంతో శుక్రవారం మూడో రోజు 27 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఉదయం 11.45 గంటల నుంచే వర్షం కురవడంతో కాస్త ముందుగానే లంచ్‌కు వెళ్లారు. ఆ సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 136 పరుగులు చేసింది. చాందిమల్ (63 బ్యాటింగ్), కుశాల్ మెండిస్ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఎంతసేపటికీ వర్షం తెరిపినివ్వకపోవడంతో మధ్యాహ్నం 3.35 గంటలకు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌ను 654/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

ఆశీర్వాద్‌కు కాంస్యం

జాతీయ క్రీడల్లో తెలంగాణ బోణీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతా తెరిచింది. హైదరాబాద్ యువ సైక్లిస్ట్ ఆశీర్వాద్ సక్సేనా కాంస్య పతకం కొల్లగొట్టాడు. శుక్రవారం డెహ్రాడూన్‌లో జరిగిన ఈ పోటీల్లోని 120 కిలోమీటర్ల విభాగంలో ఆశీర్వాద్ తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ రేసును ఆశీర్వాద్ 2 గంటల 48 నిమిషాల 39 సెకన్లలో ముగించి కాంస్యంతో మెరిశాడు. గుంటూరు లిఫ్టర్ కె.నీలం రాజు ఆంధ్రకు స్వర్ణం అందించాడు.

కోహ్లీ క్లీన్‌బౌల్డ్

ఆరు పరుగులకే అవుట్
రైల్వేస్‌తో ఢిల్లీ రంజీ మ్యాచ్



న్యూఢిల్లీ: తనకోసం పోటెత్తిన అభిమానులను విరాట్ కోహ్లీ తీవ్రంగా నిరాశ పరిచాడు. రైల్వేస్‌తో రంజీలో కేవలం ఆరు పరుగులకే నిష్క్రమించి ఉసూరుమనిపించాడు. అభిమానుల కేరింతల నడుమ క్రీజులోకి వచ్చిన కోహ్లీ ఓ స్ట్రెయిట్ డ్రైవ్ బౌండరీ కొట్టడంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఫోర్ దంచడంతో జోష్ నిండిన ఫ్యాన్స్‌కు హిమాన్షు సంగ్వాన్ వెంటనే షాకిచ్చాడు. అతడు ఆఫ్‌స్టంప్ ఆవలిగా ఫుల్ లెంగ్త్‌లో వేసిన బంతిని కోహ్లీ డ్రైవ్ చేయబోయాడు. కానీ బంతి అనూహ్యంగా బ్యాట్, ప్యాడ్ మధ్య నుంచి దూసుకుపోయి ఆఫ్‌స్టంప్‌ను గిరాటేసింది. అంతే స్టేడియం ఒక్కసారిగా మూగబోయింది. విరాట్ నిరాశగా పెవిలియన్ చేరాడు. అప్పటిదాకా కిటకిటలాడిన స్టేడియం కొద్దిసేపటికే ఖాళీ అయ్యింది. విరాట్ అవుట్‌తో నిరాశ చెందిన ఫ్యాన్స్ స్టేడియాన్ని వీడారు. అనంతరం ఆయుష్ బదోని (99) మెరుపు బ్యాటింగ్‌కు సుమిత్ మాథుర్ (78 నాటౌట్) నిలకడైన ఆట జత కావడంతో..శుక్రవారం, రెండో రోజు ఆఖరికి ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 334/7 స్కోరు చేసింది. రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 241 రన్స్‌కు ఆలౌటైంది.

తన్మయ్ శతకం

హైదరాబాద్ 326 ఆలౌట్

నాగ్‌పూర్: ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (136) శతకంతో చెలరేగడంతో విదర్భతో గ్రూప్-ఎ రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 90/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 326 రన్స్‌కు ఆలౌటైంది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 190 రన్స్‌కే కుప్పకూలడంతో పర్యాటక జట్టుకు 136 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ శుక్రవారం, రెండో రోజు ఆఖరికి 56/2 స్కోరుతో నిలిచింది.

సచిన్‌కు జీవన సాఫల్య పురస్కారం

- ఉత్తమ క్రికెటర్లు బుమ్రా, మంధాన
- బీసీసీఐ వార్షిక అవార్డుల ప్రకటన







ముంబై : దిగ్గజ బ్యాటర్ సచిన్ టెండూల్కర్‌కు జీవన సాఫల్య పురస్కారాన్ని బీసీసీఐ ప్రకటించింది. అలాగే భారత జట్టు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఉత్తమ పురుష క్రికెటర్ (2023-24)గా, స్మృతీ మంధానను ఉత్తమ మహిళా క్రికెటర్‌గా ఎంపిక చేసింది. ఈమేరకు శనివారం జరిగే కార్యక్రమంలో వారికి ఈ అవార్డులు అందజేయనుంది. 51 ఏళ్ల సచిన్ మొత్తం 664 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇక 31 ఏళ్ల బుమ్రా.. ఐసీసీ టెస్ట్, ఓవరాల్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా, మంధాన ఐసీసీ వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే.

చిత్రజ్యోతి

SINCE 1965

ఓహో రత్తమ్మా



విష్వక్సేన్ కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'. ఇందులో విష్వక్సేన్ సోనూ మోడల్, లైలా అనే రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆకాంక్షశర్మ కథానాయికగా నటించారు. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహూ గారపాటి నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ చిత్రంలో 'ఓహో రత్తమ్మా' అంటూ జానపద శైలిలో సాగే గీతాన్ని శుక్రవారం యూనిట్ విడుదల చేసింది. పెంచల్‌దాస్ సాహిత్యం అందించడంతో పాటు మధుప్రియతో కలసి ఆలపించారు. లియోన్ జేమ్స్ స్వరపరిచారు. సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్

ఏనాడూ నేను ఏదీ ఆశించలేదు

- నందమూరి బాలకృష్ణ



పద్మ భూషణ్ అవార్డుకు ఎంపికైన నందమూరి బాలకృష్ణ ను బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'నాకు పద్మ పురస్కారం ఆలస్యంగా వచ్చిందని కొందరు అంటున్నారు. కానీ అది సరి కాదు. మా నాన్న ఎన్టీఆర్‌గారి శత జయంతి వేడుకలు జరుగుతున్న సందర్భం ఇది. 75 ఏళ్ల నటజీవితం ఆయనది. నేను కూడా 50 ఏళ్ల సినీ జీవితాన్ని పూర్తి చేసుకున్నా. మూడు సార్లు వరుసగా హిందూపురంలో గెలిచాను. నేను నటించిన నాలుగు చిత్రాలు వరుసగా అఖండ విజయం సాధించాయి. ఇటువంటి సమయంలో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్‌ను అందుకుంటున్నాను. ఇదే సరైన సమయం' అని అన్నారు. 'మా నాన్నగారికి భారతరత్న అందకపోవడం కొంత అసంతృప్తిని కలిగిస్తోంది. త్వరలోనే దానిని కూడా సాధిస్తామనే ఆశ ఉంది' అన్నారాయన. తాను ఏనాడు ఏదీ ఆశించి పని చేయలేదని పేర్కొంటూ 'నాన్న ఆశీర్వాదంతోనే పద్మభూషణ్ నన్ను వరించింది' అన్నారు బాలకృష్ణ.

ఆ పాత్ర కోసం చాలా కష్టపడ్డాను

రష్మిక మందన్న



విక్కీ కౌశల్, రష్మిక మందన్న ప్రధాన పాత్రధారులుగా చారిత్రక కథాంశంతో తెరకెక్కిన హిందీ చిత్రం 'ఛావా'. ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ జీవిత గాథ ఆధారంగా తెరకెక్కింది. శంభాజీ పాత్రలో విక్కీ కౌశల్, ఆయన భార్య యేసు బాయి పాత్రలో రష్మిక నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకుడు. ఈ నెల 14న విడుదలవుతోంది. చిత్రబృందం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'జానూ తూ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ 'మళ్లీ హైదరాబాద్‌కు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కాల్పనిక పాత్రల్లో కొంచెం స్వేచ్ఛ తీసుకోవచ్చు కానీ నిజ జీవిత పాత్రలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకే యేసుబాయి పాత్రను పోషించేందుకు చాలా కష్టపడ్డాను' అని చెప్పారు. విక్కీ కౌశల్ మాట్లాడుతూ 'కొడుకుగా, భర్తగా, యోధుడిగా...భిన్న ఛాయలున్న శంభాజీ పాత్రను పోషించడం సవాల్‌గా అనిపించింది. ఏ. ఆర్ రెహమాన్‌తో కలసి పనిచేయాలన్న కోరిక ఈ చిత్రంతో నెరవేరింది. పోరాట ఘట్టాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.


ప్రతి శుక్రవారం ఓ కొత్త అనుభవం

- నాగ చైతన్య



'సక్సెస్ లేదా ఫెయిల్యూర్‌ను మరీ సీరియస్‌గా తీసుకోకూడదు. ఏది వర్కౌట్ అయింది, ఏది కాలేదన్న దానిపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. ముందడుగు వేయాలి. ప్రతి శుక్రవారం ఓ కొత్త అనుభవం' అని అభిప్రాయపడ్డారు నాగ చైతన్య. 'తండేల్' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పెళ్లి తరవాత తన జీవితం ఎలా ఉందన్న ప్రశ్నకు సమాధానమిస్తూ... 'మాకు పెళ్లి అయి రెండు నెలలే అయ్యింది. మేమిద్దరం ఒకరికొకరం తగినంత సమయం కేటాయిస్తున్నాం. అటు షూటింగులు, ఇటు వ్యక్తిగత జీవితానికి సమానంగా సమయం ఇస్తుండటంతో వర్క్ లైఫ్ బ్యాలెన్స్ బాగుంది. ప్రస్తుతం శోభితతో సంసార జీవితాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నా' అని వివరించారు. నాగ చైతన్య, సాయిపల్లవి నటించిన 'తండేల్' సినిమా ఫిబ్రవరి 7న విడుదలవుతోంది.

మూడో పెళ్లికి సిద్ధమవుతున్నారా?



ఆరు పదుల వయసులో ఉన్న బాలీవుడ్ నటుడు ఆమీర్ ఖాన్ మళ్లీ ప్రేమలో పడ్డారు. బెంగళూరుకి చెందిన ఓ యువతితో ఆయన ప్రేమాయణం సాగిస్తున్నారనీ, ఇటీవలే ఆమెను తన కుటుంబ సభ్యులకు పరిచయం చేశారనీ బీటౌన్‌లో జోరుగా వినిపిస్తోంది. ఆమె ఎవరో వివరాలు తెలియక పోయినా ఆమీర్ ప్రేమకు ఆయన కుటుంబ సభ్యులు ఆమోద ముద్ర వేశారనీ, ఇక వారి పెళ్లి జరగడమే మిగిలిందని అంటున్నారు. ఇది ఆయనకు మూడో పెళ్లి అవుతుంది. ఆమీర్ ఖాన్ తొలి వివాహం 1986లో రీనా దత్తాతో జరిగింది. ఈ జంటకు ఇద్దరు పిల్లలు.. జునైద్ , ఐరా ఖాన్. 2002లో భార్య నుంచి విడిపోయారు ఆమీర్. ఆ తర్వాత దర్శకురాలు కిరణ్ రావుతో నాలుగేళ్లు డేటింగ్ చేసి, 2005లో ఆమెని వివాహం చేసుకున్నారు. వీరిద్దరికీ ఒక కుమారుడు ఆజాద్ ఉన్నాడు. 15 ఏళ్ల వైవాహిక బంధానికి గుడ్ బై చెప్పేసి 2021లో ఆమీర్, కిరణ్ రావు విడాకులు తీసుకున్నారు. మరి ఆమీర్ ఖాన్ మూడో పెళ్లి ఎప్పుడో!

నిన్నే చూస్తూ చూస్తూ



సంతోష్ కల్వచెర్ల, క్రిషేక్ పటేల్ జంటగా రతన్ రిషి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్టిస్ట్'. ఎస్‌జేకే ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై జేమ్స్ వాట్ కొమ్ము నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం నుంచి 'చూస్తూ చూస్తూ' అనే పాటను చిత్ర బృందం విడుదల చేసింది. 'చూస్తు చూస్తు చూస్తు నిన్నే చూస్తుండిపోయా, చూస్తు చూస్తు నేనే నీవై పోయా, చూస్తు చూస్తు నువ్వే చేశావే మాయ...చూస్తు గుండెల్లోనే దాచా చెలియా' అంటూ హీరో, హీరోయిన్ల మధ్య సాగే ఈ పాటను హోళీ పండగ నేపథ్యంలో కలర్‌ఫుల్‌గా చిత్రీకరించారు. రాంబాబు గోసాల సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం అందించారు. కపిల్ కపిలన్ అద్భుతంగా ఆలపించారు.

కిల్లర్ కథ



సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కథను అందిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'కాఫీ విత్ ఎ కిల్లర్'. సెవెన్‌హిల్స్ సతీశ్ నిర్మించారు. శ్రీనివాసరెడ్డి, సత్యం రాజేశ్, టెంపర్ వంశీ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రం శుక్రవారం నుంచి ఆహా ఓటీటీ ద్వారా స్ట్రీమింగ్ అవనుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం నిర్వహించింది. ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ 'హీరో హీరోయిన్ లేకుండా విలన్ మాత్రమే ఉండేలా ఒక సినిమా తీయాలనే ఆలోచనతో ఈ కథ మొదలైంది. కథే ఈ చిత్రానికి హీరో' అని చెప్పారు. సెవెన్‌హిల్స్ సతీష్ మాట్లాడుతూ 'మంచి సినిమా చేశాము. ఒక కాన్సెప్ట్‌ని కథగా అనుకొని, సినిమాగా తీసి మీ ముందుకు తీసుకొస్తున్నాం' అన్నారు.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.3-6.8% వృద్ధి



2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు 8% వృద్ధి అవసరం

- ఇందుకు నియంత్రణ సడలింపులతో పాటు భూ, కార్మిక సంస్కరణలు చేపట్టాలి..
- పెట్టుబడులను జీడీపీలో 35%కి పెంచాలి..
- ఏఐ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ రంగాల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలి..
- తయారీని మరింత ప్రోత్సహించాలి..
- వ్యాపార నిర్వహణను సులభతరం చేయాలి
- ఆర్థిక సర్వేను పార్లమెంట్‌కు సమర్పించిన ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత జీడీపీ వృద్ధి రేటు 6.3-6.8 శాతం శ్రేణిలో నమోదు కావచ్చని 2024-25 ఆర్థిక సర్వే నివేదిక అంచనా వేసింది. బలమైన ఆర్థిక మూలాలు, ఆర్థిక స్థిరీకరణ, నిలకడైన ప్రైవేటు వినియోగం ఇందుకు దోహదపడనున్నాయని సర్వే పేర్కొంది. అయితే, అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు అవసరమైన వృద్ధి కంటే ఇది చాలా తక్కువని అభిప్రాయపడింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంట్‌లో 'ఆర్థిక సర్వే 2024-25' నివేదికను సమర్పించారు. దేశ ప్రస్తుత ఆర్థిక స్థితిగతులను తెలిపే ఈ వార్షిక నివేదికను ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ పర్యవేక్షణలో ఆర్థిక వ్యవహారాల శాఖ తయారు చేసింది. ఆర్థిక సర్వే నివేదికను తొలిసారిగా 1950-51లో రూపొందించారు. అప్పట్లో బడ్జెట్‌తో కలిపి దీన్ని సమర్పించేవారు. 1960 నుంచి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు ముందు రోజు ఈ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించడం ప్రారంభించింది.

ఈ మార్చి 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) జీడీపీ వృద్ధి రేటు నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి 6.4 శాతానికి పరిమితం కావచ్చని కేంద్ర గణాంక శాఖ ఇప్పటికే ముందస్తు అంచనాలను విడుదల చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఎకనామిక్ సర్వే అంచనా వేసిన 6.3-6.8 శాతం వృద్ధి శ్రేణిలో దిగువ స్థాయి ఈసారి కంటే తక్కువ. అంటే, వచ్చే ఏడాది వృద్ధి మరింత బలహీనపడే అవకాశాలు న్నాయనడానికిదే సంకేతం. అంతేకాదు, కొవిడ్ సంక్షోభం అనంతరం భారత్‌కు ఇదే కనిష్ఠ వృద్ధి రేటు కానుంది. గ్రామీణ మార్కెట్ గిరాకీ, పెరిగిన పంట దిగుబడి, తగ్గుముఖం పడుతున్న ఆహార ధరలు, స్థిరమైన ఆర్థిక మూలాలు స్వల్పకాలిక వృద్ధికి దోహదపడనున్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. అయితే, అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ, వాణిజ్య అనిశ్చితుల తోపాటు కమోడిటీల ధరలు మళ్లీ పెరిగే అవకాశాలు ఆర్థికాభివృద్ధికి అవరోధంగా పరిణమించే ప్రమాదం ఉందని ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ హెచ్చరించారు.



వేగవంత వృద్ధి కోసం ప్రపంచ సానుకూల పరిస్థితులను ఉపయోగించుకునేందుకు భారత్ సదా సిద్ధంగా ఉండాలి. దేశంలో ప్రస్తుత వృద్ధి మందగమనానికి అంతర్జాతీయ అనిశ్చితులు, ప్రతికూలతలే కారణం. అయినప్పటికీ, భారత్ ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది.

- అనంత నాగేశ్వరన్, ప్రధాన ఆర్థిక సలహాదారు

ఆహార ధరలు తగ్గుముఖం

కూరగాయల ధరలు కాస్త తగ్గడంతో పాటు ఖరీఫ్ పంట చేతికి రానుండటంతో ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఆహార ధరల ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టవచ్చని, తద్వారా సామాన్యులకు ధరాఘాతం నుంచి కొంత ఊరట లభించవచ్చని ఆర్థిక సర్వే నివేదిక ఆశాభావం వ్యక్తం చేసింది. రబీ పంట దిగుబడి కూడా మెరుగ్గా ఉంటే వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబరు)లోనూ ఆహార ధరలు అందుబాటులోనే ఉండవచ్చని రిపోర్టు పేర్కొంది. ఆహార ధరలకు కళ్లెం వేసేందుకు పర్యావరణ ప్రతికూలతలను తట్టుకునే వంగడాలను అభివృద్ధి చేయడం తోపాటు పప్పు దినుసులు, వంటనూనె గింజలు, టమోట, ఉల్లి దిగుబడిని పెంచాలని ఆర్థిక సర్వే నివేదిక సూచించింది.

వచ్చే 2 దశాబ్దాలు వడివడిగా..


2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వచ్చే రెండు దశాబ్దాల పాటు 8 శాతం వార్షిక వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఆర్థిక వృద్ధిని ప్రేరేపించేందుకు నియంత్రణ సడలింపులతో పాటు భూ, కార్మిక, బిల్డింగ్, యుటిలిటీ సేవలు, ప్రజా సేవల రంగాల్లో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అంతేకాదు, పెట్టుబడులను జీడీపీలో ప్రస్తుతమున్న 31 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని.. దేశంలో తయారీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని, కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, బయోటెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతల్లో విస్తృతంగా పెట్టుబడులు పెట్టాలని సూచించింది. అలాగే, 2030-32 వరకు వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉందని, దేశంలో 100 శాతం అక్షరాస్యతను సాధించడంతో పాటు విద్యా సంస్థల ప్రమాణాలను పెంచాలని, అత్యంత నాణ్యమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన మౌలిక వసతులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరింది. అంతేకాదు, దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరంగా మార్చాలని.. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు చేపట్టాలని, నియమావళిని సడలించాలని సూచించింది. కేంద్రం, రాష్ట్రాలు సంస్కరణలను కొనసాగిస్తేనే భారత్ భవిష్యత్ లక్ష్యాలకు అవసరమైన వృద్ధిని సాధించగలదని సర్వే నివేదిక పేర్కొంది.

స్టాక్ మార్కెట్లో దిద్దుబాటు పొంచి ఉంది

యువ మదుపరులూ జర జాగ్రత్త

అమెరికా మునిగితే మనమూ మునుగుతాం

దేశీయ స్టాక్ మార్కెట్ వాల్యుయేషన్లపై 2024-25 ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం కొంత దిద్దుబాటు జరిగినా.. మన స్టాక్ మార్కెట్ వాల్యుయేషన్స్ ఇంకా అధికంగానే ఉన్నట్టు స్పష్టం చేసింది. అమెరికా స్టాక్ మార్కెట్ ఏమాత్రం దిద్దుబాటు (కరెక్షన్)కు లోనైనా, మన స్టాక్ మార్కెట్ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో దిద్దుబాటుకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రిటైల్ మదుపరులు ముఖ్యంగా 2020 కొవిడ్ సమయం నుంచి కొత్తగా పెట్టుబడులు ప్రారంభించిన యువ మదుపరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరింది. లేకపోతే నిండా మునగడం ఖాయమని హెచ్చరించింది. దేశీయ స్టాక్ మార్కెట్లో దేశీయ సంస్థాగత ముదుపరులు, రిటైల్ మదుపరుల పాత్ర పెరిగినా, సెంటిమెంట్‌పరంగా మన మార్కెట్‌తో పాటు అనేక దేశాల స్టాక్ మార్కెట్లు ఇప్పటికీ అమెరికా మార్కెట్‌తో ముడిపడి ఉన్న విషయాన్ని ఆర్థిక సర్వే గుర్తు చేసింది.



13.2 కోట్ల మంది మదుపరులు

దేశీయ స్టాక్ మార్కెట్లో పెరుగుతున్న రిటైల్ మదుపరుల పాత్రనీ ఆర్థిక సర్వే గుర్తు చేసింది. 2019లో స్టాక్ మార్కెట్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో మదుపు చేసిన రిటైల్ మదుపరుల సంఖ్య 4.9 కోట్లు ఉంటే, 2024 డిసెంబరు నాటికి ఇది 13.2 కోట్లకు పెరిగిన విషయాన్ని గుర్తు చేసింది. గత ఐదేళ్లలో దేశీయ స్టాక్ మార్కెట్లో కుటుంబాల పెట్టుబడుల విలువ రూ.40 లక్షల కోట్లకు పైగా పెరిగినట్టు తెలిపింది. కంపెనీల ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు, ఆర్థిక వ్యవస్థ జోరు మీద ఉండడం, ఆన్‌లైన్ డిజిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి రావడం ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. డీమ్యాట్ ఖాతాల పరంగా చూసినా గత ఐదేళ్లలో ఏటా సగటున 33 శాతం చొప్పున పెరుగుతూ డిసెంబరు, 2024 నాటికి 18.5 కోట్లకు చేరిన విషయాన్నీ గుర్తు చేసింది. ఈక్విటీ క్యాష్ విభాగంలోనూ రిటైల్ మదుపరుల లావాదేవీల వాటా 35.6 శాతం నుంచి 41 శాతానికి చేరినట్టు తెలిపింది.

ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలి

2047 నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలంటే, కేవలం ప్రభుత్వ పెట్టుబడులు మాత్రమే చాలవని స్పష్టం చేసింది. ఇందుకు ప్రైవేట్ పెట్టుబడులూ పెద్దఎత్తున అవసరమని పేర్కొంది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానమూ ఇందుకు ఉపకరిస్తుందని తెలిపింది. అధిక వృద్ధి రేటు కొనసాగించాలన్నా, మరో 20 ఏళ్ల పాటు మన దేశం మౌలిక సదుపాయాల ప్రాజెక్టుపైన పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

తగ్గనున్న పసిడి ధర!

వెండి మాత్రం పైపైకి

ఈ సంవత్సరం బులియన్ మార్కెట్ ధరలు మిశ్రమంగా ఉంటాయని ఆర్థిక సర్వే అంచనా. పసిడి ధర తగ్గినా, వెండి ధర మాత్రం మరింత కొండెక్కుతుందని స్పష్టం చేసింది. ఒక్క వెండి తప్ప మిగతా లోహాలు, ఖనిజాల ధరలు కూడా ఈ సంవత్సరం దిగొస్తాయని అంచనా వేసింది. రష్యా చమురు ఎగుమతులపై ఎన్ని ఆంక్షలు విధించినా ఈ సంవత్సరం ముడి చమురు ధరల పతనం తప్పదని స్పష్టం చేసింది. అయితే సహజ వాయువు ధర మాత్రం కొద్దిగా పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇనుప ఖనిజం, జింక్ ధరల పతనం ఈ సంవత్సరం ఖనిజాలు, లోహాల మార్కెట్‌ను దెబ్బతీసే అవకాశం ఉందని తెలిపింది. చమురు, బంగారం ధరల తగ్గుదల ఈ సంవత్సరం మన ఆర్థిక వ్యవస్థకు కలిసి రానుందని సర్వే పేర్కొంది.

అధిక ద్రవ్యీకరణతో అనర్థమే

ప్రజల పొదుపులో ఎక్కువ భాగం స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, రుణ పత్రాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులుగా మారడంపైనా ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. ద్రవ్యీకరణ పెట్టుబడులుగా భావించే ఈ స్పెక్యులేషన్ పెట్టుబడులు ఒక స్థాయికి మించి పెరిగితే ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి గానీ, వ్యక్తుల ఆర్థిక స్థిరత్వానిగానీ ఏ మాత్రం మంచిది కావని స్పష్టం చేసింది. అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే ఈ లోపాలు కనిపిస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. మనలాంటి వర్ధమాన దేశాలకు ఇది మరింత ప్రమాదకరమని హెచ్చరించింది.

సమిష్టి కృషితోనే 'తయారీ' హబ్

తయారీ రంగంలో భారత్‌ను ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నాలపైనా ఆర్థిక సర్వే ఘాటు వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, పరిశోధన, అభివృద్ధి సంస్థలు, ఆర్థిక సంస్థలు చేతులు కలిపితే తప్ప.. ఈ లక్ష్య సాధన సాధ్యం కాదని స్పష్టం చేసింది. ప్రస్తుతం చైనా తన భారీ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచ దేశాలను ముంచెత్తుతోంది. ఈ దెబ్బకు తట్టుకోలేక భారత్‌తో సహా అనేక దేశాల పరిశ్రమలు విలవిలలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్వే చేసిన ఈ హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	84,330 ▲	77,300 ▲	1,07,000 ▲
విజయవాడ	85,000 ▲	79,500 ▲	96,000 ▲
విశాఖపట్నం	82,280 ▲	75,420 ▲	94,230 ▲
రాజమండ్రి	84,330 ▲	77,300 ▲	96,200 ▲
ప్రొద్దుటూరు	83,700 ▲	77,510 ▲	95,000 ▲
ముంబై	82,086 ▲	75,191 ▲	93,533 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	500
వరంగల్	482	గోదావరి	490
చిత్తూరు	553	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	109
వరంగల్	98	గుంటూరు	107
కరీంనగర్	98	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	94
కర్నూలు	98	నెల్లూరు	99
విశాఖపట్నం	101	అనంతపురం	99
గోదావరి	109		

మార్కెట్లకు సర్వే కిక్

- సెన్సెక్స్ 741 పాయింట్లు అప్
- 23,500 ఎగువకి నిఫ్టీ

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లలో ఆర్థిక సర్వే జోష్ నింపింది. శనివారం ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్ వృద్ధి ఆధారితంగా ఉంటుందన్న అంచనాలతో మార్కెట్లు పరుగులు తీశాయి. మరోవైపు ఆర్థిక వ్యవస్థ బలమైన ఫండమెంటల్స్‌తో ముందుకు సాగుతోందని ఆర్థిక సర్వే ప్రకటించటంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపింది. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 740.76 పాయింట్ల లాభంతో 77,500.57 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సెన్సెక్స్ 846.15 పాయింట్ల లాభంతో 77,605.96 పాయింట్ల స్థాయిని తాకింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 297.30 పాయింట్లు లాభపడి 23,508.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు లాభాల్లో ముగియటం వరుసగా ఇది నాలుగోరోజు.

నేడు మార్కెట్లు పనిచేస్తాయ్

దేశీయ స్టాక్ మార్కెట్లు శనివారం నాడు పనిచేయనున్నాయి. 2025-26 కేంద్ర బడ్జెట్ సందర్భంగా మార్కెట్లు యథావిధిగా కార్యకలాపాలు సాగిస్తాయని బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వెల్లడించాయి.

మ్యూచువల్ ఫండ్- టర్మ్ లైఫ్ కాంబో

సరికొత్త ఆర్థిక సాధనాన్ని అందుబాటులోకి తెచ్చే యోచనలో సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులకు జీవిత బీమా కవరేజీని జతచేసి మదుపరులకు సరికొత్త ఆర్థిక సాధనాన్ని అందుబాటులోకి తేవాలని భావిస్తున్నట్లు సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఐసీఏఐ శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే చర్చా పత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఆమె చెప్పారు. అయితే, పలు సంస్థలు ఇప్పటికే పెట్టుబడులతో పాటు బీమా కవరేజీని జత చేసిన ఆర్థిక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సేవల విస్తరణకు ఇది దోహదపడనుందని బుచ్ అన్నారు. ఈ కాంబో ప్రొడక్ట్ ఆకర్షణీయ, అందుబాటు ధరలో విస్తృత ప్రజానీకానికి చేరువకానుందన్నారు.

ఇంటర్మీడియేటరీలకు మరింత భద్రంగా చెల్లింపులు: సెక్యూరిటీస్ మార్కెట్లో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా భద్రంగా, సమర్థవంతంగా చెల్లింపులు జరిపేందుకు వీలుగా కొత్త విధానాన్ని సెబీ ప్రతిపాదించింది. ఇందులో భాగంగా, రిజిస్టర్డ్ ఇంటర్మీడియేటరీ సంస్థలు వినూత్న యూపీఐ ఐడీని క్రియేట్ చేసుకోవాలని సెబీ సూచించింది.

60 గంటలకు మించిన పని కష్టమే

వారానికి 60 గంటలకు మించిన పని విధానం ప్రతిపాదనపైనా ఆర్థిక సర్వే అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ విధానాన్ని అనుమతిస్తే అది ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దానివల్ల వారి మానసిక ఆరోగ్యం కూడా చెడిపోయే ప్రమాదం ఉందని తెలిపింది. వారానికి 60 గంటలకు మించి పని చేస్తే, ఉద్యోగుల ఉత్పాదకత పెరిగినా, వారి శారీరక, మానసిక ఆరోగ్యాలు దెబ్బతింటాయని గతంలో జరిగిన సర్వేల్లో తేలిన విషయాన్ని గుర్తు చేసింది. మానసిక కుంగుబాటు, ఆదుర్దాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా రోజూ 1,200 కోట్ల పని గంటలు, ఏటా సుమారు రూ.86.5 లక్షల కోట్లు ఉత్పత్తి నష్టపోతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన ఒక సర్వేను ఆర్థిక సర్వే గుర్తు చేసింది.

గ్రామీణ ఉపాధి హామీ పథకం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో జనవరి 10వ తేదీ నాటికి 220.11 కోట్ల వ్యక్తిగత పనిదినాల కల్పన జరిగిందని సర్వే నివేదిక తెలిపింది. ఈ కార్యక్రమం కింద 99.98 శాతం చెల్లింపులు నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా జరుగుతున్నట్టు పేర్కొంటూ క్రియాశీలంగా పని చేస్తున్న వారిలో 96.3 శాతం మందికి చెల్లింపులు ఈ వ్యవస్థ ద్వారానే జరిగినట్టు తెలియచేశారు.

స్మార్ట్‌సిటీల కింద 7,500 ప్రాజెక్టులు పూర్తి

స్మార్ట్ సిటీస్ మిషన్ కింద ఇప్పటి వరకు 1.5 లక్షల కోట్ల విలువైన 7,500 కోట్ల ప్రాజెక్టులు పూర్తి చేసినట్లు సర్వే వెల్లడించింది. 2015లో ప్రభుత్వం దీన్ని ప్రారంభించింది. అయితే ఈ ఏడాది జనవరి 13 నాటికి రూ.1.64 లక్షల కోట్ల విలువైన 8,058 ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారోత్పత్తుల కట్టడికి చర్యలు తీసుకోవాల్సిందే..

అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారోత్పత్తుల (యూపీఎఫ్) వినియోగాన్ని కట్టడి చేసేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ లేబులింగ్ నిబంధనలు మరింత కఠినతరం చేయటంతో పాటు గరిష్ఠ స్థాయిలో జీఎస్‌టీ విధించాలని సర్వే సూచించింది. అంతేకాకుండా ప్రత్యేకమైన అవేర్‌నెస్ క్యాంపెయిన్స్‌ను నిర్వహించాలని స్పష్టం చేసింది. ప్యాకేజ్డ్ ఫుడ్‌పై చక్కెర, ఉప్పు మోతాదులను స్పష్టంగా కనిపించేలా సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరింది.

పన్ను వసూళ్లలో సొంతవే ఎక్కువ!

- దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ
- రాష్ట్ర ఎంఎస్ఎంఈ విధానం భేష్
- కేంద్ర ఆర్థిక సర్వేలో రాష్ట్రానికి ప్రశంసలు

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లలో సొంత పన్నుల సొమ్ములు సగానికిపైగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. తెలంగాణలో సొంత పన్ను వసూళ్లు 88 శాతం వరకు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మొత్తం పన్ను రాబడుల్లో సొంత పన్నుల వసూళ్లు సగానికి పైగా ఉన్న రాష్ట్రాలు దేశంలో 15 ఉన్నాయని.. వాటిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని శుక్రవారం పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే(2024-25) వెల్లడించింది. గత సెప్టెంబరులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) విధానాన్ని ఆర్థిక సర్వే ప్రత్యేకంగా ప్రశంసించింది. చిన్న ఉత్పత్తిదారులు తమ వస్తువులను అమ్ముకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కామర్స్ హబ్‌లను నెలకొల్పాలని భావిస్తోందని, తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో ఇప్పటికే కొత్త ఎంఎస్ఎంఈ విధానాన్ని ప్రకటించిందని తెలిపింది. దీనివల్ల ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ పోర్టల్, ప్రభుత్వ ఈ మార్కెట్‌ప్లేస్ పోర్టళ్లతో విక్రయదారులను ప్రోత్సహించడం ద్వారా ఎంఎస్ఎంఈల్లో ఈ-కామర్స్ ప్రవేశించేందుకు అవకాశం కలుగుతుందని సర్వే పేర్కొంది. ప్రజలకు రక్షిత తాగునీరిచ్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిషన్‌ను నూటికి నూరు శాతం అమలు చేస్తున్న 8 రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఇక సేవల రంగంలో ప్రత్యేకతను ప్రదర్శిస్తున్న రాష్ట్రాల్లో ఐటీ సేవలతో కర్ణాటక, తెలంగాణ ముందున్నాయని తెలిపింది. తెలంగాణలో స్థూల రాష్ట్ర అదనపు విలువనందించే సేవల (జీఎస్‌వీఏ)లో మూడో వంతు రియల్ ఎస్టేట్ నుంచి లభిస్తున్నాయంది. ఐటీతోపాటు హైదరాబాద్‌లో ఆర్థిక సేవలందించే ఫిన్‌టెక్‌లు కేంద్రీకృతమవడం వల్ల కార్యాలయాలు, నివాస స్థలాలకు గిరాకీ పెరిగిందని వెల్లడించింది. తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు పట్టణాల్లో సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థలపై ఎక్కువగా ఆధారపడినట్లు విశ్లేషించింది.

డ్రోన్ల ద్వారా వ్యాక్సిన్లు, మందులు..

డ్రోన్ల ద్వారా వ్యాక్సిన్లు, మందులను సరఫరా చేసేందుకు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) 2021 సెప్టెంబరులో వికారాబాద్ జిల్లాలో తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి సహకారంతో అమలు చేస్తున్న ప్రాజెక్టు ఆసియాలోనే ప్రప్రథమమని ఆర్థిక సర్వే తెలిపింది. అంతేకాక భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) ప్రవేశపెట్టిన ఐ-డ్రోన్ ప్రాజెక్టు కింద డ్రోన్ల ద్వారా తెలంగాణలో టీబీ నమూనాలను రవాణా చేస్తున్నారని తెలిపింది. మహిళల్లో యాజమాన్య స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం ఎలా దోహదపడుతుందో చెప్పేందుకు తెలంగాణలో అమలు చేస్తున్న వీ-హబ్ (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్) చక్కటి ఉదాహరణ అని సర్వే ప్రశంసించింది. తెలంగాణలో ప్రథమంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో మహిళా యజమానులకు ఇన్‌క్యుబేటర్ ఏర్పరిచారని వెల్లడించింది. దీనివల్ల వారికి సాంకేతిక, ఆర్థిక, ప్రభుత్వ విధానపరమైన మద్దతు లభిస్తుందని, అంతర్జాతీయ మార్కెట్‌లో అవకాశాలు లభిస్తాయని తెలిపింది. కాగా, చైనా తర్వాత అత్యధిక పరిమాణంలో సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్న దేశం భారత్ అని.. 13 రాష్ట్రాల్లో 87 శాతం సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని, వీటిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయని సర్వే పేర్కొంది. దేశంలో 2016-21 సంవత్సరాల్లో వ్యవసాయ భూములకు సాగునీటి వసతి పెరిగిన రాష్ట్రాల్లో తొలి మూడు స్థానాల్లో పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఉండగా.. తెలంగాణ నాలుగో స్థానంలో ఉందని తెలిపింది. రాష్ట్రంలో 86 శాతం భూములకు సాగు నీరందుతోందని సర్వే వెల్లడించిందిది. ఉత్పాదకత, పరిజ్ఞానం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే వ్యవసాయ విస్తరణ విద్యా కేంద్రాలు తెలంగాణతో పాటు హరియాణా, గుజరాత్, అసోంలలో పనిచేస్తున్నాయని చెప్పింది. విద్యార్థులు ఒకరి నుంచి మరొకరు నేర్చుకునే ప్రేరణ విద్యా నమూనాలు శిక్షణా ఫౌండేషన్ ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో అమలు అవుతున్నాయని ఆర్థిక సర్వే వెల్లడించింది.

గల్లీ పేరుతో చిల్లర రాజకీయాలు

- గద్దర్‌ను జీవితాంతం అవమానించింది కాంగ్రెస్సే
- ఆయనపై ఉపా సహా 21 కేసులు పెట్టింది
- కోడ్ సాకుతో పథకాలను ఆపేసే కుట్ర
- రైతు భరోసా సహా అన్ని పథకాలనూ కొనసాగించాలి: సంజయ్



హైదరాబాద్/న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఉన్న గల్లీకి గద్దర్ పేరు పెడతానని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వలేదనే కోపంతో ఆయన మాట్లాడిన మాటలు చిన్న పిల్లల చేష్టల్లా ఉన్నాయని తెలిపారు. సీఎం అహం చల్లారుతుందంటే.. ఆయన ఏ గల్లీ పేరునైనా మార్చుకోవచ్చని అన్నారు. రేవంత్‌కు అంత ఆసక్తి, ధైర్యం ఉంటే.. ముందు హైదరాబాద్ పేరును భాగ్యనగర్‌గా, నిజామాబాద్ పేరును ఇందూరుగా, ఆయన సొంత జిల్లా పేరును పాలమూరుగా మార్చాలని ఎక్స్ వేదికగా సంజయ్ డిమాండ్ చేశారు. "గద్దర్‌ను జీవితాంతం అవమానించింది కాంగ్రెస్ కాదా..? నక్సల్స్‌తో చర్చల సందర్భంగా గద్దర్‌ను మధ్యవర్తిగా ఉపయోగించుకున్నది ఎవరు..? ఆయనపై ఉపా కేసు పెట్టింది కాంగ్రెస్ కాదా..? గద్దర్‌పై 21 కేసులు పెట్టింది.. ఆయన పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగేలా చేసింది ఎవరు..? దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు, చిట్టెం నర్సిరెడ్డి సహా అనేక మంది నేతలు, ఐపీఎస్ అధికారులు, ఎంతో మంది పోలీసుల కుటుంబాలు నక్సలిజం బాధితులు కాదా..? రాష్ట్ర హోం మంత్రిగా ఉన్న మీరు ఆ కుటుంబాల శోకాన్ని కనీసం పట్టించుకోకుండా మీ రాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టమొచ్చినట్లు ఎలా మాట్లాడతారు..?" అని సంజయ్ ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలు మాని ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టాలని రేవంత్‌కు సూచించారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకుతో రైతు భరోసా పథకాన్ని నిలిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సంజయ్ ఆరోపించారు. రైతు భరోసా ఇప్పటికే కొనసాగుతున్న పథకమే అయినందున ఎన్నికల సంఘం నుండి ఎలాంటి ఇబ్బందులు ఉండబోవన్నారు. అవసరమైతే బీజేపీ పక్షాన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ద్వారా ఎన్నికల సంఘానికి లేఖ పంపించేందుకు కూడా సిద్ధమని తెలిపారు. ఎన్నికల కోడ్ సాకుతో ఆయా పథకాలను నిలిపివేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

వారంలోపే రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన..

బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా పార్టీ అధ్యక్షుల ఎన్నిక కొలిక్కి వచ్చింది. 27 జిల్లాలకు పార్టీ కొత్త అధ్యక్షుల పేర్లు ఖరారయ్యాయి. పార్టీ సంస్థాగత నియమావళికి అనుగుణంగా శనివారం నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆదివారం కొత్త అధ్యక్షులపై ప్రకటన వెలువడనుంది.

రాష్ట్రపతినే అవమానిస్తారా..?

సోనియా, రాహుల్ క్షమాపణ చెప్పాలి

ముర్ము పట్ల వారి వ్యాఖ్యలు సరికాదు: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విషయంలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖల పట్ల కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతిని సోనియా, రాహుల్ గాంధీ అవమానించడం అనాది నుంచి ఆ పార్టీ కొనసాగిస్తున్న సంప్రదాయంలో భాగమేనని విమర్శించారు. విదేశీ శక్తులకు కొమ్ముకాస్తూ, దేశ కీర్తిని దిగజార్చడానికి ఎంతకైనా దిగజారిపోయి పని చేస్తున్న కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులు సోనియా, రాహుల్ గాంధీ.. రాష్ట్రపతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతను, రాజ్యాంగ వ్యవస్థలను, రాజ్యాంగం ప్రకారం నియమితులై అత్యున్నత పదవులను అలంకరించిన వ్యక్తులను.. దేనినీ, ఎవరినీ వదలకుండా అవమానించే సంప్రదాయాన్ని కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులు అనాది నుంచి కొనసాగిస్తూ వస్తున్నారని విమర్శించారు. అధికార దాహంతో వ్యక్తిగత స్వార్థం కోసం కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగానికి 75 సార్లు సవరణలు చేశారని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్, సీబీఐ వంటి రాజ్యాంగ బద్ధ సంస్థలకు కాంగ్రెస్ నాయకులు రాజకీయాలను అంటగడతారని, దేశ అత్యున్నత పదవిని అలంకరించిన ఆదివాసీ మహిళను అవమానిస్తారని ధ్వజమెత్తారు. ఉభయ సభలను ఉద్దేశించి దేశం సాధించిన లక్ష్యాలను ప్రస్తావిస్తూ రాష్ట్రపతి ముర్ము చేసిన ప్రసంగాన్ని 'బోరింగ్' అని రాహుల్ గాంధీ మాట్లాడటం దేనికి సంకేతమని కిషన్‌రెడ్డి ఎక్స్ వేదికగా ప్రశ్నించారు

టెక్ మహీంద్రాకు భారీ ఊరట

» 'సత్యం' చూపిన ఇన్‌కంపై కాదు అసలు ఆదాయంపైనే పన్ను వేయండి: హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సత్యం కంప్యూటర్స్‌ను కొనుగోలు చేసిన ప్రస్తుత యాజమాన్యం టెక్ మహీంద్రాకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. కుంభకోణంలో భాగంగా సత్యం కంప్యూటర్స్ పాత యాజమాన్యం పెంచి చూపిన ఆదాయంపై పన్ను విధించడం సరికాదని పేర్కొంది. అసలు ఆదాయం ఎంతో మళ్లీ మదింపు చేసి, సవరించిన ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ ఆధారంగా మాత్రమే పన్ను వసూలు చేయాలని తెలిపింది. 2002-03 నుంచి 2008-09 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆదాయాన్ని తాజాగా సరైన విధంగా మదింపు చేయాలని సూచించింది. ఆర్థిక అక్రమాలతో అతలాకుతలమైన సత్యం కంప్యూటర్స్‌ను తమ ఆధీనంలోకి తీసుకుని ఎంతో మంది ఉద్యోగులను కాపాడిన టెక్ మహీంద్రాకు అధిక పన్నులు విధించడం ద్వారా శిక్ష విధించడం సరికాదని తెలిపింది. ఈ మేరకు టెక్ మహీంద్రా పిటిషన్‌లను సమర్థిస్తూ సవరించిన ఆదాయపన్ను రిటర్న్‌ను అంగీకరించాలని ఇన్‌కంట్యాక్స్‌కు డిపార్ట్‌మెంట్‌కు ఆదేశాలు జారీచేసింది.

వృద్ధ ఒంటరి మహిళలను ప్రత్యేక కుటుంబంగా గుర్తించాలి: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ రిజర్వాయర్ కారణంగా నిర్వాసితులైన 65 ఏళ్లకుపైగా వయస్సు ఉన్న ఒంటరి మహిళలు, వితంతువులను ప్రత్యేక కుటుంబంగా గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది. వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇదే అంశంపై 2019లో తీర్పు ఇచ్చామని, దాని ఆధారంగా ప్యాకేజీ ఇవ్వాలని పేర్కొంది. సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్ గ్రామపరిధిలో ఉన్న 36 మంది ఒంటరి మహిళలకు దీన్ని వర్తింపజేయాలని జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఆదేశించింది. మొత్తం కసరత్తును నాలుగు నెలల్లో ముగించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది.

చంపి.. పాతిపెట్టి.. కల్లాపి చల్లారు

గృహిణిపై భర్త అతని కుటుంబసభ్యుల ఘాతుకం

గత నెల 16న మహబూబాబాద్‌లో ఘటన

వివరాలు వెల్లడించిన పోలీసుల

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త అతని కుటుంబసభ్యులు గృహిణిని హతమార్చి ఇంటి ఆవరణలో పూడ్చిపెట్టి.. దానిపై రోజూ కల్లాపు చల్లిన ఘటన మహబూబాబాద్‌లో కలకలం రేపింది. జనవరి 16న ఘటన వెలుగులోకి రాగా నిందితులు శుక్రవారం పోలీసులకు లొంగిపోయారు. ఈ సందర్భంగా పోలీసులు కేసు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్‌కు చెందిన గోపీ భవన నిర్మాణ పనుల నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు వెళ్లగా అక్కడ అతడికి అప్పటికే భర్త చనిపోయి ఇద్దరు పిల్లల తల్లి అయిన నాగమణి అనే మహిళ పరిచయమైంది. గోపి.. నాగమణిని పెళ్లి చేసుకుని మహబూబాబాద్‌లోని తన ఇంటికి తీసుకొచ్చాడు. గోపి ఆమెను పెళ్లిచేసుకోవడం అతని తల్లిదండ్రులకు ఇష్టం లేకపోవడంతో వేరు కాపురం పెట్టాడు. కొద్దిరోజుల తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమవడంతో నాగమణి ఇద్దరు కుమారులు అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. జనవరి 7న గోపీ తన భార్య నాగమణిని తన తల్లిదండ్రుల ఇంటికి తీసుకువచ్చాడు. ఇదే అదనుగా భావించిన గోపీ తల్లిదండ్రులు, అక్క, బావ.. అతడి మనసు మార్చి ఆమె హత్యకు పురిగొల్పారు. జనవరి 7న రాత్రి నాగమణి నిద్రిస్తుండగా బండరాయితో తలపై మోది హత్య చేసి ఎవరికీ అనుమానం రాకుండా రాత్రికిరాత్రే ఇంటిముందు గొయ్యి తవ్వి మృతదేహాన్ని పాతి పెట్టారు. దానిపై రోజూ ఉదయాన్నే కల్లాపు చల్లారు. స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమివ్వడంతో వారు విచారణ చేసి గుంత తవ్వి నాగమణి మృతదేహాన్ని వెలికితీశారు. అప్పటికే పరారీలో ఉన్న నిందితులు శుక్రవారం మహబూబాబాద్ పోలీసులకు లొంగిపోయారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే అతడిని కూడా అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.



అధికారులను సన్మానిస్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం

హాజరైన కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరి అని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లలో విరమణ పొందిన అధికారులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధాన శాఖలను నిర్వర్తిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ ముగింపు కాదని కొత్త ఆరంభమని, వారు తమ అభిరుచులను కొనసాగించేందుకు ఇదొక మంచి అవకాశమని వారు ఉద్ఘాటించారు. వారి సేవల్లో పొందిన అపార అనుభవం, జ్ఞానాన్ని సమాజ సేవకు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు వెంకటిరెడ్డి, సంధ్యారాణి, ఆర్డీవో రమేశ్ రాథోడ్, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, డీఆర్వో గణేష్, డీఆర్‌డీవోలు మేన శ్రీను, కౌసల్యాదేవి, జడ్పీ సీఈవోలు విద్యాలత, రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులను సన్మానిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

హేమాచలుడి దేవస్థానం ప్రధానార్చకుడి ఉద్యోగ విరమణ

మంగపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రధానార్చకుడిగా విధులు నిర్వహించిన కైంకైర్యం రాఘవాచార్యులుకు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. రాఘవాచార్యులుతోపాటు ఆయన సతీమణిని సన్మానించారు. దేవస్థానం ఈవో శ్రవణం సత్యనారాయణ, ప్రధానార్చకుడు ఎం.రాజశేఖరశర్మ, అర్చకులు పవన్‌కుమారా చార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, అనిపెద్ది మురళీ కృష్ణ శర్మ, వెంకటనారాయణశర్మ, రాజీవ్‌నాగశర్మలతో పాటు ఉద్యోగులు సీతారాములు, శేషు తాత్కాలిక ఉద్యోగులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకుడిని సన్మానిస్తున్న తోటి అర్చకులు, ఉద్యోగులు

మెడికల్ పీజీలో స్థానిక రిజర్వేషన్లు ఉండాల్సిందే

రాష్ట్ర వైద్య విద్యార్థుల డిమాండ్

» సుప్రీం తీర్పుతో విద్యార్థుల్లో ఆందోళన

» రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కోసం ఎదురుచూపు

వరంగల్ మెడికల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య పీజీ కోర్సుల్లో స్థానిక రిజర్వేషన్లు ఉండాల్సిందేనని రాష్ట్ర వైద్య విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక రిజర్వేషన్లు ఎత్తివేయడాన్ని బలంగా ప్రతిఘటించకపోతే భవిష్యత్తులో ప్రతిభ నెపంతో వెనుకబడిన కులాలకు ఇస్తున్న రిజర్వేషన్లనూ నీరుగార్చే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల ప్రవేశాల్లో రాష్ట్ర కోట (50శాతం) సీట్లను నివాస ఆధారంగా భర్తీ చేయడం కుదరదని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర వైద్య విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కోసం ఎదురుచూస్తున్నారు. తెలంగాణతోపాటు దక్షిణాది రాష్ట్రాల వైద్య విద్యార్థులకు నష్టం చేసే ఈ తీర్పును అమలు చేయవద్దని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరంగా చర్యలు తీసుకొని రాష్ట్ర వైద్య విద్యా విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం ఒక్కో జాబితాలో ఉందని, స్థానికత ఆధారంగా సీట్లు భర్తీ చేయకపోతే విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం జరుగుతుంటున్నారు. తెలంగాణతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో.. ఉత్తరాదితో పోలిస్తే మెడికల్ పీజీ సీట్లు ఎక్కువ ఉన్నాయని, అప్పుడు సమన్యాయం ఎలా వర్తిస్తుందంటున్నారు. దక్షిణాది వైద్య కళాశాలల్లో వైద్య విద్యా ప్రమాణాలు ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు. ఇతర ప్రాంతాల విద్యార్థులు దక్షిణాది రాష్ట్రాలను కోరుకుంటే స్థానిక వైద్య విద్యార్థుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఎంతో డిమాండ్ ఉన్న వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్థానికత ఆధారిత రిజర్వేషన్లు తీసివేయడం వల్ల వైద్య విద్య విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని తల్లిదండ్రులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో బడ్జెట్‌లో వైద్య విద్యకు పెద్ద పీట వేస్తారని, ఈ ఫలాలు మాత్రం ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అనుభవిస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇతర రాష్ట్రాల పీజీ విద్యార్థుల వల్ల స్థానిక రోగులు తమ సమస్యలను చెప్పుకోవడంలోనూ భాషపరంగా ఇబ్బంది పడే అవకాశం ఉందంటున్నారు.

సైబర్ నేరగాళ్లతో బ్యాంకు సిబ్బంది జట్టు!



కాసుల కక్కుర్తితో ఖాతాల విక్రయం

» వేల ఖాతాలు ఫ్రీజ్ అయినా రెట్టింపు సృష్టి

» నకిలీ ఖాతాల కట్టడితోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

» బ్యాంకు ఖాతాలన్నింటిని రీవెరిఫై చేయాలి: సైబర్ నిపుణులు

హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుక్కపిల్ల, సబ్బుబిళ్ల అగ్గిపుల్ల కాదేదీ కవితకు అనర్హమని శ్రీశ్రీ చెప్పినట్లు, సైబర్ నేరగాళ్లు ప్రతి సందర్భాన్ని అవకాశంగా మలుచుకొని మోసాలు చేస్తున్నారు. విదేశాల్లో ఉద్యోగం, పార్ట్‌టైం జాబ్, క్రిప్టో ట్రేడింగ్, లాటరీ, మ్యాట్రిమోని, ఓఎల్ఎక్స్, ప్రత్యేక సందర్భాల్లో ఆఫర్ల పేరుతో ఆశపెట్టి, డిజిటల్ అరెస్ట్ అంటూ భయపెట్టి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. కంటికి కనబడని సైబర్ నేరగాళ్ల లావాదేవీలు మొత్తం ఆన్‌లైన్‌లోనే ఉంటాయి. మోసం చేసిన డబ్బు జమ చేయాలన్నా, క్రిప్టోకి మార్చి బదిలీ చేయాలన్నా బ్యాంకు ఖాతాలు తప్పనిసరి. సైబర్ నేరగాళ్లు మోసాలు చేసేందుకు తమ బ్యాంకు ఖాతాలు వాడరు. కమిషన్ ఆశచూపి బ్యాంకు సిబ్బందితో కుమ్మక్కై తెరిచిన నకిలీ (మ్యూల్) ఖాతాలను సైబర్ మోసాలకు వినియోగిస్తారు. ఈ సందర్భంగా నమోదైన కేసుల్లో పోలీసులు ముందుగా నకిలీ ఖాతాదారులను, వారిచ్చిన సమాచారం మేరకు ఖాతాలను సమకూర్చిన వారిని అరెస్ట్ చేస్తారు. కానీ ఈ దందా నడిపించే ప్రధాన సూత్రధారి మాత్రం దొరకరు. సైబర్ నేరాలు ఆగవు. సైబర్ నేరాలకు ఈ నకిలీ ఖాతాలు చాలా అవసరం. కొందరి అమాయకత్వం, మరికొందరి అత్యాశ, బ్యాంకు సిబ్బంది అవినీతి కారణంగా వేల సంఖ్యలో నకిలీ బ్యాంకు ఖాతాలు సైబర్ నేరగాళ్ల చేతికి చేరుతున్నాయి. బ్యాంకుల్లో నకిలీ ఖాతాలు లేకుండా చేస్తే సైబర్ నేరాలు సింహభాగం తగ్గుతాయని పోలీసు అధికారులు, సైబర్ నిపుణులు చెబుతున్నారు.

కొంటారు లేదంటే.. కమిషన్ ఇస్తారు.. లేదా మోసం చేస్తారు

సైబర్ నేరగాళ్లు తమకు కీలకంగా ఉన్న బ్యాంకు ఖాతాల కోసం పెద్ద మొత్తాలు చెల్లిస్తున్నారు. సైబర్ నేరగాళ్లకు అవసరమైన నకిలీ ఖాతాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అసోంతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో నకిలీ ఖాతాల విక్రయం అధికం. సిమ్‌కు ఓ రేటు, సేవింగ్స్, కరెంట్ ఖాతాకు వేర్వేరు రేట్లు, కేవైసీ పూర్తిచేసి ఫోన్‌పే వంటి యాప్‌లు ఇన్‌స్టాల్ చేసిన బ్యాంకు ఖాతాలను మరో రేటుకు విక్రయిస్తున్నారు. కేవైసీ పూర్తిచేసిన రెడీటు యూజ్ బ్యాంకు ఖాతాలు సైబర్ నేరగాళ్లకు అందుబాటులో ఉన్నాయి. కొంతమంది కమిషన్లకు కక్కుర్తి పడి తమ ఖాతాలు సైబర్ నేరగాళ్లకు ఇస్తున్నారు. మరికొందరు సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ వర్క్ పేరుతో అమాయకులకు చెప్పి, అక్రమ లావాదేవీల్లో భాగస్వాములుగా మారుస్తున్నారు. తెలంగాణలోని ఓ గ్రామంలో యువత సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి వారి లావాదేవీలకు బ్యాంకు ఖాతాలు సమకూర్చిన సంఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది.

ఖాతాలు ఫ్రీజ్ అయినా రెట్టింపు అందుబాటులోకి..

సైబర్ నేరాల ఫిర్యాదు వచ్చినప్పుడు పోలీసుల సూచనల మేరకు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదుతో అధికారులు ఇప్పటి వరకు వేల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేశారు. అయినా దీనికి రెట్టింపు నకిలీ ఖాతాలు మార్కెట్‌లోకి అందుబాటులో ఉన్నాయి. మీడియాకు టీఆర్‌పీల తరహాలో బ్యాంకులకు ఖాతాల సంఖ్య కీలకం. ఈ తరుణంలో బ్యాంకింగ్ రంగంలో పోటీ, టార్గెట్ చేరుకోవడం, బ్యాంకింగ్ సిబ్బంది అవినీతి కారణంగా ఈ నకిలీ ఖాతాలు ఇబ్బడి ముబ్బడిగా పుడుతున్నాయి.

బ్యాంకు ఖాతాలన్నీ రీ వెరిఫికేషన్ చేయాలి

సైబర్ నేరగాళ్లు డబ్బును నకిలీ ఖాతాలకు బదిలీ చేస్తారు. తర్వాత క్రిప్టో కరెన్సీలోకి మార్చి.. విదేశాలకు తరలిస్తారు. సైబర్ మోసాలకు ఈ ఖాతాలు కీలకం. ఇవే లేకుంటే సైబర్ నేరగాళ్ల నడ్డి విరిగిపోతుంది. బ్యాకింగ్ రంగంలోనే సైబర్ నేరాలకు పరిష్కారం ఉంది. దేశంలో ఉన్న అన్ని బ్యాంకుల్లో ఉన్న ఖాతాలను రీ వెరిఫికేషన్ చేయాలి. ఇలా చేస్తే నకిలీ ఖాతాలు దొరికిపోతాయి. వాటిని ఫ్రీజ్ చేసి, ఆర్‌బీఐ నిబంధనల మేరకు కొత్త ఖాతాలు తెరిస్తే నకిలీ ఖాతాల సంఖ్యతోపాటు సైబర్ నేరాలు చాలావరకు తగ్గుతాయి.

- పాటిబండ్ల ప్రసాద్, సైబర్ నిపుణులు



భార్యాభర్తల మధ్య ప్రభుత్వాసుపత్రి చిచ్చు

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి..

» పురుడుకు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లకపోవడంతో భర్త కోపం

» భార్యను కాపురానికి తీసుకెళ్లని వైనం.. ఆందోళనలో బాధితురాలు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పచ్చటి కాపురంలో ప్రభుత్వాసుపత్రి చిచ్చు పెట్టింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పసికందు మృతి చెందడం భార్యాభర్తల మధ్య గొడవలకు దారి తీసింది. భూపాలపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణిని జనవరి 6న ప్రసవం కోసం ఆమె తల్లిదండ్రులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. 7న వైద్యులు ఆ మహిళకు సాధారణ ప్రసవం చేశారు. ఆ మహిళ మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే సాధారణ ప్రసవం చేసే క్రమంలో పసికందు ఆరోగ్యంగా లేకపోవడంతో ఆ ఆసుపత్రి వైద్యులు హుటాహుటిన వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అయితే అక్కడకు చేరేలోపే బాబు మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాబు మృతిచెందాడని బాధితులు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రసవానికి ఆ మహిళ ఇబ్బంది పడుతున్నా వైద్యులు పట్టించుకోకుండా ఇష్టానురీతిగా వ్యవహరించడంతో పసికందు మృతిచెందినట్టు విమర్శిస్తున్నారు. అయితే పసికందు మృతిపై ఆవేదనలో ఉన్న బాధిత మహిళ భర్త, ఆయన కుటుంబసభ్యులు ఆమెపై, ఆమె కుటుంబసభ్యులపై ఆగ్రహంతో ఉన్నారు. పురుడుకు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లకుండా ప్రభుత్వాసుపత్రికి వెళ్లడంతోనే బాబు మృతిచెందాడని అంటున్నారు. ఈ క్రమంలో భర్త, ఆయన కుటుంబసభ్యులు ఆ మహిళను కాపురానికి తీసుకెళ్లకుండా పుట్టింట్లోనే ఉంచారని ఆమె తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు బాగుండడంతోనే తమ కూతురిని అక్కడికి తీసుకెళ్లామని, అయితే వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తనకు మనవడు దక్కలేదని కంటతడి పెట్టింది. గర్భస్థ శిశువు పరిస్థితిని పరీక్షించి ప్రసవం చేస్తే ఈ దారుణం జరిగేది కాదని, ఎంతో సంతోషంగా ఉన్న తమ కూతురి కాపురంలో జీజీహెచ్ చిచ్చుపెట్టిందని ఆమె అంటోంది.

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

- తాజా, మాజీ ఎమ్మెల్యేల మధ్య టెంపుల్ వార్
- స్వాధీనం చేసుకోవాలంటూ ఎండోమెంట్‌కు ఎమ్మెల్యే లేఖ
- సవాల్ చేస్తూ కోర్టుకెక్కిన మాజీ ఎమ్మెల్యే
- ప్రభుత్వ భూమిలో అక్రమంగా కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే ఆక్షేపణ
- భూపాలపల్లి జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన వివాదం



భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయం

(భూపాలపల్లి, ఆంధ్రజ్యోతి)

అధికార విపక్ష పార్టీల మధ్య ఆలయ వివాదం కాస్త రాజకీయ రంగు పులుముకుంటోంది. భూపాలపల్లి జిల్లాలో రాజకీయంగా బద్ధ శత్రువులుగా కొనసాగుతున్న తాజా, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, వెంకటరమణారెడ్డిల మధ్య వెంకటేశ్వర ఆలయ వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే వెంకట్రమణారెడ్డి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూమిలో చేపట్టిన ఈ నిర్మాణానికి అనుబంధంగా ఆలయ నిర్వహణ ఖర్చుల కోసమంటూ పక్కనే వాణిజ్య భవన సముదాయం నిర్మాణ పనులను కూడా చేపట్టారు. అయితే ఈ కాంప్లెక్స్ ద్వారా వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే వర్గం వ్యూహాత్మకంగా పావులు కదుపుతోందని ప్రస్తుత ఎమ్మెల్యే భావించారు. ప్రభుత్వ నిధులు, ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఈ ఆలయాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలంటూ దేవదాయ శాఖకు లేఖ రాయడంతో రెండు పార్టీల మధ్య ఈ ఆలయం వివాదాస్పదంగా మారింది. దీంతో ప్రస్తుతం ఈ అంశం భూపాలపల్లి నియోజకవర్గంలో రాజకీయంగా హాట్ టాపిక్ అయ్యింది. భూపాలపల్లి పట్టణంలోని మంజూరునగర్ ప్రాంతంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి దేవుళ్లతో రాజకీయాలు చేస్తున్నారంటూ ఇరు పార్టీల నేతలు పరస్పర విమర్శలకు దిగడంతో ఈ వ్యవహారం జిల్లాలో వేడిని రాజేస్తోంది.



వివాదానికి కేంద్రబిందువుగా నిలిచిన భవన సముదాయం ఇదే...

ఏమిటీ వివాదం?

భూపాలపల్లి- హనుమకొండ జాతీయ రహదారిపై మంజూరునగర్ శివారులోని గోరంట్ల చెరువు శిఖం సర్వే నంబర్ 209లో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో వెంకటేశ్వర స్వామి ఆలయం, కాంప్లెక్స్ నిర్మాణాన్ని 2021లో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందుకుగాను డీఎంఎఫ్‌టీ నుంచి రూ.2.30కోట్లు ప్రతిపాదించగా సుమారు రూ. 1.50కోట్ల ఖర్చు చేశారు. అలాగే మరో రూ. 2 కోట్ల సీజీఎఫ్ నిధులను కూడా ఆలయం కోసం వెచ్చించారు. ఆలయ అభివృద్ధి పనులు జరుగుతుండగానే 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గండ్ర వెంకటరమణారెడ్డి ఓటమిపాలయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన గండ్ర సత్యనారాయణరావు ఈ వ్యవహారాన్ని నిశితంగా గమనిస్తూ ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిధులను వెచ్చించి ఆలయ నిర్మాణం చేపట్టినందున దీనిని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలంటూ ఎండోమెంట్ అధికారులకు లేఖ రాశారు. ఆలయ నిర్వహణతో పాటు కాంప్లెక్స్ నిర్మాణం వెనక ఇతర దురుద్దేశాలు ఉన్నాయన్న అనుమానంతో ప్రస్తుత ఎమ్మెల్యే ఒత్తిడి తేవడంతో ఇటీవల దేవాదాయ శాఖ అధికారులు సందర్శించి ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నట్లు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆగ్రహించిన బీఆర్ఎస్ నేతలు గండ్ర వెంకటరమణారెడ్డి నేతృత్వంలో ఆలయ సమీపంలో ఆందోళనకు దిగారు. దీంతోపాటు దేవాదాయ శాఖ అధికారుల నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆలయ వివాదంపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

దేవుడితో రాజకీయమా?

ప్రజల డిమాండ్ మేరకు ప్రభుత్వ భూమిలో వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాం. ఆలయంలో పనిచేసే అర్చకులకు భత్యం, సిబ్బందికి వసతి సదుపాయాలు, పూజ కార్యక్రమాలకు ఖర్చుల నిమిత్తమే పక్కన కాంప్లెక్స్ నిర్మిస్తున్నాం. రాజకీయంగా నాకు మైలేజ్ వస్తుందన్న అక్కసుతోనే ప్రస్తుత ఎమ్మెల్యే దీన్ని వివాదాస్పదం చేసి ఎండోమెంట్ స్వాధీనం చేసుకోవాలని లేఖ రాసినట్లుగానే భావిస్తున్నాం. అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ ఫైల్ చేశాం.

- గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఎండోవ్‌మెంట్ పర్యవేక్షణలో నిర్వహణ జరగాలి

మంజూర్‌నగర్‌లో ప్రభుత్వ భూమిలో, ప్రభుత్వ నిధులతో ఎలాంటి మునిసిపల్ అనుమతులు లేకుండా వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించినందున నిబంధనల మేరకు ప్రభుత్వమే దీనిని దేవాదాయ శాఖకు స్వాధీనం చేసి నిర్వహణను పర్యవేక్షించాలని లేఖ రాశాం. ఆలయ కాంప్లెక్స్ నిర్వహణ సహా ఆలయానికి సంబంధించిన వ్యవహారాలన్నీ ఎండోమెంట్ అధికారులే నిర్వహిస్తే పారదర్శకంగా ఉంటుంది.

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్యే

ములుగును మావోయిస్టు రహిత జిల్లాగా మార్చాలి

హోంగార్డు అడిషనల్ డీజీపీ స్వాతిలక్రా



సమావేశంలో సూచనలు చేస్తున్న స్వాతిలక్రా

ములుగు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాను మావోయిస్టు రహితంగా మార్చాలని, గ్రామీణప్రాంత యువత మావోయిస్టు భావజాలానికి లోనుకాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ అదనపు డీజీపీ స్వాతిలక్రా అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లాకు వచ్చిన ఆమె జాకారం డీటీసీ, ఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని డాగ్ స్క్వాడ్, జిల్లా పోలీసు కార్యాలయాలను పరిశీలించారు. ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో పోలీసు అధికారులతో సమీక్ష జరిపారు. శాంతిభద్రత పరిరక్షణపై ఎస్పీ శబరీశ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలని స్వాతిలక్రా అన్నారు. మావోయిస్టు కార్యకర్తలపై నిత్యం నిఘా ఉంచాలని తెలిపారు. లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరిస్తున్న తీరును ప్రశంసించారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటైన షీటీమ్స్ పట్ల ప్రజలను చైతన్యవంతులను చేయాలని, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత నిస్తూ సున్నితంగా వ్యవహరించాలని తెలిపారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి వెంటనే సంఘటనా ప్రదేశానికి చేరుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం స్టేషన్‌ల వారీగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో ట్రాఫిక్, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్‌పట్ల అవగాహన తీసుకురావాలని సూచించారు. ప్రతీ కళాశాలలో సేఫ్టీ ఉమెన్, యాంటీ ర్యాగింగ్ కమిటీలు, క్లబ్‌లను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం నిరంతర తనిఖీలు కొనసాగించాలని, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్, ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, ఆయా సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

హాస్టల్‌కు వెళ్లనని విద్యార్థిని ఆత్మహత్య

- బావిలో దూకి బలవన్మరణం
- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రాంధాన్ తండాలో ఘటన



నందిని, మృత దేహం వద్ద రోదిస్తున్న బంధువులు



నందిని (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ వెళ్లి చదువుకోమని తల్లిదండ్రులు చెబితే, హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేని విద్యార్థిని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని రాంధాన్ తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని రాంధాన్ తండాకు చెందిన గుగులోతు కాంతమ్మ ధనుంజయ్‌లకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు శ్రీకాంత్, రెండో కుమారుడు చరణ్ కాగా, చిన్న కుమార్తె గుగులోతు నందిని(12) పర్వతగిరిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 7వ తరగతి చదువుతోంది. సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులపై ఇంటికి వచ్చిన నందిని హాస్టల్ వెళ్లనని చాలా రోజుల నుంచి మారాం చేస్తోంది. దీంతో తల్లిదండ్రులు వెళ్లాలని ఒత్తిడి చేయడంతో మనస్థాపానికి గురై తండా శివారులోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. జనవరి 30వ తేదీన సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడగా, తల్లిదండ్రులు తమ కూతురు కనిపించడంలేదని తండా చుట్టూ పక్కల వెతికారు. కానీ, ఆచూకీ లభించలేదు. బావి దగ్గర ఉండే ఓ రైతు బావి వద్ద కనిపించిందని తెలిపాడు. శుక్రవారం బాలిక మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కస్తూర్బా బాలికల పాఠశాలల్లో
దేశ్‌పాండే ఫౌండేషన్ సేవలు

- సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన ప్రతినిధులు
- పాలమూరు మహిళా డిగ్రీ కాలేజీ దత్తతకు అంగీకారం

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఆంగ్లంలో శిక్షణ ఇవ్వడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పు కోసం పని చేస్తున్న దేశ్‌పాండే ఫౌండేషన్ రాష్ట్రంలో తన సేవలను అందించనుంది. అమెరికా కేంద్రంగా భారత్‌లోని పలు రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్న ఈ సంస్థకు చెందిన ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో తమ కార్యక్రమాల విస్తరణకు సహకారం అందించాలని సీఎంను కోరారు. తెలంగాణలోని కస్తూర్బా బాలికల పాఠశాల్లో సేవలు అందించాలని, మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను దత్తత తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి సూచించగా.. వారు వెంటనే అంగీకరించారు. కస్తూర్బా బాలికల పాఠశాలల్లోని విద్యార్థినులకు నైపుణ్యాలతో పాటు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించేందుకు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు గురురాజ్ దేశ్‌పాండే, జయశ్రీ దేశ్ పాండే పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్‌లో జీసీసీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నైపుణ్య కేంద్రాలు:దుద్దిళ్ల

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను 'స్కిల్స్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా తీర్చిదిద్దేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో 'డార్క్ మేటర్ టెక్నాలజీస్' పేరిట కెనడాకు చెందిన "కన్సల్టేషన్ సాఫ్ట్‌వేర్" ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జీసీసీలు భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయని, ఈ ఏడాది వాటి విలువ 46 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లుగా ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారన్నారు. వచ్చే ఏడాది 60 బిలియన్ డాలర్లు, 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల మార్క్ దాటుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం జీసీసీలపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంలో వీటిని భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను జీసీసీల హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే 400 జీసీసీలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.

సింగరేణి సీఎండీ డిప్యుటేషన్ ఏడాది పొడిగింపు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ డిప్యుటేషన్‌ను కేంద్రప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. 2010 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి అయిన బలరామ్ గత ఐదేళ్లుగా సింగరేణిలో పని చేస్తున్నారు. డైరెక్టర్(ఫైనాన్స్)గా ఉన్న ఆయనను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది జనవరి 1వ తేదీ నుంచి సింగరేణి సీఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. తాజాగా ఆయన డిప్యుటేషన్‌ను 2024 డిసెంబరు 4 నుంచి ఏడాది పొడిగిస్తూ కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఉత్తర్వులు వెలువరించింది.

వ్యవసాయ వర్సిటీకి..
రిజిస్ట్రార్, ఉన్నతాధికారుల నియామకం

రాజేంద్రనగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా డాక్టర్ జి.ఇ.సీహెచ్ విద్యాసాగర్ నియమితులయ్యారు. ఆయనతో పాటు వర్సిటీలోని పలు విభాగాలకు ఉన్నతాధికారులను వర్సిటీ పాలక మండలి నియమించింది. గురువారం జరిగిన వర్సిటీ పాలకమండలి సమావేశంలో ఆమోదం తీసుకున్న తర్వాత శుక్రవారం వారికి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పదవులు దక్కిన అధికారులందరూ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీరంతా మూడేళ్లు ఈ పదవుల్లో కొనసాగుతారు.

మంత్రి పొన్నంతో బీసీ కమిషన్ భేటీ

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం అయింది. శుక్రవారం కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, సచివాలయంలో మంత్రిని కలిశారు. కమిషన్ జిల్లాల పర్యటన వివరాలను, కులాల పేర్ల మార్పుపై వచ్చిన ప్రతిపాదనలపై వారు మంత్రితో చర్చించారు. ఉమ్మడి 10 జిల్లాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సెంట్రల్ ఓబీసీ జాబితాలో లేని 40 కులాలను జాబితాలో చేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

గురుకులాల్లో ఆహారనాణ్యతకు ఎన్ఐఎన్ సహకారం

గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో ఆహార భద్రతతో పాటు నాణ్యత ప్రమాణాలను పెంపొందించేందుకు హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్) సహకారం తీసుకోనుంది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్య సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 268 గురుకుల విద్యాసంస్థలున్నాయి. వీటిలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు దాదాపు 1.70 లక్షల మంది విద్యార్థులున్నారు. వీరికి ప్రతిరోజు భోజనంతో పాటు అల్పాహారం అందించే కార్యక్రమం ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించింది. రాష్ట్రంలో ఇటీవల కొన్నిచోట్ల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, కొన్నిచోట్ల ఆహార నాణ్యత లోపించిందని ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎన్ఐఎన్ సహకారంతో ఆహార భద్రతతో పాటు నాణ్యత ప్రమాణాలు పెంపొందించాలని నిర్ణయం తీసుకుంది.

ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్
అడ్మిన్‌గా ఎస్.తిరుమల బాధ్యతలు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అడ్మినిస్ట్రేషన్ విభాగం చీఫ్ ఇంజనీర్‌గా (సీఈ, అడ్మిన్) ఎస్.తిరుమలను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తిరుమల చీఫ్ టెక్నికల్ ఎగ్జామినర్ (సీటీఈ) బాధ్యతల్లోనూ ఉన్నారు. ఇప్పటివరకు ఆర్ అండ్ బీ ఇంజనీర్ ఇన్ చీఫ్, అడ్మిన్ సీఈ పోస్టులో ఉన్న పి.మధుసూదన్‌రెడ్డి శుక్రవారమే పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం అడ్మిన్ సీఈ పోస్టును భర్తీ చేసిన ప్రభుత్వం.. శాఖలో కీలకమైన ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టును ఖాళీగానే ఉంచింది. ఇందుకు రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడమే కారణంగా కనిపిస్తోంది. మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోనుంది. శాఖలోని రూరల్ రోడ్ల విభాగం చీఫ్ ఇంజనీర్ పోస్టులో ప్రస్తుతం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉన్న డి.శ్యామ్‌కుమార్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. అలాగే ఎస్సీ ఎస్‌డీఎఫ్, ఎస్టీ ఎస్‌డీఎఫ్ బాధ్యత కూడా అప్పగించారు. ప్రస్తుతం ప్లానింగ్, టెర్రిటోరియల్ ఇన్‌చార్జ్ సీఈగా ఉన్న టి.జయభారతికి వామపక్ష తీవ్రవాద ప్రాంతాల బాధ్యతలను, బిల్డింగ్స్ ఇన్‌చార్జ్ సీఈగా ఉన్న బి.రాజేశ్వరరెడ్డికి రైల్వే భద్రత పనులు సహా మరికొన్ని బాధ్యతలను అప్పగించారు. టెర్రిటోరియల్-2, నాణ్యత విభాగం చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న జి.చిన్నపుల్లదాస్‌కు టెండర్ల కమిషనరేట్ సభ్యుడిగా బాధ్యతలు కట్టబెట్టారు. ఆర్ అండ్ బీలోని జాతీయ రహదారుల (ఎన్‌హెచ్)విభాగానికి కూడా ప్రభుత్వం పూర్తిస్థాయి అధికారిని నియమించలేదు. ప్రస్తుతం ఈ పోస్టు కూడా ఖాళీగానే ఉంది.

ఉస్మా'నయా' ఆస్పత్రిలో హెలీప్యాడ్

- ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా స్కైవాక్ నిర్మాణం
- 2700 కోట్లతో నూతన ఆస్పత్రి భవనం
- శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- 41 ఆపరేషన్ థియేటర్లు, 2 వేల పడకలు
- 500 పడకలతో ఐసీయూ..
- మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో రోగిని తరలించడానికి వీలుగా కొత్తగా నిర్మించనున్న ఉస్మానియా ఆస్పత్రి ఆవరణలో హెలీప్యాడ్ రానుంది. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఆస్పత్రికి చేరుకునేందుకు స్కైవాక్ కూడా ఏర్పాటు కానుంది. నాలుగు దిక్కుల విశాలమైన రోడ్లతో ఆధునిక వసతులతో కొత్త ఆస్పత్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీసు స్టేడియంలో శుక్రవారం కొత్త ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం.. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆస్పత్రి నిర్మాణ వివరాలను మీడియాకు వెల్లడించారు. రూ.2700 కోట్లతో నిర్మించే ఈ ఆస్పత్రిని రెండున్నరేళ్ల నుంచి మూడేళ్లలో పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. 26.30 ఎకరాల్లో విశాలమైన ప్రాంగణంలో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రిలో 1168 పడకలు ఉన్నాయని, కొత్త ఆస్పత్రిలో 2 వేల



పడకలు అందుబాటులో ఉంటాయని, ఇందులో 500 పడకల సామర్థ్యంతో ఐసీయూను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం 22 వైద్య విభాగాలు ఉండగా.. వాటిని 30కి పెంచుతున్నామని చెప్పారు. సుమారు 41 ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలోనే డెంటల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కాలేజీలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు, ఫ్యాకల్టీకి అధునాతన వసతులతో కూడిన హాస్టల్ సదుపాయం, 750 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం, క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 3 వేల వాహనాలు ఒకేసారి పార్కింగ్ చేసుకునేలా అండర్ గ్రౌండ్ పార్కింగ్ సిస్టమ్ ఉంటుందన్నారు. రాబోయే వందేళ్ల ప్రజలు గుర్తుంచుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతికతతో ఆస్పత్రి నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. 1919 నుంచి వందేండ్లకు పైగా ఇక్కడి ప్రజలకు ఉస్మానియా ఆస్పత్రితో అనుబంధం ఉందని, ఇక్కడి వాళ్లకు ఆస్పత్రిని దూరం చేయకుండా ఇక్కడే నిర్మిస్తున్నామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అడ్మినిస్ట్రేషన్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలనే యోచన చేస్తున్నామని, ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలోనే ఈ విధానం ఉందని మంత్రి దామోదర తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థ ఎక్కువగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉంటుందని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో అందరికీ బాధ్యతలు అప్పగించి ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయనున్నామని ఆయన చెప్పారు. శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కట్టె లేకుండా నిలబడు చాలు!

(మొదటిపేజీ తరువాయి)

మాట ఇచ్చి ఎండబెట్టి దుర్మార్గుడు. ఏడాది కూడా కాకముందే ఆయన కోసం ప్రజలు ఏడుస్తున్నారట! నీకోసం ఎవరూ బాధపడడం లేదు. నువ్వు బలంగా కొట్టడమేమోగానీ.. కట్టె లేకుండా నిలబడు చూద్దాం. 14 నెలలు ఫామ్‌హౌస్‌లో ఉంటూ గంభీరంగా చూస్తున్నానంటున్నావ్. ఏం చూస్తున్నావ్? అచ్చోసిన ఆంబోతుల్లా కొడుకును, అల్లుడిని ప్రజల మీదకు వదిలావ్. వారు ఊరిమీద పడి మేస్తున్నరు. వారిని అదుపులో పెట్టుకో. నేను మీలా మాట ఇచ్చి మడమ తిప్పను. హామీలు ఇచ్చి ఎగ్గొట్టను. అబద్ధాలు చెప్పడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో మీకు గుండు సున్నా. అయినా మీలో మార్పురాలేదు" అని రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు.



రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలలో సరస్వతి దేవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజలకు పంగనామాలు పెట్టారు..

దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతోపాటు అనేక హామీలు ఇచ్చి ప్రజలకు పంగనామాలు పెట్టిన చరిత్ర కేసీఆర్‌ది అని సీఎం రేవంత్ ఆరోపించారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. "నువ్వు అసెంబ్లీకి వస్తే అన్నీ మాట్లాడకుందాం. అడిగిన లెక్కలన్నీ చెబుతా. మేము మాట తప్పం.. మడమ తిప్పం. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు, కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాం. నిరుద్యోగ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆరు నెలల్లోనే 55,143 ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. పదేళ్లలో బీఆర్ఎస్ ఇవ్వలేనన్ని ఉద్యోగాలు ఏడాదిలోనే ఇచ్చాం" అని సీఎం అన్నారు. వీటన్నింటిపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని చెప్పారు. తమ నేత రాహుల్‌గాంధీ 'భారత్ జోడో' యాత్రలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టి తొలిసారి బీసీల లెక్కలు తేల్చామన్నారు. కులగణన నివేదిక శనివారం రానుందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదికతో పాటు కులగణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడతామన్నారు.

రాఖీ సావంత్‌కూ లైక్‌లు వస్తాయి..

కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల నోటు లాంటి వారని, కాలం చెల్లిన నోట్లను జేబులో పెట్టుకుని తిరుగుతామా? అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను తెలంగాణ సమాజంలో అడిగేటోళ్లే లేరని, ఫామ్‌హౌస్‌లో ఉన్న ఆయనకు ప్రజలతో సంబంధాలు తెగిపోయాయని అన్నారు. ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ మారలేదని విమర్శించారు. "సోషల్ మీడియాలో కేసీఆర్‌కు, నాకు పోటీ పెడితే.. నాకంటే కేసీఆర్‌కు ఎక్కువ లైక్‌లు వచ్చాయంటున్నారు. కేంద్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్.. సోషల్ మీడియా, టిక్‌టాక్‌లో లైక్‌లు చూసి సంబరపడుతున్నారు. దీనిని బట్టి ఆయన మానసిక స్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో సల్మాన్‌ఖాన్‌కు, రాఖీ సావంత్‌కు సోషల్ మీడియాలో పోటీ పెడితే.. రాఖీ సావంత్‌కే ఎక్కువ లైక్‌లు వచ్చాయి. అంతమాత్రాన సల్మాన్‌ఖాన్ గొప్పనటుడు కాకుండా పోతారా? ఆయన (కేసీఆర్) పెద్దమనిషి. ఆయన్ను నేను ఏమీ అనడం లేదు. ఊరిమీద పడి అరుస్తున్న తన అల్లుడిని, కొడుకును కంట్రోల్‌లో పెట్టుకోవాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం..

విద్యారంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందుకే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఈ పాఠశాల 150 ఏళ్ల వేడుకల్లో పాల్గొనే అవకాశం రావడం తన భాగ్యమన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, పాలమూరు బిడ్డ బూర్గుల రామకృష్ణారావుతోపాటు రాజకీయ ఉద్దండులు మర్రి చెన్నారెడ్డి, యూపీ మాజీ గవర్నర్ సత్యనారాయణరెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస రావు, పౌరహక్కుల సంఘం నేత హరగోపాల్ వంటి ప్రముఖులు చదువుకున్న పాఠశాల చరిత్ర ఎంతో ఘనమైనదని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందనే విషయాన్ని తాను బలంగా నమ్ముతానని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే ఈ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడమే కాకుండా భారీగా నిధులు కేటాయించామని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ బడ్జెట్ రూ.21 వేల కోట్లకు పెంచామని, గతంలో ఏడు శాతం ఉండగా 11 శాతానికి తీసుకువచ్చామని తెలిపారు. రాబోయే రోజుల్లో 15 శాతం కేటాయిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించే విషయంపై ఉపాధ్యాయులు కొంత ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎవరిపైనా ఆరోపణలు చేయడం లేదంటూనే.. లోపాలను సవరించుకుందామన్నారు. "విద్యారంగంలో గణాంకాలు చూసినపుడు చిన్న చిన్న అంశాలు ఆశ్చర్యం, బాధ కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో 30 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 24 లక్షల మంది పిల్లలు చదువుతుండగా, 12,500 ప్రైవేటు స్కూళ్లలో 30 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేటు స్కూళ్లలో చదువు చెప్పే టీచర్లు మీ కంటే గొప్పగా చదువుకున్నవారు కాదు. కానీ, ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల ఫలితాలు చూసినపుడు బాధ వేస్తుంది. ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు ఈ విషయంలో ఆలోచించాలి. పాఠశాలలు అయిపోయిన తరువాత విద్యార్థుల టాలెంట్ వెలికితీసి.. మేలి రత్నాలను తయారు చేయాలి." అని సీఎం అన్నారు. మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదామన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ పాఠశాల గొప్పదనాన్ని తన దృష్టికి తీసుకురావడంతో అభివృద్ధి కోసం రూ.16 కోట్లను మంజూరు చేశానని తెలిపారు.

క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు..

జాతీయోద్యమ సమయంలో యువత కోసం మహాత్మాగాంధీ 1921-31 వరకు యంగ్ ఇండియా పత్రిక నిర్వహించారని, ఆయన స్ఫూర్తితో రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రారంభించామని సీఎం రేవంత్ తెలిపారు. క్రీడల్లో కూడా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని చెప్పారు. ఇక వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని సీఎం పిలుపునిచ్చారు.

తెలంగాణ విద్యా చరిత్రలో మొగిలిగిద్ద పాఠశాల ఓ జ్ఞాపకం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యా చరిత్రలో మొగిలిగిద్ద పాఠశాల చెక్కు చెదరని జ్ఞాపకమని సీఎం రేవంత్‌పేర్కొన్నారు. ఆ పాఠశాలను సందర్శించినప్పుడు రాష్ట్రంలోని తండాలు, గూడేలు, మారుమూల పల్లెల నుంచి విద్యావ్యవస్థను పునరుద్ధరించుకోవాలన్న తన సంకల్పానికి ఒక స్ఫూర్తిగా అనిపించిందంటూ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 150 ఏళ్లగా విద్యా చైతన్యాన్ని వెదజల్లుతున్న మొగిలిగిద్ద పాఠశాలకు, దశాబ్దాలుగా అందుకు సహకరిస్తూ వస్తున్న ప్రతీ ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు చెప్పారు.

రైతు భరోసా కోత..
2.2 లక్షల ఎకరాలకే

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కో దఫా రూ.7,500 కోట్లు అయ్యేది. ఇప్పుడు దాని కంటే దాదాపు రూ.1,494 కోట్లు అదనంగా ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుందని అంచనా. వ్యవసాయ యోగ్యం కాని కొండలు, గుట్టలు, లేఔట్లు వేసిన భూములు, ప్రభుత్వాలు ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు ఎక్కువగానే ఉన్నా అవన్నీ రెవెన్యూ రికార్డులో అప్‌డేట్ కాలేదు. దీనివల్లే సాగు యోగ్యంకాని భూముల సంఖ్య పెద్దగా లెక్కల్లోకి రాలేదని అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు సాగు యోగ్యం కాని భూముల సర్వే ఈ నెలాఖరు వరకు కూడా కొనసాగనుంది. ఒకవైపు రైతు భరోసాకు అర్హులైన వారికి డబ్బు జమచేస్తూనే ఈ సర్వేను కూడా కొనసాగిస్తారు. మరోవైపు శనివారం నుంచి రైతుల ఖాతాల్లో రైతుబంధు సొమ్ము జమ అయ్యే అవకాశాలున్నాయి. తొలుత ఒక ఎకరం, తర్వాత రెండెకరాలు తర్వాత మూడెకరాలు.. ఇలా దశల వారీగా జమ చేస్తారు. ఈ రైతు బంధు నిధులకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి శనివారం నాడు సమీక్ష చేయనున్నారు. ఈ సమీక్షలో నిధుల విడుదలకు సంబంధించి తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంకండి

- జెడ్పీ సీఈవో, డీపీవోలతో పీఆర్ డైరెక్టర్ సృజన
- ఎన్నికల అధికారులు, సిబ్బంది జాబితా రూపొందించాలని సూచన

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారులు(సీఈవో), జిల్లా పంచాయతీ అధికారులకు(డీపీవో) పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన సూచించారు. ఈమేరకు ఎన్నికల అంశంతో పాటు గ్రామపంచాయతీల్లో ప్రజా సమస్యలు, పారిశుద్ధ్య చర్యలపై శుక్రవారం ఆమె తన కార్యాలయం నుంచి జెడ్పీ సీఈవోలు, డీపీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఎప్పుడైనా నిర్వహించే అవకాశం ఉందని.. పంచాయతీరాజ్ శాఖ తరపున అధికారులు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది జాబితాలను రూపొందించాలన్నారు. ఎక్కడైనా కోర్టు కేసులు ఎన్నికలకు అడ్డంకిగా మారే అవకాశం ఉంటే తనకు తెలియజేయాలన్నారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఎంపీటీసీ స్థానాల గుర్తింపు, వాటిపై అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలపై డీపీవోలు ఆకస్మిక తనిఖీలు జరపాలని, ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాలను తక్షణం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు.

కేంద్రం మిథ్య!

- రాష్ట్రాలు కలిస్తేనే దానికి ఉనికి
- గద్దరన్నకు అవార్డు ఇవ్వకపోగా కించపరుస్తారా?: సీఎం రేవంత్
- ఉగాదికి గద్దర్ సినిమా అవార్డులు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముద్దుబిడ్డ గద్దరన్నకు రాష్ట్ర ప్రభుత్వం పద్మ భూషణ్ సిఫార్సు చేస్తే తిరస్కరించడమే కాకుండా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆయన మీద అవాకులు చవాకులు పేలడం దుర్మార్గమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాలుగా దేనికదే విడిపోతే కేంద్రం ఒక మిథ్య అని రేవంత్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాల కలయికే కేంద్రం అని చెప్పారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను కేంద్రం గౌరవించక పోవడంపై నిరసన వ్యక్తం చేస్తే దానికి సమాధానం ఇవ్వడం పోయి గద్దర్‌ను కించపరుస్తూ మాట్లాడి మంత్రి తెలంగాణను అవమానించారన్నారు. గద్దరన్నకు వ్యతిరేకంగా గానీ, గద్దరన్న గౌరవాన్ని కించపరిచేలా గానీ బీజేపీ నాయకులు మరొకసారి మాట్లాడితే, ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఉన్న వీధికి గద్దర్ పేరు పెట్టి, రోజూ చిరునామాలో రాసుకుంటూ ఆయన నామ స్మరణ చేసుకొనేట్లు చేస్తామని హెచ్చరించారు. "పద్మ అవార్డులు బీజేపీ చేతిలో ఉన్నాయి కాబట్టి ముఖ్యమంత్రి ఏం చేయగలడులే అనుకుంటున్నారేమో, మీ రాష్ట్ర కార్యాలయం గద్దరన్న పుట్టిన రాష్ట్రంలో ఉందన్న సంగతి మర్చిపోవద్దు. ప్రతి దానికి మా దగ్గర మందు ఉంది" అని వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకత్వానికి అంత అహంకారం పనికిరాదన్నారు. గతంలో గద్దర్‌ను ఇదే విధంగా గేటు బయట కూర్చోబెట్టిన పాపానికి ఒకాయన ఇప్పుడు గేటు దగ్గర కూర్చోని తనను ఎవరు పలకరిస్తారా? అని ఎదురు చూస్తున్నాడని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏదో ఒక రోజు ఓట్ల విప్లవంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొట్టుకుపోతుందని, అప్పుడు రాహుల్‌గాంధీకి చెప్పి గద్దర్‌ను ఇంకా ఘనంగా గౌరవించుకుంటామని అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఆయన 77వ జయంతి ఉత్సవాలు శుక్రవారం రవీంద్ర భారతిలో జరిగాయి. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, నమ్మిన సిద్ధాంతానికి నిబద్ధుడై సమ సమాజ సాధన కోసం తుది శ్వాస వరకు పోరాడిన గద్దరన్నను ఒక సైద్ధాంతిక వ్యక్తిగానే చూడాలని అన్నారు. ఆయన విప్లవ సిద్ధాంతంతో తాము కూడా విభేదిస్తున్నప్పటికీ ఆ సిద్ధాంతమే అసలు ఉండకూడదనే ధోరణిని ఖండిస్తున్నానని చెప్పారు. గద్దర్‌కు పద్మ భూషణ్ తో పాటు పద్మశ్రీ పురస్కారానికి చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు పేర్లను తెలంగాణ నుంచి ప్రతిపాదించామని సీఎం తెలిపారు. ఈ ఐదుగురిలో ఏ ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదని గుర్తు చేశారు. వారిలో తమతో రాజకీయంగా విభేదించిన గోరటి వెంకన్న లాంటి వారు కూడా ఉన్నారన్నారు. వారెవరూ అడగకుండానే తెలంగాణ సమాజానికి చేసిన సేవలను దృష్టిలో ఉంచుకొని తన బాధ్యతగా సిఫార్సు చేశామని తెలిపారు. పక్క రాష్ట్రంలో ఐదుగురికి పద్మ అవార్డులు ఇచ్చారని, ఈ ఐదుగురు తెలంగాణ బిడ్డలు ఆ ఐదుగురి కన్నా ఏ రకంగా తక్కువని ప్రశ్నించారు. బీజేపీతో ఉన్నవాళ్లను సత్కరిస్తాం, విభేదించిన వారిని దూరం పెడతాం అన్న సంస్కృతి సరి కాదని చెప్పారు. పాశం యాదగిరి తమను ఇష్టానుసారంగా తిడుతుంటారని, అయినా తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తించి గౌరవించుకున్నామని ప్రస్తావించారు. నెక్లెస్ రోడ్డులో గద్దర్ స్మారక సభామందిరంతో పాటు మ్యూజియం నిర్మాణం చేపడతామని గతేడాది ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గద్దర్ తనయుడు సూర్యం స్మారక నిర్మాణం తాలూకు డిజైన్‌ను సీఎంకు సభాముఖంగా నివేదించారు. మంత్రివర్గ సహచరులతో చర్చించి త్వరలోనే ఆచరణలోకి తెస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గద్దర్ విశ్వమానవుడు అన్నారు. గద్దర్ ఈ నేల మీద పుట్టడం తెలంగాణ అదృష్టం అని చెప్పారు.ఈ ఉగాదికి చరిత్రలో నిలిచిపోయే విధంగా గద్దర్ తెలంగాణ సినిమా అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించుకోబోతున్నామని భట్టి ప్రకటించారు. ఆ బాధ్యతను ముఖ్యమంత్రి తనకు అప్పగించారన్నారు. సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, కె.శ్రీనివాస్, మాజీ ఐఏఎస్ కాకి మాధవరావు, ఎమ్మెల్సీలు కోదండరాం, గోరటి వెంకన్న, గద్దర్ భార్య విమల, తెలంగాణ సాంస్కృతిక సారధి వెన్నెల, కంచె ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ సమక్షంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పాట - ఆట తో సభను ఉర్రూతలూగించారు. డోలు, డప్పు లేవని గోరటి ఇబ్బంది పడుతుంటే ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని డప్పు కళాకారులను పిలిపించారు.



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు భట్టి, జూపల్లి

అమరుల స్థూపం అంబేడ్కర్ విగ్రహంలో
అవినీతి జరిగిందా?

- వంద శాతానికి మించి అంచనాలు పెంపు
- నిర్మాణాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశం

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అమరుల స్థూపం, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణాల్లో అవినీతి, అవకతవకలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం అనుమానిస్తోంది. అంచనాలను భారీగా పెంచడమే కాకుండా నిర్మాణ నాణ్యతలోనూ రాజీ పడ్డారని గమనించింది. ఈ రెండింటిపైనా విజిలెన్స్ విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సచివాలయంతో పాటు, నెక్లెస్ రోడ్‌లో 125 అడుగుల ఎత్తులో అంబేడ్కర్ విగ్రహం, సచివాలయం ఎదురుగా అమరుల స్థూపాన్ని నిర్మించింది. సచివాలయ నిర్మాణం విషయంలోనూ అంచనాలకు మించి భారీగా ఖర్చు పెట్టారని తేలడంతో ఇప్పటికే దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. తాజాగా అంబేడ్కర్ విగ్రహం, అమరుల స్థూపం నిర్మాణాల విషయాల్లోనూ వాస్తవ లెక్కలు తేల్చాలని విజిలెన్స్‌ను ఆదేశించారు. అంబేడ్కర్ విగ్రహం, అమరుల చిహ్నం రెండింటి నిర్మాణాన్నీ ఒకే సంస్థ చేపట్టింది. 2016 ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి నాడు అప్పటి సీఎం కేసీఆర్ ఎన్టీఆర్ గార్డెన్ పక్కన స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఆరేండ్ల తరువాత 2023 ఏప్రిల్ 14న విగ్రహాన్ని ఆవిష్కరించారు. మొదట నిర్మాణానికి రూ.104 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. తర్వాత ధరలు పెరిగాయని మరో రూ.60 కోట్లు చేర్చారు. నిర్మాణం పూర్తయ్యే నాటికి రూ.164 కోట్లుగా ఖరారు చేశారు. ఆ తర్వాత మరికొంత మొత్తాన్ని అదనంగా ఖర్చు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. విగ్రహాన్ని 11.80 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. విగ్రహమే 2 ఎకరాల్లో ఉంది. విగ్రహం, పీఠం కలిపి 125 అడుగుల ఎత్తులో ఉన్నాయి. నిర్మాణానికి 360 టన్నుల స్టీలును, 114 టన్నుల ఇత్తడిని ఉపయోగించారు. 2017లో లుంబిణి పార్కు సమీపంలో అమరుల స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొదట రూ.80 కోట్లయితే సరిపోతుందని చెప్పారు. పూర్తయ్యే దశకు రూ.160 కోట్లన్నారు. ప్రారంభోత్సవం నాటికి ఖర్చు 180 కోట్లుగా తేల్చారు. అంటే, అంచనాలు రెండుసార్లు మారాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థూపానికి సంబంధించి దేనికెంత ఖర్చు చేశారో సమగ్ర నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ విభాగాన్ని ఆదేశించింది. స్థూపం నిర్మాణానికి 1,700 టన్నుల స్టీల్‌ను వినియోగించారు. అమర జ్యోతి కోసం వినియోగించిన రెండు రకాల స్టీల్‌ను జర్మనీ నుంచి తెప్పించారు. దుబాయ్ కంపెనీ దీన్ని అమర్చింది.

కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు పెరిగాయి

» బిల్డర్ ఆత్మహత్య అత్యంత బాధాకరం: హరీశ్ రావు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరుసగా రైతులు, చేనేత కార్మికులు, ఆటోడ్రైవర్లు.. ఇప్పుడు బిల్డర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రత్యక్షంగా, పరోక్షంగా.. కాంగ్రెస్ నిర్లక్ష్య పాలన వల్లే.. ఈ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో నిర్మాణ రంగానికి స్వర్గధామమైన హైదరాబాద్‌లో.. ప్లాట్లు అమ్ముడుపోలేదని మేడ్చల్ జిల్లాలో బిల్డర్ ఉరేసుకునే పరిస్థితి రావడం శోచనీయమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతలు దిగజారడం, పాలనపట్ల ప్రజల్లో నమ్మకం పోవడం, అనుమతి ఉన్న ఇళ్లను సైతం హైడ్రా పేరిట కూల్చివేయడం వంటివి ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. "మూసీ, ఫార్మా సిటీ, మెట్రో కారిడార్ల విషయంలో ద్వంద్వ ప్రకటనలు, అభివృద్ధి వనరులు కల్పించకపోవడం, భవననిర్మాణ అనుమతులకు బలవంతపు వసూళ్లు.. కొత్తపెట్టుబడులు రాకపోవడం వంటివి హైదరాబాద్ ప్రతిష్ఠను దిగజార్చుతున్నాయి" అని ఆరోపించారు. సీఎం రేవంత్ అనాలోచిత నిర్ణయాలతో రియల్ రంగాన్ని నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు.



బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో డా విన్సీ రోబోటిక్ సర్జికల్ సిస్టంను ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న ఆస్పత్రి చైర్మన్ బాలకృష్ణ

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జికల్ వ్యవస్థ

» ప్రారంభించిన ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ

హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నొప్పి లేకుండా రోగులకు శస్త్రచికిత్సలు చేసేందుకు దోహదపడే డా విన్సీ రోబోటిక్ సర్జికల్ వ్యవస్థను బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చారు. ఆస్పత్రి చైర్మన్, ఏపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆయన సతీమణి వసుంధర దేవితో కలసి శుక్రవారం దీన్ని ప్రారంభించారు. ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ ప్రారంభించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక లోగోను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. తన తల్లి ఆశయాలకు అనుగుణంగా పేదలకు అందుబాటు ధరల్లో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స అందించాలనే లక్ష్యంలో భాగంగానే ఈ వ్యవస్థను ఆస్పత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే దాదాపు 800కి పైగా రోబోటిక్ సర్జరీలు చేశామని.. ఇది దేశంలోనే ఒక రికార్డని చెప్పారు. తమ ఆస్పత్రికి సహకరిస్తున్న దాతలకు, బ్యాంకర్లకు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు రూ.10 కోట్ల ఖరీదైన ఈ అత్యాధునిక ఫోర్త్ జనరేషన్ రోబోటిక్ సర్జికల్ వ్యవస్థ ద్వారా రోగులకు నొప్పిలేని రీతిలో శస్త్ర చికిత్సలు చేయవచ్చని వైద్యులు వివరించారు.

గురితప్పిన క్షిపణిలా సీఎం రేవంత్

» తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ భేటీలో కవిత

పంజాగుట్ట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులపై కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెబుతోందని పలువురు వక్తలు ఆరోపించారు. నీళ్ల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జలవనరులు, ప్రాజెక్టులపై "నీళ్లు - నిజాలు" అనే అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు మేధావులు, నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజనీర్లు పాల్గొన్నారు. అనంతరం పలు తీర్మానాలు ఆమోదించి, సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కేసీఆర్‌పై అక్కసుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడమే కాకుండా రైతులకు నీళ్లు ఇవ్వకుండా పొలాలను ఎండబెడుతున్నారని మండిపడ్డారు. నీళ్ల విషయాల్లో రాజకీయాలు మానేసి నిజాలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గురితప్పిన క్షిపణిలా పని చేస్తున్నారని, కేసీఆర్‌ను శత్రువులాగా భావిస్తున్నారని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేవని సాగునీటి శాఖ మాజీ ఓఎస్డీ, విశ్రాంత ఇంజనీర్ శ్రీధర్ రావు దేశ్ పాండే అన్నారు.

'కాంట్రాక్టు' క్రమబద్ధీకరణకు తొలగిన అడ్డంకులు

» హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని న్యాయస్థానాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు అడ్డంకులు తొలగాయి. హైకోర్టు తీర్పుపై జోక్యానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఫాస్ట్ ట్రాక్ (జిల్లా కోర్టులు, ట్రిబ్యునల్స్) కోర్టుల్లో పని చేసే 174 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైంది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను తొలగిస్తూ 2021 ఏప్రిల్ 1న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆదేశాలిచ్చారు. దీంతో కాంట్రాక్టు ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు తర్వాత 2023లో ఉద్యోగులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే తీర్పును అదే ఏడాది జూలై 27న హైకోర్టు రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్) సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారించింది. శుక్రవారం హైకోర్టు తీర్పును సమర్థిస్తూ, పిటిషన్‌ను కొట్టివేసింది.

జైలు నుంచి విడుదలైన రాధాకిషన్ రావు

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక నిందితుల్లో ఒకరైన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు శుక్రవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. గత మార్చిలో అరెస్టైన రాధాకిషన్ రావు 10 నెలల పాటు జైలులో ఉన్నారు.

ఆర్థిక సర్వే.. కాంగ్రెస్‌కు చెంపదెబ్బ

» మా పదేళ్ల పాలనా విజయానికి సాక్ష్యం

» రాష్ట్ర సమగ్రాభివృద్ధిని సర్వే వెల్లడించింది: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే నివేదిక కాంగ్రెస్ అబద్ధపు ప్రచారానికి చెంపదెబ్బ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌కు పాలనచేతకాక, గత ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని ఈ సర్వే తేల్చిందని తెలిపారు. ఆర్థిక స్వావలంబన, వ్యవసాయ, మహిళా ప్రగతి, నీటి పారుదల వంటి రంగాల్లో బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వ విజయానికి సాక్ష్యమన్నారు. కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సర్వే 2024-25 పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో సాధించిన సమగ్ర ప్రగతిని స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. పదేళ్లలో మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు అభివృద్ధి కోసం కృషి చేశారని, ఫలితంగా తెలంగాణ పట్టణాలకు అనేక జాతీయ అవార్డులు దక్కాయని కేటీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. కొత్తగా కట్టాల్సిందిపోయి హైడ్రా, మూసీ ప్రాజెక్టుల పేరుతో కూలగొడుతున్నారని విమర్శించారు. రైతుల ఖాతాల్లో టకీ టకీ మని పైసలు పడతాయని అన్నారని.. తెలంగాణలో కాకుండా టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

ప్రయాగ్‌రాజ్‌లో నలుగురు మహిళల అదృశ్యం!

» జగిత్యాల నుంచి 12మంది కుంభమేళాకు

» గల్లంతైన నలుగురూ అక్కాచెల్లెళ్లే

» 24 గంటలు గడిచినా దొరకని ఆచూకీ

జగిత్యాల, ఖానాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో పుణ్యస్నాం చేసేందుకు ఎంతో ఉత్సాహంగా జగిత్యాల నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లిన ఆ బృందం ఇప్పుడు అక్కడ ఆందోళన పడిపోయింది. 12మందితో కూడిన ఆ బృందంలో నలుగురు కనిపించకపోవడమే వారి ఆందోళనకు కారణం! ఆ నలుగురూ స్వయానా అక్కాచెల్లెళ్లు కావడం గమనార్హం. జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్, కొత్తవాడ కాలనీలతో పాటు నిర్మల్ జిల్లా కడెం గ్రామానికి చెందిన 12 మంది ఓ అద్దె వాహనంలో జనవరి 27న రాత్రి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. వీరిలో 11 మంది మహిళలే. 29న రాత్రి ఈ బృందం ప్రయాగ్‌రాజ్ చేరుకుంది. 30న తీవ్ర రద్దీ కారణంగా స్నాన ఘట్టాలకు ఓ పది కి.మీ దూరంలోనే వాహనాన్ని ఆపి.. అక్కడి నుంచి రెండు ఆటోల్లో ఆరుగురు చొప్పున ఎక్కి బయలుదేరారు. ఘట్టాల వద్దకు చేరుకున్నాక సెల్‌ఫోన్లను ఆటోల్లోనే వదిలేసి స్నానాలకు దిగారు. అయితే



బెల్లం సత్తవ్వ, వీర్ల నర్సవ్వ, ఏనుగుల బుచ్చవ్వ, ఆది రాజవ్వ(ఫైల్)

తిరిగి ఆటోల వద్దకు మాత్రం పన్నెండుగురిలో ఎనిమిది మందే వచ్చారు. అక్కాచెల్లెళ్లయిన.. జగిత్యాలకు చెందిన వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ, కడెంకు చెందిన ఏనుగుల బుచ్చవ్వ, కడెంకు చెందిన బెల్లపు సత్తవ్వలు ఆటోల వద్దకు తిరిగి రాలేదు. ఈ నలుగురి కోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. విషయం తెలిసి ఇక్కడ వారి కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఘటన గురించి స్థానిక అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. వారొచ్చి.. మిగతా ఎనిమిదిమంది కోసం ఓ చోట ప్రత్యేకంగా ఆశ్రయం కల్పించారు. ఇక.. బాధిత కుటుంబసభ్యులు జగిత్యాల నుంచి ప్రత్యేకంగా ఓ కార్లో ప్రయాగ్‌రాజ్ బయలుదేరారు. తప్పిపోయిన మహిళల కోసం విస్తృతంగా గాలిస్తున్నామని అద్దె వాహనం డ్రైవర్ రాకేశ్ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. గల్లంతైన మహిళల వద్ద ఫోన్లు లేకపోవడం, వారికి తెలుగు తప్ప మరే భాష రాకపోవడం ఇబ్బందిగా మారిందని చెప్పాడు. మహిళల ఆచూకీ లభించగానే తిరుగు ప్రయాణం అవుతామని చెప్పాడు.

తగిన సమయం అంటే ఎంత?

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వటానికే పది నెలలా?

» అసెంబ్లీ పదవీకాలం ముగిసే సమయానికి నిర్ణయం వెలువరిస్తారా?

» మహారాష్ట్ర స్పీకర్‌లా వ్యవహరిస్తారా?'

» ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత కేసులో స్పీకర్‌పై సుప్రీం ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత కేసులో సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి రీజనబుల్ (తగిన) సమయం అంటే ఎంత? నోటీసులు ఇవ్వడానికే స్పీకర్ కార్యాలయానికి పది నెలల సమయం పట్టిందా? అసెంబ్లీ పదవీకాలం ముగింపు దశలో స్పీకర్ నిర్ణయం చెబుతారా? మహారాష్ట్ర స్పీకర్‌లా వ్యవహరిస్తారా?' అంటూ ప్రశ్నలు కురిపించింది. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఆ తర్వాత పార్టీ ఫిరాయించారని, వారిపై స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ జనవరి 15న సుప్రీంకోర్టులో విడివిడిగా స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిలను అనర్హులుగా ప్రకటించేలా స్పీకర్‌ను ఆదేశించాలని ఆ పిటిషన్లలో కోరారు. వాటిపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు, మోహిత్ రావు, అసెంబ్లీ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు.



పది నెలలైనా చర్యల్లేవు

శేషాద్రి నాయుడు, మోహిత్ రావు వాదనలు వినిపిస్తూ.. 'ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశాం. పది నెలలు దాటుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. హైకోర్టు ఆర్డర్ వచ్చి ఇప్పటికి ఏడు నెలలు అవుతోంది. అయినా, నేటికీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు' అని తెలిపారు. స్పీకర్ తరఫున రోహత్గి వాదిస్తూ.. హైకోర్టు తీర్పు తర్వాత మళ్లీ రిట్ పిటిషన్లు దాఖలయ్యాయని, ఎమ్మెల్యేలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. 'అదేంటి.. నోటీసులు ఇవ్వడానికే స్పీకర్ కార్యాలయానికి పది నెలలు పట్టిందా? స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి రీజనబుల్ సమయం అంటే ఎంత?' అని రోహత్గీని ప్రశ్నించారు. దీనికి రోహత్గీ బదులిస్తూ.. స్పీకర్ నిర్ణయానికి సంబంధించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గతంలోనే స్పష్టమైన తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ తగు నిర్ణయం తీసుకోవడానికి ఎమ్మెల్యేలకు నిర్దీత సమయం ఇవ్వాలని ఆ తీర్పులో స్పష్టంగా ఉందన్నారు. దీనిపై జస్టిస్ గవాయ్ మళ్లీ స్పందిస్తూ.. 'ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే.. శాసనసభ పదవీకాలం ముగిసేటప్పుడు నిర్ణయం చెబుతారా? అనర్హతపై మీరు కూడా మహారాష్ట్ర స్పీకర్ చెప్పినట్టే నిర్ణయాన్ని వెల్లడిస్తారా?' అని అసహనం వ్యక్తం చేశారు.

ఒక్క ఫోన్ చేస్తే సరిపోదా? హైదరాబాద్ వెళ్లి రావాలా?

పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవటానికి ఎంత సమయం పడుతుంతో అసెంబ్లీ కార్యదర్శిని కనుక్కొని చెప్పండి అంటూ జస్టిస్ గవాయ్.. రోహత్గీని ఆదేశించారు. రెండు వారాల సమయం ఇవ్వాలని రోహత్గీ విజ్ఞప్తి చేయగా, 'ఈ విషయం మాట్లాడడానికి మీరు హైదరాబాద్ వెళ్లి రావాల్సిన అవసరం లేదు కదా? ఒక్క ఫోన్ చేస్తే సరిపోతుంది?' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. సుప్రీంకోర్టు విచారించనున్న కేసుల జాబితా ప్రకారం ఈ కేసు ఫిబ్రవరి 10న మరోసారి విచారణకు వచ్చే అవకాశముంది. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఫిరాయింపులకు పాల్పడిన మరో ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపైనా అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ ఇదే ధర్మాసనం ఎదుట సోమవారం విచారణకు రానుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు.. కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి

» ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రకటన



కరీంనగర్, న్యూఢిల్లీ, హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా.. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఊటుకూరి నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రకటించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదించగా.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. కరీంనగర్-మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి ఫిబ్రవరి 27న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. వెంటనే కాంగ్రెస్ పార్టీ తాత్సారం చేయకుండా అభ్యర్థిని ఖరారు చేసింది. నిజానికి ఈ స్థానానికి సిటింగ్ అభ్యర్థి జీవన్‌రెడ్డి పేరునే అధిష్ఠానం వద్దకు టీపీసీసీ పంపింది. కానీ పోటీకి ఆయన విముఖత వ్యక్తం చేయడంతో నరేందర్ రెడ్డి పేరు పంపింది. పార్టీకే చెందిన వెలిచాల రాజేందర్ రెడ్డి కూడా చివరివరకూ పోటీపడ్డా.. అధిష్ఠానం నరేందర్ రెడ్డి పేరుకే పచ్చజెండా ఊపడంతో ఆయన అభ్యర్థిత్వం ఖరారైంది. ఎమ్మెల్సీ నియోజకవర్గం నాలుగు ఉమ్మడి జిల్లాల్లో విస్తరించి ఉన్నా.. కరీంనగర్ జిల్లాలోనే పట్టభద్రులు ఎక్కువగా ఉన్నారనే అంచనాల నేపథ్యంలోనే.. కరీంనగర్‌కు చెందిన నరేందర్‌రెడ్డిని అధిష్ఠానం ఖరారు చేసినట్టు చర్చ జరుగుతోంది. కాగా.. నరేందర్‌రెడ్డి ఇప్పటికే నాలుగు నెలలుగా నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. అన్ని వర్గాల మద్దతూ పొందే ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దఎత్తున ఓటర్ల నమోదు ప్రక్రియనూ చేపట్టారు. పలు కళాశాలల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి.. పట్టభద్రులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లి వారి ఓట్లను అభ్యర్థిస్తున్నారు.



ఫ్యాన్సీ నెంబర్లతో ఆర్‌టీఏకు లక్షల్లో ఆదాయం

» అత్యధికంగా 0009 నెంబర్‌కు రూ.10.46 లక్షలు

హైదరాబాద్ సిటీ, జనవరి31(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక నెంబర్ల కోసం వాహనదారులు పోటీ పడుతున్నారు. శుక్రవారం రవాణా శాఖ సెంట్రల్ జోన్‌లో టీజీ 09 ఈ సిరీస్ నెంబర్లకు జరిగిన వేలంలో సంస్థకు రూ.38,76,996 ఆదాయం సమకూరింది.

అత్యధిక ధర పలికిన నెంబర్లు

* టీజీ09ఈ 0009- రూ.10,46,999 లక్షలు- వెంకటేష్ గౌడ్
* టీజీ09డీ 9999- రూ.6.26 లక్షలు- ఎటెర్నల్ ఎవెన్యూస్
* టీజీ09ఈ 0001- రూ.4,69,900 లక్షలు- పేరటి శ్రీనివాస్‌రెడ్డి
* టీజీ09ఈ 0005- రూ.2,43001 లక్షలు- కారకౌన్సిల్ ప్రైవేట్ లిమిటెడ్
* టీజీ09ఈ 0006- రూ.2,25,117 లక్షలు- గోయజ్ జువెల్లరి ప్రైవేట్ లిమిటెడ్
* టీజీ09ఈ 0007- రూ.1,58,003 లక్షలు- ఎస్‌కే కార్ లాంజ్
* టీజీ09ఈ 0003- రూ.1.11 లక్షలు- వెస్ట్ లైన్ మెరైన్ బంకర్స్ ప్రైవేట్ లిమిటెడ్
* టీజీ09ఈ 0027- రూ.1.09 లక్షలు- న్యూలాండ్ లేబరేటరీస్ లిమిటెడ్
* టీజీ09ఈ 0019- రూ.1,00,019 లక్షలు- సితార ఎంటర్‌టైన్‌మెంట్స్

కమలానంద భారతిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ రద్దు

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హిందూ గురువు కమలానంద భారతి స్వామిపై ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను శుక్రవారం నాంపల్లిలోని 14వ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు రద్దు చేసింది. ఎంఐఎం పార్టీ నాయకులు అక్బరుద్దీన్, అసదుద్దీన్ ఒవైసీలతో పాటు ముస్లింలపై కమలానంద భారతి 2013లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కేసు నమోదయింది. విచారణకు హాజరు కావాల్సిందిగా 2022లో సిట్ ఇచ్చిన సమన్లు అందలేదని భారతి తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. సమన్లు స్వీకరించనందున నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను రద్దు చేయాలని కోరారు. 2012లో అక్బరుద్దీన్ హిందువులపై ముస్లింలను రెచ్చగొట్టేలా చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కేసును మళ్లీ విచారించాలని విజ్ఞప్తి చేశారు. వాదనల అనంతరం నాన్ బెయిలబుల్ వారెంట్‌ను కోర్టు రద్దు చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 10వ తేదీకి వాయిదా వేసింది.

177 మంది సెక్షన్ ఆఫీసర్ల బదిలీ!

» సచివాలయంలో ఉద్యోగుల ప్రక్షాళన

» రెండు జీవోలు జారీ చేసిన ప్రభుత్వం

» 'ఫోకల్ నుంచి ఫోకల్'కు బదిలీలంటూ ఆరోపణలు

» 15 ఏళ్లుగా ఒకే పోస్టులో ఉన్నవారినీ మార్చని వైనం

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సచివాలయంలో ఉద్యోగుల ప్రక్షాళన చేపట్టింది. 177 మంది సెక్షన్ ఆఫీసర్ల (ఎస్‌వో)ను బదిలీ చేసింది. దీర్ఘకాలికంగా ఒకే స్థానంలో ఉన్నవారికి స్థాన చలనం కలిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రెండు జీవోలను జారీ చేశారు. 236 జీవో ద్వారా 160 మంది ఎస్‌వోలను, 237 జీవో ద్వారా 17 మందిని బదిలీ చేశారు. కొంత మందిని నాన్-ఫోకల్ పాయింట్ల నుంచి ఫోకల్ పాయింట్లకు మార్చినా.. ఇంకా కొందరిని ఫోకల్ పాయింట్ల నుంచి ఫోకల్ పాయింట్లకే బదిలీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ, సహకార శాఖ నుంచి 10 మందిని, పశు సంవర్థక శాఖ నుంచి నలుగురిని, వెనకబడిన తరగతుల నుంచి ఐదుగురిని, అటవీ శాఖ నుంచి ముగ్గురిని, విద్యుత్తు శాఖ నుంచి నలుగురిని, సాధారణ పరిపాలనా శాఖ నుంచి 36 మందిని, ఉన్నత విద్యా శాఖ నుంచి ఇద్దరిని, ఆరోగ్య శాఖ నుంచి ఐదుగురిని, హోంశాఖ



నుంచి 10 మందిని, నీటి పారుదల శాఖ నుంచి 13 మందిని, పరిశ్రమల శాఖ నుంచి 8 మందిని, కార్మిక శాఖ నుంచి నలుగురిని, పురపాలక శాఖ నుంచి 8 మందిని, మైనారిటీ సంక్షేమం నుంచి ఇద్దరిని, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ నుంచి ఒక్కరిని, ప్రణాళిక శాఖ నుంచి ఆరుగురిని, పంచాయతీరాజ్ శాఖ నుంచి 9 మందిని, రెవెన్యూ శాఖ నుంచి 19 మందిని, ఎస్సీ అభివృద్ధి, పాఠశాల విద్యా శాఖల నుంచి ఆరుగురి చొప్పున, రవాణా శాఖ నుంచి 9 మందిని, గిరిజన, మహిళ సంక్షేమ శాఖలు, యువజన సర్వీసుల శాఖల నుంచి ఇద్దరేసి అధికారులను బదిలీ చేసింది.

చాలా కాలం తర్వాత బదిలీలు..

తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి సచివాలయంలో సెక్షన్ అధికారుల స్థాయిలో బదిలీలు జరగలేదు. ఏ శాఖలోనైనా అత్యంత ప్రధానమైన జీవోలను తయారు చేసేది ఈ అధికారులే. ఆయా శాఖల ముఖ్యకార్యదర్శులు చేసే సూచనల మేరకు వీరు జీవోలను రూపొందిస్తారు. ఇంతటి కీలక బాధ్యతలు నిర్వర్తించే అధికారులను బదిలీ చేయకపోవడంతో సచివాలయ ఉద్యోగ సంఘాల నుంచి తీవ్ర విమర్శలొచ్చాయి. సచివాలయ నియమాలు, సర్వీసు నిబంధనల ప్రకారం.. సచివాలయంలో ఒక పోస్టులో మూడేళ్లకు మించి పని చేయడానికి వీల్లేదు. ఒకే శాఖలో ఆరేళ్లకు మించి పని చేయరాదు. కానీ, కొంత మంది ఎస్‌వోలు ఉద్యోగాల్లో చేరినప్పటి నుంచి అవే పోస్టుల్లో కొనసాగుతున్నారు. రెవెన్యూ, సాగునీటి పారుదల, పురపాలక, వైద్య ఆరోగ్యం, విద్య, విద్యుత్తు, ఆర్థికం వంటి కీలక శాఖల్లో కొంత మంది అధికారులు పాతుకుపోయి ఉండడంపై ఆరోపణలు వచ్చాయి. ఒకే పోస్టులో 25 ఏళ్ల నుంచి కొనసాగుతున్నవారూ ఉన్నారు. ఇలాంటి వారందరినీ ప్రభుత్వం తాజాగా బదిలీ చేసింది. కానీ, ఈ బదిలీలపై ఉద్యోగ సంఘాల నుంచి విమర్శలొస్తున్నాయి. కొంత మందిని ఫోకల్ పాయింట్ నుంచి ఫోకల్ పాయింటకే మార్చారన్న ఆరోపణలున్నాయి. సాధారణ పరిపాలన శాఖలో 15 ఏళ్ల నుంచి పని చేస్తున్న ఒక ఎస్‌వోను బదిలీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ముఖ్యకార్యదర్శులతో సన్నిహితంగా ఉన్నవారిని బదిలీ చేయలేదని అంటున్నారు. నాన్ ఫోకల్ పాయింట్ల నుంచి ఫోకల్ పాయింట్లకు, ప్రాధాన్య పోస్టుల నుంచి అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలంటూ సీఎం రేవంత్ ఆదేశించారు. అయినా కొన్ని బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని సచివాలయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

'స్వర్ణాంధ్ర' సాధనలో భాగస్వాములు కండి!

వైశ్యులకు చంద్రబాబు పిలుపు

» కార్పొరేషన్ ద్వారా వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు

» త్యాగం, శక్తికి ప్రతీక వాసవీ మాత: సీఎం

» పెనుగొండలోని వాసవీ ధామ్ సందర్శన

» అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ

పెనుగొండ/ఆచంట/భీమవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్-2047లో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఆర్యవైశ్యులను వృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటైందన్నారు. దాని ద్వారా వారి వ్యాపారాభివృద్ధికి సహకరిస్తామని భరోసా ఇచ్చారు. వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో నగరేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. వేద పండితులు శాస్త్రోక్తంగా ముఖ్యమంత్రితో అమ్మవారికి పూజలు చేయించి ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆయన సమీపంలోని వాసవీధామ్‌ను



పెనుగొండ నగరేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

సందర్శించారు. ఈ ఆలయాన్ని దర్శించడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. దేశవ్యాప్తంగా అమ్మవారికి ఆర్యవైశ్యులు ఆలయాలు నిర్మించారని, ఇక్కడి వాసవీ మాత ఆలయానికి భవిష్యత్తులో మరింత పేరు ప్రఖ్యాతలు లభిస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు. 90 అడుగుల పంచలోహ వాసవీ మాత విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వాసవీధామ్ ట్రస్ట్ సభ్యులు చంద్రబాబును సత్కరించారు. తర్వాత సీఎం భక్తులనుద్దేశించి మాట్లాడారు. "మహిళల ఆత్మ గౌరవాన్ని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు చాటారు. శాంతి కోసం వాసవీ మాత ఆత్మ బలిదానం చేశారు. ఆర్యవైశ్యుల ఇలవేల్పు, అహింసకు, ఆత్మ త్యాగానికి, ధర్మనిరతికి, శాంతికి ప్రతిరూపం వాసవీ కన్యకాపరమేశ్వరి. అమ్మను వేడుకుంటే శాంతి, సంపద, రక్షణ. ఆశీస్సులు మెండుగా లభిస్తాయని అందరికీ నమ్మకం. దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులు కొలిచే దేవత వాసవీ కన్యకా పరమేశ్వరి. త్యాగానికి, శక్తికి, సంకల్పానికి ప్రతీకైన అమ్మవారికి ప్రభుత్వం తరఫున తొలిసారిగా పట్టువస్త్రాలను సమర్పించడం పూర్వ జన్మ సుకృతం" అని చంద్రబాబు పేర్కొన్నారు. వాసవీ మాత ఆలయం, వాసవీధామ్‌లో చంద్రబాబు సుమారు రెండు గంటలు గడిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.